



# మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక






ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 146 శనివారం 17 జనవరి 2026:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు 22 :- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్




# తిరుపతిలో ఏపీ ఫస్ట్

## అతిపెద్ద రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు నిర్ణయం

తిరుపతి కేంద్రంగా అతిపెద్ద రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ఏపీ ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ పేరుతో ఈ కేంద్రం ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు.

- ఏపీ ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్
- తిరుపతి ఐఐటీ-ఐఐఎస్ఈఆర్ కాంబినేషన్‌తో ఏపీఫస్ట్ ఏర్పాటు
- ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో సీఎం సమావేశం
- యువత భవిష్యత్తుకు బాటలు వేసేలా పరిశోధనలు
- యువతకు, రాష్ట్రానికి మేలు జరిగేలా అతిపెద్ద రీసెర్చ్ కేంద్రంగా ఏపీ ఫస్ట్
- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు


అమరావతి: యువతరం భవిష్యత్తును తీర్చిదిద్దేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని... ఆ దిశగా వారికి అన్ని విధాలా సహకరించేలా రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు భవిష్యత్తులో ఏయే రంగాల్లో అవకాశాలు ఉంటాయో గుర్తించడంతో పాటు...ఆయా రంగాల్లో వారిలో నైపుణ్యాన్ని పెంచడంపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు. క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో సీఎం సమావేశమయ్యారు. ఈ భేటీలో డ్రోన్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో తిరుపతి కేంద్రంగా అతిపెద్ద రీసెర్చ్ కేంద్రం

మిగతా 2 లో

### స్వర్ణచంద్రగిరికి ప్రణాళికలు

నారావారి పల్లె తరహాలో సుస్థిరాభివృద్ధి

అధికారులకు సూచించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



# 'స్టార్టప్ ఇండియా' విప్లవం

- రాబోయే పదేళ్లలో అగ్రగామిగా భారత్
- కంఫర్ట్ జోన్‌లో జీవించే ఆలోచన యువతకు లేదు
- 'నేషనల్ స్టార్టప్ డే' కార్యక్రమంలో ప్రధాని మోదీ



03

బీజేపీ అధ్యక్ష ఎన్నికకు

## రంగం సిద్ధం

19న నామినేషన్..

20 ఎన్నికల ప్రక్రియ



03

## ఇంక్‌కు బదులు మార్కర్ పెన్ను ఉపయోగం



03

- మహారాష్ట్రలో ఇసి తీరుపై మండిపడ్డ రాహుల్
- ఇది ముమ్మాటికీ ఓట్ చోరీ అంటూ ఆగ్రహం

# రాష్ట్రంలో పూర్తిగా కొరవడిన శాంతి భద్రతలు

## మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి



**అమరావతి:** రాష్ట్రంఅబశ్రీశ్రీలో శాంతి భద్రతలు పూర్తిగా కొరవడ్డాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామానికి చెందిన దళిత కార్యకర్త మందా సల్మాన్ హత్య అత్యంత దారుణమని పేర్కొంటూ, ఈ ఘటన రాష్ట్రంలో న్యాయపాలన లేదనడానికి నిదర్శనమని అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలపై దాడులు నిత్యకృత్యంగా మారిపోయాయని, ప్రజలను రక్షించాల్సిన పోలీసులు అధికార పార్టీ నేతలతో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం

మిగతా 2 లో



# కాకినాడలో పది బిలియన్ డాలర్ల పెట్టుబడి

## ఎక్స్ వేదికగా వివరాలు వెల్లడించిన మంత్రి లోకేశ్

**అమరావతి :** ఏపీలో భారీ పెట్టుబడి పెట్టేందుకు ఏఎం గ్రీన్ సంస్థ ముందుకొచ్చిందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పెట్టుబడుల వివరాలు వెల్లడిస్తూ 'ఎక్స్'లో

మిగతా 2 లో




మహారాష్ట్ర మున్సిపల్

## ఫలితాలు

- జాల్నా నుంచి శ్రీకాంత్ పాంగార్కర్ విజయం
- జర్నలిస్ట్ గౌరీ లంకేశ్ హత్యకేసులో నిందితుడు

.. వివరాలు 2లో



## బాలుడికి పురాతన నాణెలు లభ్యం

రంగంలోకి దిగి తవ్వకాలు చేపట్టిన పురావస్తు శాఖ

.. వివరాలు 2లో

# ఏడాది తిరక్కుండానే.. మళ్లీ బాదుడు

## భూముల విలువ పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు




### ఆదాయార్జనే ధ్యేయంగా పావులు కదుపుతున్న చంద్రబాబు సర్కారు


- భూముల విలువ తగ్గితే క్రయ విక్రయాలపై తీవ్ర ప్రభావం
- రియల్ ఎస్టేట్ రంగం మరింత కుదేలయ్యే ప్రమాదం
- క్లాసిఫికేషన్ మార్పులకు రంగం సిద్ధం
- ప్రభుత్వ తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

**అమరావతి:** ఏదైనా స్థిరాస్తి కొనాలన్నా, అమ్మాలన్నా ప్రజలకు ఎదురయ్యే అతిపెద్ద ఖర్చుల్లో రిజిస్ట్రేషన్ చార్జీలు ఒకటి. ఇప్పటికే పెరిగిపోయిన ధరలు, బ్యాంకు వడ్డీలు, నిర్మాణ వ్యయాల మధ్య సామాన్యుడు ఆస్తి లావాదేవీల వైపు అడుగు వేయాలంటేనే భయపడుతున్న పరిస్థితి. అలాంటి సమయంలో మళ్లీ రిజిస్ట్రేషన్ల బాదుడు పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్న వార్తలు ప్రజలను

మిగతా 2 లో

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# తిరుపతిలో ఏపీ ఫస్ట్



మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను ముఖ్యమంత్రి అంగీకరించారు. ఏపీ ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ-ఏపీ ఫస్ట్ పేరుతో తిరుపతిలో రీసెర్చ్ కేంద్రం ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. వివిధ రంగాల్లో కంపెనీలు కూడా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయి. ఎయిరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ, ఏఐ-సైబర్ సెక్యూర్టీ, సెమీ కండక్టర్ల డివైసెస్-సెన్సార్లు, క్వాంటం టెక్నాలజీ, హెల్త్ కేర్, బయో టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, రూరల్ ఏరియా టెక్నాలజీ వంటి రంగాలు భవిష్యత్తులో కీలకం కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనికి అనుగుణంగా పాలసీలు రూపొందిస్తోంది. ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టే కంపెనీలను ప్రోత్సహిస్తోంది. దేశంలో తొలిసారిగా గ్రీన్ ఎనర్జీ రంగంలో గ్రీన్ అమోనియా ప్లాంట్ కాకినాడలో ఏర్పాటు చేయబోతున్నాం. ఈ తరహాలో కొత్త ఆవిష్కరణలకు...వివిధ స్టార్టప్ కంపెనీలకు రాష్ట్రం వేదికగా నిలవాల్సిన అవసరం ఉంది. ఇలా వచ్చే కంపెనీలకు... పరిశ్రమలకు నైపుణ్యమున్న యువతను అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. ఈ మేరకు భవిష్యత్తులో డిమాండ్ ఉన్న రంగాలకు పెద్దపీట వేయడమే కాకుండా...స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. వీటికి రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి ఓ అతి పెద్ద రీసెర్చ్ కేంద్రం అవసరం. తిరుపతిలో ఏర్పాటు చేయబోతున్న ఏపీ-ఫస్ట్ వ్యవస్థ ఆ అవసరాలను తీర్చేలా... రాష్ట్రంలోని యువతకు సహకరించేలా పూర్తి స్థాయిలో పనిచేయాలి. తిరుపతిలోని ఐఐటీ-ఐఐఎస్ఈఆర్ రెండు ప్రముఖ జాతీయ విద్యా సంస్థల కాంబినేషన్లో ఏపీఫస్ట్ ఏర్పాటు కాబోతోంది. దీన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దాలి. ఏపీ ఫస్ట్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వంతోనూ సంప్రదింపులు జరపాలి."అని సీఎం చంద్రబాబు చెప్పారు. "రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన నిరంతరం ఏపీని అభివృద్ధి చేయడంతోపాటు... యువతకు చక్కటి ఉపాధి కల్పించడంపైనే ఉంటుంది. సంక్షేమానికి-అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఏ స్థాయిలో ఆలోచన చేస్తుందో... యువతకు మెరుగైన అవకాశాలు అందించే విషయంలోనూ అదే స్థాయిలో ప్రణాళికలు సిద్దం చేస్తోంది. దీంట్లో భాగంగానే ఏపీ ఫస్ట్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. యూనివర్శిటీలు, వివిధ రంగాల్లో ప్రముఖ స్థానంలో ఉన్న కంపెనీలతో ఏపీ ఫస్ట్ సమన్వయం చేసుకోవాలి. ఇప్పటికే వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ యూనివర్శిటీల్లో విద్యార్థులు కొత్త కొత్త ఆవిష్కరణలు చేస్తున్నారు. వాటిని అందిపుచ్చుకోవాలి. దీంతో యువతలో వివిధ రంగాల్లో నైపుణ్యం పెంచేందుకు పరిశ్రమలు, కంపెనీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ఉండాలి. దీంతో పాటు అందుబాటులోకి వస్తోన్న టెక్నాలజీలు ఏంటీ...? ఏయే రంగాల్లో అభివృద్ధి జరుగుతోందనే విషయాలను గుర్తించి.. వాటిని కరిక్యులమ్‌లో చేర్చేలా విద్యా సంస్థలతో సంప్రదింపులు జరపాలి. ఈ మేరకు ఆయా విద్యా సంస్థలకు కరిక్యులమ్ ప్రిపేర్ చేసేలా ఏపీ ఫస్ట్ పని చేయాల్సిన అవసరం ఉంటుంది. ఐటీని ప్రమోట్ చేయడం వల్ల ఇప్పుడు తెలుగువాళ్లు ఐటీలో మేటిగా ఉన్నారు. అలాగే ఫార్మా రంగంలో భవిష్యత్ ఉంటుందని గుర్తించడం వల్లే తెలుగు రాష్ట్రాలు ఫార్మాలో అగ్రభాగాన ఉన్నాయి. ఇదే తరహాలో భవిష్యత్ రంగాలను నేటి యువత అందిపుచ్చుకోవాలి. దానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్దం చేస్తోంది. యువత భవిత కోసం... స్టార్టప్ కంపెనీలకు మరింత చేయూతనివ్వడం కోసం ఏపీ ఫస్ట్ వ్యవస్థ కృషి చేయాలి. వచ్చే మూడేళ్లల్లో కీలక పురోగతి కనబరిచేలా ఏపీ ఫస్ట్ పని చేయాలి." అని ముఖ్యమంత్రి సూచించారు. "డ్రోన్ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేయాలి. ప్రకృతి వైపరీత్యాల సందర్భాల్లో డ్రోన్లను వినియోగించి బాధితులకు సేవలు అందించాం. ఇప్పుడు అంతకు మించిన స్థాయిలో డ్రోన్లను వినియోగించుకుని ప్రజలకు సేవలు అందించేలా చూడాలి. వ్యవసాయం, మెడికల్ ఎమర్జెన్సీ వంటి వాటిల్లో డ్రోన్ల వినియోగం పెరగాల్సిన అవసరం ఉంది. ఇవన్నీ ఫ్యూచర్ టెక్నాలజీలు.. కానీ వీటికి మనం ఇప్పటి నుంచే సంసిద్దత కావాల్సి ఉంది. వివిధ దేశాల్లో డ్రోన్ల ద్వారా ఎలాంటి సేవలు అందుతున్నాయోననే అంశాన్ని పరిశీలించాలి... అధ్యయనం చేయాలి. టెక్నాలజీ విషయంలో ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతూ ఉండాలి. టెక్నాలజీని అందరూ అందిపుచ్చుకున్నాక... మనం అప్పుడు మేల్కొనే కంటే... ముందుగానే టెక్నాలజీని అందిపుచ్చుకునేలా మన వ్యవస్థలను సిద్దం చేయాలి. డ్రోన్ కార్పొరేషన్ నిపుణులతో కూడిన సలహా బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలి. వచ్చే ఇంటర్నేషనల్ డ్రోన్ డే నాటికి డ్రోన్ల ద్వారా సేవలు ఏ విధంగా అందించవచ్చోననే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషిని ప్రజలకు కళ్లకు కట్టేలా చూపాలి. డ్రోన్ ట్యాక్సీ, డ్రోన్ అంబులెన్స్ వంటి అంశాల్లో లోతుగా అధ్యయనం చేయండి. కేంద్రంతో సంప్రదింపులు జరిపి.. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ మేనేజ్మెంట్ వ్యవస్థ తరహాలో డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ మేనేజ్మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేయవచ్చేమోననేది పరిశీలించండి."అని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఏరో స్పేస్ డిఫెన్స్ సలహాదారు సతీష్ రెడ్డి, ఐటీ-డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ సలహాదారు అమిత్ దుగర్, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కెఎన్ సత్యనారాయణ, ప్రొఫెసర్ సెంథిల్ కుమార్, డీఎంటీఐ డైరెక్టర్ కల్నల్ పీఎస్ రెడ్డి సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## స్వర్ణచంద్రగిరికి ప్రణాళికలు

**నారావారి పల్లె తరహాలో సుస్థిరాభివృద్ధి**

**అధికారులకు సూచించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు**

**తిరుపతి :** తిరుపతి జిల్లాలోని చంద్రగిరి మండలాన్ని అభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దేందుకు స్వర్ణ చంద్రగిరి ప్రణాళికని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం నారావారిప్లలెలో ప్రకటించారు. స్వర్ణనారావారిపల్లె తరహాలో స్వర్ణ చంద్రగిరికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. స్వర్ణకుప్పం, నారావారిప్లలె తరహాలోనే సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా స్వర్ణ చంద్రగిరి మండలాన్ని తీర్చిదిద్దుతామని చెప్పారు. ఇందుకు వీలుగా ప్రణాళికలను అమలు చేయాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. చంద్రగిరి మండలంలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ఈ అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయనున్నట్లు సీఎం తెలిపారు. గత ఏడాది సంక్రాంతికి కందులవారిపల్లి, చిన్న రామాపురం, ఎ రంగంపేట గ్రామాలను కలిపి స్వర్ణ నారావారిప్లలె కార్యక్రమానికి ఎంపిక చేసిన విషయం విదితమే. ఈ ప్రాజెక్టు ద్వారా ఒక్క ఏడాదిలోనే అద్భుతమైన ఫలితాలు వచ్చాయి. ఏడాది కాలంలోనే అన్ని ఇళ్లకూ నూటికి నూరు శాతం సౌర ప్యానెళ్లను అమర్చడం ద్వారా ఇంధన స్వయం సమృద్ధిని సాధించింది. తద్వారా ప్రతి ఇంటికీ ఉచితంగానే విద్యుత్ వెలుగులు వచ్చాయి. శాస్త్రీయ పద్ధతుల్లో పాడి పరిశ్రమను ప్రోత్సహించడం, ప్రకృతి సేద్యం విస్తరణ తదితర ప్రణాళికల ద్వారా వారి తలసరి ఆదాయం 20 శాతం మేర పెరిగింది. మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా ప్రత్యేక స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ కార్యక్రమాలను కూడా సమర్థవంతంగా అమలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో ప్రతి లబ్దిదారుడికి చేరేలా చేయటంతో పాటు మౌలిక సదుపాయాల కల్పించారు. ఇప్పుడు ఇదే స్ఫూర్తితో చంద్రగిరి మండలం అంతటా ఈ ప్రాజెక్టును విస్తరించాలని నిర్ణయించారు. ఏడాది లోపు నిర్దేశిరచుకున్న ఫలితాలు సాధించాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

# రాష్ట్రంలో పూర్తిగా కొరవడిన శాంతి భద్రతలు

మొదటి పేజీ తరువాయి

చేశారు. రాష్ట్రంలో ప్రజలకు భద్రత లేకుండా పోయిందని, ముఖ్యంగా పేదలు, దళితులు, బలహీన వర్గాలు రాజకీయ కక్ష సాధింపులకు బలవుతున్నారని జగన్ మండిపడ్డారు. ఈ దారుణ హత్యకు బాధ్యులైన వారిని తప్పకుండా చట్టం ముందు నిలబెడతామని హెచ్చరించారు. మందా సల్మాన్ సోదరుడితో శుక్రవారం ఫోన్ ద్వారా మాట్లాడిన వైఎస్ జగన్, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సల్మాన్ కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే, దోషులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుని వారికి శిక్ష పడేలా చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సల్మాన్ కుటుంబ సభ్యులు పిన్నెల్లి గ్రామంలో అధికార పార్టీ నేతల నుంచి కొనసాగుతున్న బెదిరింపులు, దాడుల వివరాలను జగన్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే స్థానిక పోలీసుల ద్వారా వేధింపులు, తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. [illegible] స్పందించిన వైఎస్ జగన్, పార్టీ శ్రేణులు ఎలాంటి భయాందోళనలకు లోనవ్వాల్సిన అవసరం లేదని, ప్రతి విషయంలో పార్టీ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. అధికారాన్ని దుర్వినియోగం చేసి ప్రజల భద్రతను ధ్వంసం చేస్తున్న వారిని తప్పకుండా జవాబుదారీ చేయడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# కాకినాడలో పది బిలియన్ డాలర్ల పెట్టుబడి

మొదటి పేజీ తరువాయి

పోస్టు చేశారు. కాకినాడలో ఏఎం గ్రీన్ కంపెనీ.. 10 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏడాదికి 1.5 మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేయడంతోపాటు జర్మనీ, సింగపూర్, జపాన్‌కు ఎగుమతి చేయనున్నట్లు చెప్పారు. ఈ ప్లాంట్ ఏర్పాటుతో 8వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. దేశం నుంచి తొలిసారి గ్రీన్ అమ్మోనియా ఎగుమతికి సన్నాహాలు జరుగుతున్నాయని.. 2030 నాటికి ఏఎం గ్రీన్ కంపెనీ ఉత్పత్తి ప్రారంభిస్తుందని తెలిపారు.

# కోనసీమ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

**వైభవంగా సంక్రాతి ప్రభల ఉత్సవం**

**కోనసీమ :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి ప్రభల ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. 476 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్న జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని వీక్షించేందుకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. జిల్లాలోని అంబాజీపేట, అయినవిల్లి, అమలాపురం గ్రామీణ మండలాలకు చెందిన 11 ఏకాదశరుద్ర ప్రభలను ఇక్కడికి తీసుకొస్తున్నారు. గ్రామాల్లో ముహూర్తం నిర్ణయించి ఊరేగించారు. జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించిన విషయం తెలిసిందే. ఏటా కనుమ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రభలను కొలువుదీర్చుతారు. అక్కడ భక్తులు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఆయా గ్రామాలకు తరలివెళతాయి. వీటిల్లో టన్నులకొద్దీ బరువుండే గంగలకుర్రు, అగ్రహారం ప్రభలను స్థానిక ఎగువకౌశిక నదిని దాటించి యువకులు భుజాలపై మోసుకుని జగ్గన్నతోటకు తీసుకొస్తారు. ఈ సన్నివేశాన్ని చూసేందుకు జనం తరలివస్తారు. మిగతా వాటిని రోడ్డు మార్గంలో తీసుకొస్తారు. ఈ ఉత్సవం బందోబస్తులో 300కు పైగా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసారు. ఈ ఉత్సవం కోనసీమ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. ఈ సంప్రదాయ ఉత్సవంలో ఏకాదశ రుద్రుల ప్రభలు 11 గ్రామాల నుంచి ఊరేగింపుగా జగ్గన్నతోటకు తరలిరానున్నాయి. వ్యాఘ్రేశ్వరం, కె.పెదపూడి, ఇరుసుమండ, వక్కలంక వంటి గ్రామాల నుంచి కూడా ప్రభలు ఊరేగింపుగా వచ్చాయి. లక్షలాది మంది భక్తులు, పర్యాటకులు తరలి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం, స్థానిక అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జగ్గన్నతోటకు వచ్చే వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. వాహనాల దారి మళ్లింపు చేపట్టారు. భక్తులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పించారు. అలాగే ప్రభల ఉత్సవంలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా భారీ భద్రతను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ముందుస్తు జాగ్రత్త చర్యలో భాగంగా వైద్య సిబ్బందిని కూడా ఉంచారు. ప్రభుత్వం ఇచ్చిన రాష్ట్ర పండుగ హోదాతో జగ్గన్నపేట ప్రభల ఉత్సవం ఇకపై ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందే అవకాశం ఉందని స్థానిక ప్రజలు భావిస్తున్నారు.

# ఏడాది తిరక్కుండానే.. మళ్లీ బాదుడు

మొదటి పేజీ తరువాయి

కలవరపెడుతున్నాయి. 11 నెలల్లోనే రెండోసారి స్థిరాస్తుల మార్కెట్ విలువల సవరణపై ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టిందన్న సమాచారం రియల్ ఎస్టేట్ రంగంలో కలకలం రేపుతోంది. వాస్తవానికి 2025 ఫిబ్రవరిలోనే చంద్రబాబు ప్రభుత్వం భూములు, ఇళ్ల మార్కెట్ విలువలను ఏకంగా 50 శాతం వరకు పెంచింది. ఆ నిర్ణయంతో అప్పటికే రిజిస్ట్రేషన్ చార్జీలు, స్టాంప్ డ్యూటీ భారం ప్రజలపై భారీగా పడింది. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలు, చిన్న వ్యాపారులు, రైతులు తమ ఆస్తులను అమ్ముకోవాలన్నా, కొనుగోలు చేయాలన్నా తీవ్రంగా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పెంపుతో రిజిస్ట్రేషన్ సమయంలో చెల్లించాల్సిన మొత్తం ఒక్కసారిగా లక్షల్లో పెరిగిపోయింది. దీనివల్ల ఆస్తుల క్రయవిక్రయాలు మందగించాయి. మార్కెట్ లో లావాదేవీలు తగ్గిపోయాయి. అయినప్పటికీ, ప్రభుత్వం ఆ పరిస్థితిని గమనించకుండా మళ్లీ మార్కెట్ విలువల సవరణకు సిద్ధమవుతుండటం ప్రజల్లో ఆగ్రహాన్ని పెంచుతోంది. ఈసారి కూడా లక్ష్యం ఒక్కటే అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేమీ పట్టకుండా మళ్లీ రూ.3 వేల కోట్లకుపైగా అదనపు ఆదాయం రాబట్టాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని విమర్శకులు అంటున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా భారీ ఆదాయం సమకూర్చుకోవాలన్న ఆలోచనతోనే ఈ విలువల సవరణ ప్రక్రియ మొదలుపెట్టారని ఆరోపిస్తున్నారు. అందులో భాగంగానే అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఉన్న భూములు, ఇళ్ల విలువలను తిరిగి సవరించేందుకు ప్రతిపాదనలు పంపాలని జాయింట్ సబ్ రిజిస్ట్రార్లకు ఆదేశాలు వెళ్లినట్టు సమాచారం. అంటే రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలం, ప్రతి గ్రామం, ప్రతి నగర పరిధిలో ఉన్న ఆస్తుల విలువలను మరోసారి పెంచే ప్రయత్నం జరుగుతోందన్న మాట. ఇందులో భాగంగా భూముల క్లాసిఫికేషన్ ను కూడా మార్చే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సబ్ రిజిస్ట్రార్లకు సూచనలు ఇచ్చారన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటివరకు వ్యవసాయ భూమిగా ఉన్న కొన్ని ప్రాంతాలను నివాస లేదా వాణిజ్య ప్రాంతాలుగా చూపించి మార్కెట్ విలువను పెంచే అవకాశముందని రియల్ ఎస్టేట్ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. భూమి క్లాసిఫికేషన్ మారితే ఒక్కసారిగా విలువ రెట్టింపు అవుతుంది. దానికి అనుగుణంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు కూడా భారీగా పెరుగుతాయి. దీని భారం నేరుగా ప్రజల మీదే పడుతుంది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, విలువల సవరణ అత్యవసరమని చెబుతూ సబ్ రిజిస్ట్రార్ల సెలవులను కూడా రద్దు చేసినట్టు తెలుస్తోంది. అంటే ఎంత త్వరగా ఈ ప్రక్రియ పూర్తి చేసి కొత్త మార్కెట్ విలువలను అమల్లోకి తేవాలన్న ఆతృత ప్రభుత్వంలో కనిపిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాధారణంగా ఇలాంటి సవరణలకు కొంత సమయం తీసుకుంటారు. ప్రజాభిప్రాయాన్ని, మార్కెట్ పరిస్థితులను పరిగణలోకి తీసుకుంటారు. కానీ ఈసారి అలాంటివేమీ లేకుండా ఆదేశాలు జారీ చేయడం వెనుక ఆర్థిక ఒత్తిళ్లే కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి మందగించిందన్న విమర్శలు ఇప్పటికే తీవ్రంగా ఉన్నాయి. పెట్టుబడులు రావడం లేదని, పరిశ్రమలు కొత్తగా ఏర్పడటం లేదని, ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని పలువురు నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో రియల్ ఎస్టేట్ రంగం కూడా తీవ్రంగా దెబ్బతిన్నట్టు తెలుస్తోంది. గతంలో భారీగా లావాదేవీలు జరిగిన భూములు, లేఅవుట్లు, అపార్ట్మెంట్లు ఇప్పుడు అమ్ముడుపోవడం లేదని రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాపోతున్నారు. డిమాండ్ తగ్గిపోవడంతో ధరలు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల తగ్గుముఖం కూడా పట్టాయి. దీని ప్రభావం నేరుగా రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయంపై పడింది. గత ప్రభుత్వ హయాంలో ఏటా సుమారు రూ.10 వేల కోట్ల వరకు రిజిస్ట్రేషన్ల ద్వారా ఆదాయం వచ్చేదన్న గణాంకాలు ఉన్నాయి. స్థిరాస్తుల మార్కెట్ లో లావాదేవీలు చురుగ్గా సాగాయి. రైతులకు భరోసా, సామాజిక పథకాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నగదు ప్రవాహం పెరగడంతో భూముల కొనుగోళ్లు, ఇళ్ల నిర్మాణాలు పెరిగాయి. ఫలితంగా రిజిస్ట్రేషన్ల ఆదాయం కూడా స్థిరంగా ఉండేది. కానీ చంద్రబాబు సర్కారు వచ్చాక ఆ ఆదాయం గణనీయంగా తగ్గిపోయిందన్న విమర్శలు ఉన్నాయి. రూ.10 వేల కోట్ల స్థాయి నుంచి అది రూ.8 వేల కోట్లకు పడిపోయిందని చెబుతున్నారు. అంటే ఏటా సుమారు రూ.2 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లిందన్న మాట. దీనికి ప్రధాన కారణం రియల్ ఎస్టేట్ రంగం పడిపోవడమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆస్తుల లావాదేవీలు తగ్గిపోవడంతో రిజిస్ట్రేషన్లు కూడా తగ్గాయి. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు వచ్చే ఆదాయం పడిపోయింది. ఈ లోటును భర్తీ చేసుకునేందుకు ప్రజలపై చార్జీల బాదుడు పెంచే ప్రయత్నమే ప్రభుత్వం చేస్తోందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గత ఏడాది చార్జీలను ఏకంగా 50 శాతం పెంచడంతోనే ఈ మాత్రం ఆదాయం రాబట్టగలిగారని విమర్శకులు అంటున్నారు. అంటే లావాదేవీలు తగ్గినా, ఒక్కో రిజిస్ట్రేషన్ పై వసూలు చేసే మొత్తం పెరగడంతో ఆదాయం కొంతమేర నిలబెట్టగలిగారన్న మాట. ఇప్పుడు మరోసారి మార్కెట్ విలువలు పెంచితే మళ్లీ అదనంగా వేల కోట్ల రూపాయలు వసూలు చేయవచ్చన్న ఆలోచనతోనే ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్న విమర్శలు వస్తున్నాయి. ఈ విధానం దీర్ఘకాలంలో ప్రభుత్వానికే నష్టమని పలువురు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే భారం ఎక్కువై ప్రజలు రిజిస్ట్రేషన్లకు దూరంగా ఉంటున్నారు. కొందరు లావాదేవీలను వాయిదా వేస్తున్నారు. మరికొందరు అనధికారిక ఒప్పందాల వైపు మొగ్గు చూపే ప్రమాదం కూడా ఉందని నిపుణులు అంటున్నారు. అలా జరిగితే ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం పూర్తిగా తగ్గిపోతుంది. అంతేకాదు, నల్లధనం లావాదేవీలు పెరిగే అవకాశమూ ఉందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలకు ఈ భారం మరింత ఎక్కువగా ఉంటుంది. ఒక చిన్న ప్లాట్ కొనాలన్నా, ఒక ఫ్లాట్ రిజిస్టర్ చేయాలన్నా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులే లక్షల రూపాయలు అవుతున్నాయి. బ్యాంకు లోన్ తీసుకునే వారికి ఇది మరింత భారంగా మారుతోంది. ఇప్పటికే వడ్డీ రేట్లు పెరిగిన పరిస్థితుల్లో, రిజిస్ట్రేషన్ ఖర్చులు పెరగడం వల్ల ఇల్లు కొనాలన్న కలను చాలామంది వాయిదా వేసుకుంటున్నారు. దీని ప్రభావం నిర్మాణ రంగంపైనా పడుతోంది. కూలీలు, చిన్న కాంట్రాక్టర్లు, మెటీరియల్ సరఫరాదారులపై కూడా ఈ ప్రభావం పడుతుందని నిపుణులు



చెబుతున్నారు. రైతుల పరిస్థితి కూడా అంతే దయనీయంగా మారుతోంది. అత్యవసర పరిస్థితుల్లో భూమి అమ్ముకోవాలంటే రిజిస్ట్రేషన్ ఖర్చులే పెద్ద అడ్డంకిగా మారుతున్నాయి. భూమి విలువ పెరిగినట్టు కాగితాల మీద చూపించినా, వాస్తవంగా మార్కెట్ లో అంత ధర రావడం లేదన్నది చాలా ప్రాంతాల్లో నిజం. అయినప్పటికీ ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ విలువ ఆధారంగానే రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించాల్సి రావడం రైతులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెడుతోంది. మొత్తానికి చూస్తే, అభివృద్ధి మందగించి, ఆదాయ వనరులు తగ్గిన పరిస్థితుల్లో ప్రజలపై మరింత భారం మోపి ఖజానాను నింపుకోవాలన్న ప్రభుత్వ ఆలోచనపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహించే విధానాలు తీసుకురావాల్సిన బదులు, దానిపై మరిన్ని భారాలు మోపడం వల్ల సమస్య మరింత తీవ్రమవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకవైపు లావాదేవీలు తగ్గి, మరోవైపు చార్జీలు పెరగడం వల్ల చివరికి నష్టపోయేది సామాన్యుడేనని విమర్శకులు చెబుతున్నారు. ప్రజల ఆర్థిక పరిస్థితులను, మార్కెట్ వాస్తవాలను పరిగణలోకి తీసుకోకుండా కేవలం ఆదాయ లక్ష్యాలతోనే నిర్ణయాలు తీసుకుంటే దీర్ఘకాలంలో ప్రభుత్వానికి కూడా అది ప్రతికూలంగా మారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రిజిస్ట్రేషన్ల బాదుడు తగ్గించి, లావాదేవీలను ప్రోత్సహిస్తేనే ఆదాయం స్థిరంగా పెరుగుతుందన్న వాదన వినిపిస్తోంది. లేదంటే 11 నెలల్లో రెండోసారి మార్కెట్ విలువలు పెంచడం వల్ల ప్రజల్లో అసంతృప్తి పెరిగి, రియల్ ఎస్టేట్ రంగం మరింత కుదేలయ్యే ప్రమాదం ఉందని విశ్లేషకులు అంటున్నారు.

# బెంగాల్లో నేటినుంచి మోడీ రెండ్రోజుల పర్యటన

### పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న ప్రధాని

**కోల్‌కతా :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీఈనెల 17,18 తేదీల్లో పశ్చిమబెంగాల్లో పర్యటించనున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు రాజకీయ ర్యాలీల్లోనూ పాల్గొంటారు. ఎన్నికల జాబితా ఎస్ఐఆర్ పక్రియ, టీఎంసీ రాజకీయ కన్సెల్టెన్సీ ఐ–ప్యాక్ పై ఇటీవల జరిగిన ఈడీ దాడులతో బెంగాల్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కిన నేపథ్యంలో మోదీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకోనుంది. ÷డ్యూల్ ప్రకారం..మైనారిటీల ఆధిపత్యం ఉన్న మాల్డాలో ఈనెల 17న జరిగే బహిరంగ ర్యాలీలో మోదీ పాల్గొంటారు. సింగూర్‌లో జరిగే మరో ర్యాలీకి కూడా హాజరవుతారు. శనివారం సాయంత్రం మాల్డాకు ప్రధాని చేరుకుంటారని, తొలుత ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని ఆ తర్వాత సమీప గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసే పబ్లిక్ ర్యాలీలో పాల్గొంటారని బీజేపీ రాష్ట్ర నేత ఒకరు తెలిపారు. ఆదివారం నాడు మరలా బెంగాల్ వచ్చి హుగ్లీలోని సింగూర్‌లో ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని, ఆ వెంటనే పబ్లిక్ ర్యాలీకి హాజరవుతారని చెప్పారు. ఆ రాత్రి కోల్‌కతాలోనే బస చేస్తారా అనేది మాత్రం వెల్లడించలేదు. పీఐబీ ప్రకటన ప్రకారం.. ప్రధాని జనవరి 17వ తేదీ మధ్యాహ్నం 12:45 గంటలకు మాల్డా చేరుకుంటారు. హౌరా–గౌహతి మధ్య నడిచే తొలి వందేభారత్ స్లీపర్ ట్రైన్‌ను పచ్చజెండా ఊపి ప్రారంభిస్తారు. ఆదివారం నాడు హుగ్లీ జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభం, శంకుస్థాపనలు చేస్తారు. ఎస్ఐఆర్ పేరుతో సాధారణ పౌరులను బీజేపీ, ఎన్నికల కమిషన్ వేధిస్తోందని.. దీనికి బ్యాలెట్ బాక్స్ వద్దే ప్రజలు గట్టి గుణపాఠం చెప్పాలని అధికార టీఎంసీ కొద్దిరోజులుగా విమర్శలు గుప్పిస్తోంది. అయితే.. ఈ వాదనలను బీజేపీ తోసిపుచ్చుతోంది. అక్రమ వలసదారులు, రోహింగ్యాలను ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు ఎస్ఐఆర్ తప్పనిసరని, గణనీయంగా తమ ఓటు బ్యాంకు కోల్పోతోందనే అక్కసుతోనే టీఎంసీ తప్పుడు ఆరోపణలను చేస్తోందని చెబుతోంది.

# ఇంక్‌కు బదులు మార్కర్ పెన్ను ఉపయోగం

**ముంబై:** మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో చెరగని సిరాకు బదులుగా మార్కర్ పెన్‌లు ఉపయోగించడంపై రాజకీయ దుమారం రేగుతోంది. దీనిపై ఇప్పటికే విపక్షాలు తీవ్ర అభ్యంతరం తెలిపాయి. లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ శుక్రవారంనాడు దీనిపై మరింత ఘాటుగా స్పందించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ చర్యను తప్పుపట్టారు. పౌరులను తప్పుదారి పట్టిస్తూ ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరు కారణంగానే మన ప్రజాస్వామ్యంపై నమ్మకం సన్నగిల్లు తోందన్నారు. అంశంపై విపక్షాలు లేవనెత్తిన ఆందోళనలను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తన అభిప్రాయాన్ని కుండబద్ధలు కొట్టారు. 'ప్రజలను గ్యాస్‌లైటింగ్ చేస్తూ ఎన్నికల సంఘం వ్యవహరిస్తోంది. ఓటు చోరీ దేశద్రోహ చర్య' అని రాహుల్ తప్పుపట్టారు. మున్సిపల్ ఎన్నికల్లో చెరగని సిరాకు బదులుగా మార్కర్ పెన్ వాడారని, ఇందువల్ల ఓటర్ల చేతికి వేసిన ముద్రను తేలిగ్గా చెరిపివేసేందుకు వీలుంటుందని, ఇది బోగస్ ఓట్లకు దారితీస్తుందని పలు విపక్ష పార్టీలు గురువారంనాడు ఆందోళన వ్యక్తం చేశాయి. దీనిపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెంటనే స్పందించింది. మార్కర్ పెన్‌లలో వినియోగించిన చెరగని సిరా నాణ్యతపై విచారణ జరుపుతామని తెలిపింది. 'ఇంకును ఓటింగ్ సమయంలో వేలిపై వేశారా, లేక ఇది ఆకతాయిల చర్యా అనేది తెలుసుకునేందుకు వీడియోలను పరిశీలిస్తాం' అని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దినేష్ వాఘ్‌మారే చెప్పారు. వివాదం నేపథ్యంలో రాబోయే జిల్లా పరిషత్ ఎన్నికల్లో మార్కర్ పెన్‌లను వాడేది లేదని, తిరిగి చెరగని సిరాను మాత్రమే వాడతామని చెప్పారు. కాగా, ప్రజలను గ్యాస్‌లైటింగ్ చేస్తూ ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందనీ, ఓటు చోరీ దేశద్రోహ చర్య అనీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఖండించింది. ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించే ఆయన సాకులు వెతుక్కుంటున్నారని పేర్కొంది.

# మహారాష్ట్ర మున్సిపల్ ఫలితాలు

**ముంబై:** మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయి. ఈ క్రమంలో జాల్నా కార్పొరేషన్‌లో ఓ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన శ్రీకాంత్ పాంగార్కర్ విజయం సాధించాడు. సంచలనం సృష్టించిన ప్రముఖ జర్నలిస్ట్ గౌరీ లంకేశ్ హత్య కేసులో ఈయన నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. జాల్నాలో 13వ వార్డు నుంచి శ్రీకాంత్ పోటీ చేశాడు. భాజపాతోపాటు ఇతర పార్టీల అభ్యర్థులు పోటీలో ఉండగా.. ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేన మాత్రం అభ్యర్థిని నిలబెట్టలేదు. గతేడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు పాంగార్కర్ శివసేనలో చేరాడు. అయితే, దీనిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని శిందే నిలిపివేశారు. అంతకుముందు శివసేన తరఫున 2001–2006లో జాల్నా మున్సిపల్ కౌన్సిల్ సభ్యుడిగా ఉన్న పాంగార్కర్.. 2011లో టికెట్ నిరాకరించడంతో హిందూ జనజాగృతి సమితిలో చేరాడు. జర్నలిస్టు గౌరీ లంకేశ్‌ను 2017 సెప్టెంబర్‌లో బెంగళూరులోని ఆమె నివాసంలో దుండగులు కాల్చి చంపిన విషయం తెలిసిందే. ఈ కేసులో అరెస్టైన పాంగార్కర్‌కు.. 2024లో కర్ణాటక హైకోర్టు బెయిల్ మంజూరుచేసింది. అంతకుముందు 2018లో బాంబులు, ఆయుధాలు లభ్యమైన కేసులో మహారాష్ట్ర యాంటీ–టెర్రరిజం స్క్వాడ్ ఆయన్ను అరెస్టు చేసింది.

# బాలుడికి పురాతన నాణెలు లభ్యం


### రంగంలోకి దిగి తవ్వకాలు చేపట్టిన పురావస్తు శాఖ

**బెంగళూరు:** కర్ణాటకలోని గడగ్ జిల్లా లక్కుండి గ్రామంలో ఇటీవల ఓ బాలుడికి పురాతన కాలం నాటి బంగారు నాణెలు లభించడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. గ్రామంలోని కోటె వీరభద్రేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో తవ్వకాలు జరిపేందుకు పురావస్తు శాఖ రంగంలోకి దిగింది. రాష్ట్ర పర్యాటక శాఖ, లక్కుండి వారసత్వ పరిరక్షణ సంస్థ, జిల్లా అధికారుల సారథ్యంలో శుక్రవారం తవ్వకాలు ప్రారంభమయ్యాయి. మధ్య యుగాల నాటి నుంచీ అనేక రాజవంశాలు పాలించిన లక్కుండి చరిత్ర ఎంతో గొప్పదని చరిత్రకారులు చెబుతున్నారు. ఈ ప్రాంతాన్ని చాళుక్యులు, రాష్ట్రకూటులు, విజయనగర రాజులు, ఇతర వంశాల పాలకులు అనేక మంది పరిపాలించారు. అప్పట్లో బంగారు నాణెల ముద్రణకు లక్కుండి కేంద్రంగా ఉండేదని చరిత్రకారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ఓ బాలుడికి దాదాపు 470 గ్రాముల బరువున్న బంగారు నాణెలు లభించాయి. వీరభద్రేశ్వర ఆలయ సమీపంలోని ఓ ఇంటి నిర్మాణం కోసం తవ్వకాలు జరుపుతున్న సమయంలో నాణెలున్న పాత్ర బాలుడి కంట పడింది. దీంతో చిన్నారి స్థానిక అధికారులకు సమాచారం అందించాడు. ఈ నేపథ్యంలోనే అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ ప్రాంతంలో తవ్వకాలు జరిపితే అనేక వస్తువులు బయటపడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. లక్కుండి ఘన చరిత్ర ఆనవాళ్లు అనేకం వెలుగులోకి వస్తాయని అంటున్నారు. అధికారులు ఇప్పటికే జేసీబీలు, ట్రక్కులను ఆలయ పరిసరాలకు తరలించారు. అక్కడ ఓ 10 చదరపు మీటర్ల విస్తీర్ణంలో తవ్వకాలు జరుపుతామని తెలిపారు. కాగా, 2024లో గ్రామంలో జరిపిన తవ్వకాల్లో చారిత్రక ప్రాధాన్యత కలిగిన అనేక వస్తువులు బయటపడ్డాయి. తాజాగా నాణెలు కూడా లభించడంతో మరోసారి లక్కుండి పేరు రాష్ట్రవ్యాప్తంగా మార్మోగిపోతోంది. ప్రస్తుతం జరుపుతున్న తవ్వకాలకు చారిత్రక ప్రాధాన్యం అత్యధికమని నిపుణులు చెబుతున్నారు. కర్ణాటక చరిత్ర గురించి చెప్పే శాసనాలు, కళాకృతులు, నగలు బయటపడే అవకాశం ఉందని అంటున్నారు.

# 'స్టార్టప్ ఇండియా' విప్లవం

### రాబోయే పదేళ్లలో అగ్రగామిగా భారత్
### కంఫర్ట్ జోన్‌లో జీవించే ఆలోచన యువతకు లేదు
### 'నేషనల్ స్టార్టప్ డే' కార్యక్రమంలో ప్రధాని మోదీ

**ఢిల్లీ :** రాబోయే పదేళ్లలో స్టార్టప్స్, టెక్ విభా గాల్లో ప్రపంచ అగ్రగామిగా భారత్‌ను నిలపడమే లక్ష్యమని ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ లక్ష్యం దిశగా భారతీయ స్టార్టప్‌లు వైవిధ్యంతో, సాహసోపేతంగా పురోగమిస్తాయనే పూర్తి విశ్వాసం తనకు ఉందన్నారు. ప్రస్తుత తరుణంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై భవిష్యత్ వ్యూహాన్ని కలిగిన దేశాలకే ఎక్కువ ప్రయోజనాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. 'నేషనల్ స్టార్టప్ డే' సందర్భంగా శుక్రవారం ఢిల్లీలోని భారత్ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. 2014లో దేశంలో 4 యూనికార్న్ ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 125కు చేరిందన్నారు. పదేళ్ల క్రితం 500 స్టార్టప్‌లే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 2 లక్షలు దాటిందన్నారు. ఒక్క 2025 సంవత్సరంలోనే 44వేల స్టార్టప్‌లు రిజిస్టర్ అయ్యాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ భారత్‌లోనే ఉందన్నారు. 'నేషనల్ స్టార్టప్ డే' వేడుకకు హాజరైన స్టార్టప్‌ల వ్యవస్థాపకులను చూస్తుంటే, తనకు నవ్య భారత్, వికసిత భారత్ కనిపిస్తోందని మోదీ వ్యాఖ్యానించారు.



### శాలరీని మించి ఆలోచించే వాళ్లను గౌరవిస్తున్నారు!

'గతంలో సొంత వ్యాపారం ప్రారంభించడాన్ని రిస్క్‌గా భావించేవారు. రిస్క్ పేరు చెప్పి యువతను నిరుత్సాహపరిచేవారు. కానీ ఇప్పుడు రిస్క్ తీసుకొని వ్యాపారాలను మొదలుపెట్టడమే భారతీయ యువతకు ప్రధాన పనిగా మారిపోయింది. భారతీయ స్టార్టప్‌ల వ్యవస్థాపకుల అత్యద్భుత విశ్వాసం, గొప్ప ఆశయాలను చూసి నేను మంత్రముగ్ధుడిని అయ్యాను. ఒకప్పుడు సొంత వ్యాపారం పెట్టడం అనేది కెరీర్‌లో చిట్టచివరి ఆప్షన్‌గా ఉండేది. కానీ ఇప్పుడది ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది. నెలవారీ శాల రీని మించి ఆలోచించే వాళ్లను ఇప్పుడు అందరూ స్వాగ తిస్తున్నారు, గౌరవిస్తున్నారు' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

### అన్ని రంగాలకు కనెక్టివిటీ

'స్టార్టప్ ఇండియా అనేది ఒక స్కీం మాత్రమే కాదు. దానికి ఇంద్ర ధనుస్సు లాంటి పెద్ద విజన్ ఉంది. కొత్త వ్యాపార అవకాశాలతో దేశంలోని అన్ని రంగాలను కనెక్ట్ చేయడమే దీని లక్ష్యం. భారతీయ స్టార్టప్‌లు తయారీ రంగం, పరిశోధనలపైనా ఫోకస్ పెట్టాల్సిన సమయం వచ్చేసింది. ఈ రోజు చేసే పరిశోధనే రేపటి ఇంటలెక్చువల్ ప్రాపర్టీగా మారుతుంది. స్టార్టప్‌లకు సీడ్ ఫండ్‌ను అందించడానికి మేం చాలా స్కీంలను అమల్లోకి తెచ్చాం. కాలం చెల్లిన రూల్స్ అన్నీ తొలగించాం. స్టార్టప్‌ల వ్యవస్థాపకుల ఐడియాలను మేం బలంగా నమ్మాం. ఈ ఏడాదితో స్టార్టప్ ఇండియా కార్యక్రమం పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. దీనివల్ల మేం వేలాది మందికి కలలు కనే ధైర్యాన్ని ఇచ్చాం. ఎంతోమంది వారి వ్యాపార కలలను సాకారం చేసుకున్నారు. ఈ శుభ సందర్భంగా ప్రతీ ఒక్క స్టార్టప్ వ్యవస్థాపకుడికి నా అభినందనలు' అని ప్రధాని మోదీ తెలిపారు.

# బీజేపీ అధ్యక్ష ఎన్నికకు రంగం సిద్ధం

### 19న నామినేషన్..20 ఎన్నికల ప్రక్రియ

**న్యూఢిల్లీ :** బీజేపీకి మరికొన్ని రోజుల్లో కొత్త సారథి రానున్నారు. పార్టీ నూతన అధ్యక్షుడి కోసం ఎన్ని క తేదీని బీజేపీ శుక్రవారం ప్రకటించింది. ఈ పదవికి జనవరి 19న నామినేషన్లు దాఖలు కానున్నట్లు తెలిపింది. ఆ మరుసటి రోజు జనవరి 20న కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటించనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు బీజేపీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.లక్ష్మణ్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. 19వ తేదీ మధ్యాహ్నం 2–4 గంటల మధ్య అభ్యర్థులు నామినేషన్లను సమర్పించవచ్చని లక్ష్మణ్ తెలిపారు. ఆ తర్వాత నామినేషన్ల పరిశీలన చేపడతామన్నారు. అదేరోజు సాయంత్రం 5–6 గంటల మధ్య నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందన్నారు. ఎన్నిక అవసరమైతే జనవరి 20న పోలింగ్ నిర్వహించి విజేతను ప్రకటిస్తామన్నారు. ఈ ప్రక్రియంతా బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరగనుంది. కాగా.. ఇటీవల కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన 45 ఏళ్ల నితిన్ నబీన్‌నే పార్టీ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. యువనాయకత్వాన్ని తయారుచేసుకోవడడంలో భాగంగా నబీన్‌కు పార్టీ సారథ్య పగ్గాలు అప్పగించే అవకాశాలు కన్పిస్తున్నాయి. బిహార్‌కు చెందిన నితిన్ నబీన్ సిన్హాను బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమిస్తూ గతేడాది డిసెంబరులో పార్టీ అనూహ్య ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. కాయస్థ సామాజికవర్గానికి చెందిన నబీన్ సిన్హాకు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. గతేడాది జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపుర్ నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బిహార్ నుంచి పార్టీలో ఆ స్థాయికి చేరిన తొలినేతగా నబీన్ గుర్తింపు సాధించారు.



# మరోమారు పాక్ కవ్వింపు చర్యలు

### సరిహద్దుల్లో డ్రోన్లతో దాడి చేసే యత్నం

**న్యూఢిల్లీ :** ఓ వైపు భారత్‌తో స్నేహ సంబంధాలు కొనసా గిస్తాం అంటూనే.. పాకిస్థాన్ మరోవైపు కవ్వింపు చర్యలకు పాల్పడు తోంది. గురువారం రాత్రి జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి రెండు పాక్ డ్రోన్లు సంచరించినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. డ్రోన్ల కదలికలు చూసిన వెంటనే భారత సై న్యం స్పందించి యాంటీ–డ్రోన్ ఆపరేషన్ చేపట్టడంతో అవి వెనుదిరిగాయి. ఈ వారంలోనే ఇలా జరగడం మూడోసారి అంటున్నారు. పాకిస్థాన్‌కు భారత్ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరికలు జారీ చేసిన కొద్ది గంటల్లోనే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. గణతంత్ర దినోత్సవం వేడుకల నేపథ్యంలో సరిహద్దుల్లో భద్రతా దళాలు పహారా కాస్తున్నాయి. డ్రోన్ల కదలికల తర్వాత ఆ ప్రాంతంలో హై అలర్ట్ ప్రకటించి, భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. మంగళవారం రాత్రి, రాజౌరి జిల్లాలోని నియంత్రణ రేఖ (ఒక్షఅ) దాటి భారత భూభాగంలోకి వచ్చిన అనుమానిత పాక్ డ్రోన్లను అడ్డగించడానికి ఆర్మీ సిబ్బంది కాల్పులు జరిపారు.

# ట్రంప్‌తో కొరినా భేటీ

**వాషింగ్టన్ :** వెనుజువెలా ప్రతిపక్ష నాయకురాలు మారియా కొరినా మచాడో గురువారం వైట్ హౌజ్‌లో అధ్యక్షుడు ట్రంప్‌ని కలిశారు. ఈ సందర్భంగా తన నోబెల్ శాంతి బహుమతి పురస్కారాన్ని ట్రంప్ నకు అందజేశారు. సమావేశం అనంతరం ఈ విషయాన్ని మచాడో స్వయంగా మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా మచాడో మాట్లాడుతూ.. 'చరిత్రలో రెండు వందల ఏళ్ల తర్వాత, బొలివర్ వారసులు వాషింగ్టన్ వారసుడికి ఒక పతకాన్ని తిరిగి ఇస్తున్నా.. ఇది మన స్వేచ్ఛ పట్ల ఆయన ప్రత్యేక నిబద్ధతకు గుర్తింపుగా నా నోబెల్ శాంతి బహుమతిని ట్రంప్ నకు అందజేస్తున్నా' అని వ్యాఖ్యానించారు. వెనుజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను ఇటీవల అమెరికా సైనిక దళాలు అదుపులోకి తీసుకున్న కొన్ని రోజులకే ఈ పరిణామాలు చోటు చేసుకోవడం ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మచాడోతో భేటీ అనంతరం ట్రంప్ స్పందిస్తూ.. 'మారియా కొరినా మచాడోను కలవడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. ఆమె ఎన్నో కష్టనష్టాలను ఎదిరించి నిలిచిన గొప్ప మహిళ, ఇన్నాళ్ళు ప్రపంచ శాంతి కోసం నేను చేసిన కృషిని గుర్తించి ఆమె తన నోబెల్ పురస్కారాన్ని నాకు బహుమతిగా ఇచ్చారు.. థ్యాంక్యూ మరియా.. అంటూ తన ట్రూత్ సోషల్ వేదికగా తెలిపారు. గత ఏడాది అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ తనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని.. దానికి తాను పూర్తి అర్హుడని నానా హంగామా చేశారు. కానీ, నోబెల్ బహుమతి మాత్రం ట్రంప్‌నకు దక్కలేదు. 2025 లో నోబెల్ బహుమతి వెనుజువెలా ప్రతిపక్ష నేత కొరినా మచాడోకి దక్కింది.

# చట్టవిరుద్ధంగా వాకీటాకీల విక్రయం

### అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో సహా పలు సంస్థలకు షాక్
### ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై రూ.44లక్షల వరకు జరిమానా

**న్యూఢిల్లీ:** చట్టవిరుద్ధంగా వాకీ టాకీలను విక్రయిస్తున్న పలు ఈ–కామర్స్ సంస్థలపై కేంద్ర వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ సుమోటోగా చర్యలు చేపట్టింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో సహా పలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై మొత్తంగా రూ.44లక్షల వరకు జరిమానా విధించింది. వినియోగదారుల రక్షణ, టెలికాం చట్టాలను ఉల్లంఘించి పలు ఈ–కామర్స్ సంస్థలు నిబంధనలకు అనుగుణంగా లేని ఉత్పత్తులను లిస్ట్ చేసి విక్రయిస్తున్నట్లు సీసీపీఏ గుర్తించింది. సాధారణంగా 446.0–446.2 బ్యాండ్‌లోని పర్సనల్ మొబైల్ రేడియోలకు మాత్రమే లైసెన్స్ మినహాయింపు వర్తిస్తుంది. మిగతా వాటి దిగుమతి, విక్రయాల కోసం తప్పనిసరిగా ఎక్విప్‌మెంట్ టైప్ అప్రూవల్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. అంతేగాక, లైసెన్సింగ్ నిబంధనలకు సంబంధించిన వివరాలను కూడా విక్రయదారులు స్పష్టంగా తెలియజేయాలి. అయితే, ఫ్లిప్‌కార్ట్ , అమెజాన్ , మీషో , జియో మార్ట్ తదితర ఈ–కామర్స్ సంస్థలు ఈ నిబంధనలను ఉల్లంఘించి నట్లు అఖం తెలిపింది. లైసెన్స్ మినహాయింపు ఫ్రీక్వెన్సీ రేంజ్ దాటి ఉన్న వాకీ టాకీలను ఈ కంపెనీలు విక్రయించినట్లు పేర్కొంది. ఇందుకు గానూ మీషో, మెటా, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ సంస్థలకు రూ.10లక్షల చొప్పున జరిమానా విధించింది. చిమియా, జియో మార్ట్, టాక్ ప్రో, మాస్క్‌మ్యాన్ టాయ్స్ సంస్థలకు రూ.లక్ష చొప్పున వేసింది. వీటిలో మీషో, మెటా, చిమియా, జియో మార్ట్, టాక్ ప్రో ఇప్పటికే పెనాల్టీలు చెల్లించినట్లు సీసీపీఏ వెల్లడించింది.



# నీరవ్ మోడీ కేసులో ఈడీ దర్యాప్తు

### ఛోక్సీ తనయుడు రోహన్‌కు సంబంధం ● ఢిల్లీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు ఈడీ వివరాలు

**న్యూఢిల్లీ :** పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.వేల కోట్లు ఎగవేసి పారిపోయిన వ్యాపారవేత్త, ఆర్థిక నేరగాడు మెహుల్ ఛోక్సీ కేసుపై ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఎనిమిదేళ్లుగా కొనసాగుతోన్న దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు తాజాగా కీలక విషయం వెల్లడించారు. ఈ మనీలాండరింగ్ కేసులో మెహుల్ ఛోక్సీ కుమారుడు రోహన్ చోక్సీకి కూడా సంబంధం ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు దిల్లీలోని అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు వివరాలు వెల్లడించారు. మెహుల్ చోక్సీ డైరెక్టర్‌గా ఉన్న లస్టర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీలో రోహన్ చోక్సీకి 99.99 శాతం వాటా ఉందని.. ఈ కంపెనీ నిధులను వారు విదేశాలకు మళ్లించడానికి ఉపయోగించుకున్నారని దర్యాప్తులో తేలినట్లు ఈడీ అధికారులు పేర్కొన్నారు. నగదు అక్రమ చలామణిలో రోహన్ చోక్సీ చురుకుగా పాల్గొన్నట్లు తగిన ఆధారాలు ఉన్నాయన్నారు. దీంతో అతడి ఆస్తులను అటాచ్ చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రోహన్‌తో పాటు ఇతర కుటుంబసభ్యులను కూడా విచారించడానికి ఈడీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి తీసుకున్న దాదాపు రూ.13 వేల కోట్ల రుణాలను ఎగ్గొట్టిన ఛోక్సీ, అతడి మేనల్లుడు నీరవ్ మోదీ దేశం విడిచి పారిపోయారు. ఛోక్సీ ఆంటిగ్వా–బార్బుడాకు వెళ్లగా.. నీరవ్‌మోదీ లండన్‌లో ఆశ్రయం పొందాడు. ప్రస్తుతం నీరవ్ లండన్‌లోని జైల్లో ఉన్నాడు. వారిని భారత్‌కు తీసుకురావడానికి విదేశాంగ అధికారులు ఆయా దేశాల అధికారులతో చర్చలు జరుపుతున్నారు.






సంపాదకీయం

# రాష్ట్రాల పురోగతి లక్ష్యంగా కేంద్ర బడ్జెట్!

మరో పక్షం రోజుల్లో కేంద్ర బడ్జెట్ ప్రకటించనున్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతరామన్ మరోమారు బడ్జెట్ కసరత్తులో బిజీగా ఉన్నారు. ఇటీవల ఆయా రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో చర్చించారు. ఆయా రాష్ట్రాల మంత్రులు వారివారి రాష్ట్రాల్లో ఉన్న అవసరాలను, నిధుల కేటాయింపులపై వినతిపత్రాలు సమర్పించారు. తెలుగు రాష్ట్రాల నుంచి భట్టి విక్రమార్క, పయ్యావుల కేశవుఉల హాజరై తమ అసవరాలను, ఆకాంక్షలను వెల్లడంచారు. అయితే ఏటా కేటాయింపులు చేస్తున్నా..ఇప్పటి వరకు ప్రకటించిన కేటాయింపులు, ఖర్చులపై స్పష్టత లేదు. ఏ పథకానికి ఎంత ఖర్చు చేశారో తెలియదు. అలాగే అన్ని రాష్ట్రాలను సమానంగా చూస్తూ కేటాయింపులు ఉండాలి. బడ్జెట్ అంటే అభివృద్ధి దివఘా చర్యలు ఉండాలి. అనుకూల రాష్ట్రాలకు ఒక రకంగా, తమ పార్టీ పాలనలో లేని రాష్ట్రాలను మరో రకంగా చూసే విధానాలకు పాతరేయాలి. బడ్జెట్ అందరికి సమాన హక్కుగా ఉండాలి. అది దేశ ప్రగతిని ప్రతిఫలించాలి. తమకు మద్దు ఇస్తున్న పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఒక రకంగా, మిగతా రాష్ట్రాలను మరో రకంగా చూసు విధానం సరికాదు. మరికొద్ది రోజుల్లో పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు జరగనుండగా, దానికి సన్నాహంగా ఇటీవల నిర్వహించిన ప్రీ బడ్జెట్ సమావేశంలో రాష్ట్రాల ఈ దైన్య స్థితి స్పష్టంగా వెలుగులోకి వచ్చింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్రంలో ఎన్‌డిఎ కూటమికి చెందిన పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు సైతం నిధుల కోసం గళం విప్పాల్సి రావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తమ తమ రాష్టాల్లో్ర నెలకొన్న దుర్భర పరిస్థితులను వివరిస్తూ అదనపు నిధులు కావాలని, జిఎస్‌టి పరిహారం కొనసాగించాలని సమావేశంలోనే ఆ రాష్ట్ర ప్రభుత్వాలూ విజ్ఞప్తులు చేశాయి. పన్నుల వసూళ్లలో రాష్ట్రాల వాటా తగ్గిస్తూ, గ్రాంట్లు ఆలస్యం చేస్తూ, అప్పుల పరిమితులను కట్టడి చేస్తూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరే రాష్ట్రాల ఈ దుస్థితికి కారణం. సిపిఎం నేతృత్వంలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కేరళ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం మరింత కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. ఆర్థికంగా దిగ్బంధించడం ద్వారా వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వ ప్రతిష్టను ప్రజల్లో దిగజార్చే కుటిల వ్యూహానికి బిజెపి తెగబడుతోంది. ఇలా దాదాపు లక్ష కోట్ల రూపాయల మేర ఆ రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేంద్రం మంజూరు చేయడానికి నిరాకరిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. గత ఐదేళ్లలోనే 57వేల కోట్ల రూపాయలకు కోత పెట్టింది. పన్నుల వాటాను 3.89 శాతం నుండి 1.92 శాతానికి తగ్గించింది. ఈ చర్య వల్ల 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే కేరళ ప్రజలు 27 వేల కోట్ల రూపాయలు నష్టపోయారు. జిఎస్‌టి సంస్కరణల ద్వారా మనో 9వేల కోట్లను ఆ రాష్ట్రం కోల్పోయింది. త్వరలో ఎన్నికలు జరగనున్నఈ రాష్ట్రంలో ఈ తరహా రాజకీయ కక్ష సాధింపు చర్యలు పతాకస్థాయికి చేరడంతో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ సత్యాగ్రహం చేయాల్సి వచ్చింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ ఆర్థిక దిగ్బంధనంపై కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ పెదవి విప్పక పోవడం పచ్చి అవకాశవాద రాజకీయం తప్ప మరోటి కాదు. ఏమైనప్పటికీ ఈ తరహా ఏకపక్ష విధానాలను నరేంద్రమోడీ ప్రభుత్వం ఇప్పటికైనా విడనాడాలి.

రాజ్యాంగ బద్ధమైన రాష్ట్రాల హక్కులను గౌరవించాలి. లేని పక్షంలో ఈ త-రహా ఆందోళనలు మరిన్ని రాష్ట్రాల్లో చోటుచేసుకునే అవకాశం ఉంది. బలమైన రాష్ట్రాలే కేంద్రాన్ని బలంగా నిలబెడతాయి. స్థిరమైన ఆర్థిక వనరులతోనే బలంగా నిలుస్తాయి. సమాఖ్య వ్యవస్థ పురోగతికి అత్యంత కీలకమైన ఈ అంశంపైనే నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోంది. ఆర్థిక హక్కులను క్రమేణా హరిస్తోంది. ఫలితంగా రాష్ట్రాలు ప్రతి చిన్న అవసరానికి కేంద్రం దయా దాక్షిణ్యాలపై ఆదారపడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.ప్రీ బడ్జెట్ సమావేశంలో రాష్ట్రం తరపున పాల్గొన్న తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అనేక విషయాలను నిర్మలా సీతారామన్ ముందుంచారు. ఫ్యూచర్ సిటీ, నవోదయలు, మూసీ సుందరీకరణ, రోడ్ల విస్తరణ, ఎస్సీఆరెస్పీకి జాతీయ హోదా ,ట్రిపుల్ ఆర్ వంటి అనేక అంశాలను, నిధుల కేటాయింపులను ప్రస్తావించారు. వీటికి కేంద్రం బ్డజెట్‌లో ఏ రకమైన స్పందన చూపిస్తుందో చూడాలి. అలాగే ఎపికి చెందిన మంత్రి పయ్యావుల కేశవ్ కూడా కోరికల చిట్టా విప్పారు. రాష్ట్ర రాజధాని అమరావతి నగర నిర్మాణ పనులకు సాయాన్ని కొనసాగించాలని ఆయన కోరారు. విభజన హామీల్లో భాగమైన పోలవరం ప్రాజెక్టుకు పూర్తి నిధులు ఇవ్వాలని, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విశాఖపట్నం, రాయలసీమ ప్రాంతాల మౌలిక సదుపాయాల కోసం అదనపు కేటాయింపులు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ కోరికలు కోరడం ఇదే మొదటి సారికాదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతిసారీ దాదాపుగా ఇవే అంశాలను ప్రధాన మంత్రి నుండి మంత్రుల వరకు వ్యక్తిగతంగా కలిసి ఈ మేరకు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు. ఢిల్లీలో ఉన్న రాష్ట్ర ఎంపీలు, పర్యటనలకు వెళ్లే మంత్రులూ ఇదే పనిమీద ఉంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయినా, కేంద్రం నుండి నిధులు రావడం లేదు. మన రాష్ట్రమే కాదు, ఎన్‌డిఎలో మరో భాగస్వామిగాఉన్న బీహార్ ప్రభుత్వం నుండి కూడా ఇటువంటి విజ్ఞప్తులే అందాయి. పలు బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా జిఎస్‌టి నష్టపరిహారం, గ్రాంట్ల పెంపు, ప్రత్యేక ప్యాకేజీల కోసం కేంద్రాన్ని కోరినట్లు వార్తలు వచ్చాయి. నిధుల కేటాయింపుల్లో సమతుల్యత పాటించాలి. విభేదాలు పక్కన పెట్టాలి. అప్పుడే కేంద్ర, రాష్ట్రాల మధ్య సయోధ్య సాధ్యం అవుతుంది.



**కంచర్ల అచ్యుత్ రావు**
ఎడిటర్

# గిరిజనులతో కలసి ఆడిపాడిన హోంమంత్రి

**కుటుంబ సభ్యులతో కలసి గ్రామం సందర్శన**
**వారి యోగక్షేములు తెలుసుకుని కలసి భోజనం**
**మంత్రి రాకతో ఆనందం వ్యక్తం చేసిన గ్రామస్తులు**



**అనకాపల్లి,జనవరి16 :**

గిరిజన గ్రామంలో కుటుంబ సభ్యులతో కలసి పర్యటించిన మంత్రి అనిత అక్కడి వరితో కలసి ఆడిపాడారు. వారితో కలసి భోజనం చేసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కోటవురట్ల మండలం గొట్టివాడ శివారులో ఉన్న మారుమూల గిరిజన గ్రామం అణుకులో హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి గిరిజనులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన మంత్రి.. గిరిజనులతో కలిసి సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కనుమ పండగ సందర్భంగా గిరిపుత్రులతో ఎంతో సంతోషంగా గడిపారు. గ్రామస్థులు మంత్రి అనితను 'అనితమ్మ.. మా గుండె' అంటూ కొనియాడారు. 'అనితమ్మ రావడం మాకు పెద్ద పండుగ' అని ఆనందం వ్యక్తం చేశారు. గతంలో రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఎన్నో ప్రాణాలు కోల్పోయినట్లు గిరిజనులు గుర్తుచేశారు. ఇప్పుడు రోడ్డు మంజూరు చేయించినందుకు మంత్రి అనితకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలోని పరిదేశమ్మ తల్లి ఆలయాన్ని మంత్రి అనిత దర్శించుకున్నారు. గిరిజనులతో ముఖాముఖి సంభాషణ జరిపి, వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. అక్కడి ప్రజలను పేరుపేరునా పలకరించి వారి యోగక్షేమాలు అడిగారు. చిన్నారులతో ఆడుకుని.. వారికి పుస్తకాలు, గిరిజనులకు సంక్రాంతి కానుకలు అందజేశారు. గిరిజనులకు స్వయంగా భోజనాలు వడ్డించి, తన కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. మంత్రి కుమారుడు నిఖిల్.. అణుకు యువకులకు క్రికెట్ కిట్లు, స్పోర్ట్స్ టీషర్టులు అందజేశారు. మంత్రి అనిత, కుమారుడు నిఖిల్‌తో పాటు కుటుంబ సభ్యులు ఆ గ్రామ యువకులతో కలిసి వాలీబాల్ ఆడారు. అనంతరం.. చిన్నారుల డ్యాన్స్‌ను అభినందించారు. గిరిజనులు పండిరచిన కూరగాయలు, పంటలను మంత్రికి అణుకు ప్రజలు బహూకరించారు. గ్రామస్థులతో మాట్లాడిన మంత్రి అనిత మాట్లాడుతూ.. 'మీతో ప్రశాంతంగా పండుగ చేసుకోవాలని ఇక్కడకు వచ్చాను. మీ అందరితో కలిసి పండుగ చేసుకోవడం నా పూర్వజన్మ సుకృతం. నా పిల్లలను కూడా తీసుకువచ్చాను. మీ గ్రామానికి ఏమి కావాలో అన్నీ చేస్తాను. రూ. 2.50 కోట్లతో రోడ్డు మంజూరైంది. సంబంధిత ఆర్డర్ కాపీతోనే వచ్చాను. మీరంతా సంతోషంగా ఉండాలి. పిల్లలు చక్కగా చదువుకోవాలి. మంచి ఉద్యోగాలు చేయాలి' అని హోంమంత్రి చెప్పారు. 2014 నుంచి 2019 వరకు ఈ గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ఇప్పుడు రేషన్ డిపో ఏర్పాటు చేస్తున్నామని అనిత అన్నారు. త్వరలో సెల్ టవర్ స్థాపన చేస్తామని తెలిపారు. గ్రామంలో 20 మంది పిల్లలు ఇంటర్, డిగ్రీ వరకు చదివారన్న ఆమె.. ఇద్దరు ఆడపిల్లలు డిగ్రీ చదువుతుండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అంతేకాకుండా.. అణుకు గ్రామంలో ఒక్కో ఇంటి కి ఒక బాత్‌రూమ్ నిర్మాణం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.`

# వైజాగ్ షాపింగ్ మాల్‌లో మహిళ బ్యాగ్ చోరీ

**24 గంట్లోనే చోరీని ఛేదించిన పోలీసులు**

**విశాఖపట్నం,జనవరి16 :**

సంక్రాంతి పండుగ రోజున గాజువాకలో చోరీ జరిగింది. ఈ చోరీని 24 గంటల్లోనే గాజువాక క్రైమ్ పోలీసులు ఛేదించారు. సంక్రాంతి సందర్భంగా వైజాగ్ షాపింగ్ మాల్‌లో ఏ వస్తువైనా రూ.180కే అంటూ భారీ సేల్‌ను ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో ఓ మహిళ షాపింగ్ మాల్ లోపలికి వెళ్లే సమయంలో తన బ్యాగ్‌ను సెక్యూరిటీ వద్ద ఉంచింది. అయితే.. ఓ గుర్తు తెలియని వ్యక్తి తన బ్యాగ్‌తో పాటు సెక్యూరిటీ వద్ద ఉంచిన మరో బ్యాగ్‌నూ దొంగలించాడు. ఆ బ్యాగ్‌లో రూ.50 వేల నగదుతో పాటు 11 తులాల బంగారం ఉన్నట్టు గుర్తించిన సదరు వ్యక్తి.. దాన్ని తనతో పాటు తీసుకెళ్లిపోయాడు.

తన బ్యాగ్ కనిపించకపోవడంతో వెంటనే ఆ మహిళ గాజువాక క్రైమ్ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వైజాగ్ షాపింగ్ మాల్‌లో సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. ఆ ఫుటేజీ ఆధారంగా నిందితుడు ఉపయోగించిన వాహనాన్ని ట్రాక్ చేశారు.

ఒక్కరోజు వ్యవధిలోనే నిందితుడిని అరెస్ట్ చేశారు పోలీసులు. దొంగలించిన బ్యాగ్‌ను శ్మశానవాటికలో దాచినట్లు విచారణలో తెలిపాడు నిందితుడు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని ఆ బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. బ్యాగ్‌లో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు అలాగే ఉన్నట్లు గుర్తించారు. అనంతరం.. బాధితురాలికి తిరిగి బ్యాగ్‌ను అప్పగించారు గాజువాక క్రైమ్ పోలీసులు. పండుగ పూట బంగారం, నగదును గుర్తుతెలియని వ్యక్తి దొంగలించడంతో బాధితురాలు తీవ్ర భయాందోళనకు గురైంది. చివరకు పోలీసులు ఎంతో చాకచక్యంగా కేసును ఛేదించి.. బ్యాగ్‌ను తిరిగి అప్పగించడంతో బాధితురాలు హర్షం వ్యక్తం చేసింది. ఈ విధంగా సమర్థవంతంగా కేసును ఛేదించిన గాజువాక క్రైమ్ పోలీసుల ప్రతిభకు విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అభినందనలు తెలిపారు.

# తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చోరీలు

**ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసిన పోలీసులు**

**అనంతపురం,జనవరి16:**

తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేసినట్లు శ్రీసత్య సాయి జిల్లా పెనుకొండ డిఎస్పి తెలిపారు. డియస్పి నరసింగప్ప తెలిపిన వివరాల మేరకు.. సోమందేపల్లి పెనుకొండ, గోరంట్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని ఈ దొంగలు దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. చోరీ కేసులు నమోదు చేసి ప్రత్యేక పోలీసులు బృందం దర్యాప్తు చేపట్టిందన్నారు. గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న అనంతపురం కు చెందిన కోటయ్య, శాలి అనే ఇద్దరు వ్యక్తులను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా మూడు మండలాల్లో చేసిన వరుస చోరీలకు పాల్పడిరది వారేనని గుర్తించారు. 8 ఇళ్లలో దొంగతనాలం చేసింది ఈ ఇద్దరే అని పోలీసులు తెలిపారు. అరెస్ట్ చేసిన వారి నుంచి రూ.30 లక్షల విలువచేసే బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన వివరించారు. అనంతరం నిందితులను పెనుకొండ కోర్టులో హాజరు పర్చారు. చోరీ కేసులను చేదించిన పోలీసులను డిఎస్పి అభినందించారు.

# పందెంలో ఓడిన కోళ్లకు భలే డిమాండ్

**పది నుంచి పదిహేను వేలకు అమ్మకం**

**కాకినాడ,జనవరి16 :**

సంక్రాంతి పండుగ నేపథ్యంలో కాకినాడ జిల్లాలో పందెం కోళ్లకు భారీ డిమాండ్ నెలకొంది. పందాల బరిలో ఓడిపోయిన కోళ్లు ఇప్పుడు కోస మాంసం రూపంలో భారీగా అమ్ముడుపోతున్నాయి. పందెం కోళ్ల మాంసం రుచిగా, పౌష్టికంగా ఉంటుందనే నమ్మకంతో జనం ఎగబడ్డారు. పందెం కోసం నెలల తరబడి కోళ్లను ప్రత్యేకంగా పెంచుతారు నిర్వాహకులు. బలమైన ఆహారం, వ్యాయామంతో కోడిని తీర్చిదిద్దుతారు. అయితే బరిలో ఓడిపోయిన కోళ్లకు ఇప్పుడు కొత్త గుర్తింపు వచ్చింది. వీటి మాంసం కోసం ప్రజలు ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో ఓడిపోయిన పందెం కోడి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ధర పలుకుతోంది. ఏడాదికి ఒక్కసారి మాత్రమే ఈ కోస మాంసం దొరకడం వల్ల డిమాండ్ మరింత పెరిగింది. కాకినాడతో పాటు చుట్టుపక్కల జిల్లాల నుంచే కాకుండా, ఇతర ప్రాంతాల్లో ఉన్న తమ బంధువులకు కూడా ఈ మాంసాన్ని పంపిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. డిమాండ్ పెరగడంతో పందాల బరుల దగ్గరే కోస మాంసం డ్రెస్సింగ్ కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. అక్కడికక్కడే శుభ్రపరచి మాంసాన్ని ప్యాక్ చేసి ఇస్తున్నారు. దీంతో కొనుగోలుదారులకు సౌకర్యంగా మారింది.. పందెం కోళ్ల మాంసానికి ఉన్న క్రేజ్ వల్ల పందాలు ముగిసిన తర్వాత కూడా బరుల వద్ద సందడి కొనసాగుతోంది. ఓడిపోయిన కోడే అయినా.. కోస మాంసంగా మారితే బంగారం లాంటి విలువ వస్తోందని స్థానికులు చెబుతున్నారు..

# పందెంకోళ్లకు కోట్లల్లో ధరలు

**రూ.1 కోటి 53 లక్షల భారీ పందెం**

**భీమవరం,జనవరి16 :**

సంక్రాంతి సందర్భంగా గోదావరి జిల్లాల్లో కోడి పందాలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ క్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో రెండో రోజు నిర్వహించిన కోడి పందాలు భారీగా సాగాయి. లక్షలాది రూపాయలు పందాల్లో పెట్టగా, కోట్ల రూపాయలు చేతులు మారినట్లు సమాచారం. తాడేపల్లిగూడెంలోని పైబోయిన వెంకటరామయ్య బరిలో నిర్వహించిన కోడి పందెంలో ఏకంగా రూ.1 కోటి 53 లక్షల భారీ పందెం కుదిరింది. ఈ పందెం గుడివాడ ప్రభాకర్ సేతువ మరియు రాజమండ్రికి చెందిన రమేష్ దేగ మధ్య జరిగింది. హోరాహోరీగా సాగిన పోటీలో చివరకు రాజమండ్రి రమేష్ దేగ విజయం సాధించింది. ఈ భారీ పందెన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు పందెం రాయుళ్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాలతో పాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తెలంగాణ ప్రాంతాల నుంచి కూడా పందెం ప్రేమికులు భారీగా వచ్చారు. దీంతో బరులు కిటకిటలాడాయి. సంక్రాంతి కోడిపందాలు గోదావరి జిల్లాల్లో సంప్రదాయంగా నిర్వహించబడుతుండగా, ఈ ఏడాది మరింత ఉత్సాహంగా సాగుతున్నాయి. పందాల్లో వేలాది కోళ్లు నేలకొరగగా, కోట్ల రూపాయల లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది. పందెం రాయుళ్లు భారీ మొత్తాల్లో పందాలు కడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీసుల నిఘా ఉన్నప్పటికీ, కోడిపందాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నట్లు సమాచారం. మొత్తం మీద సంక్రాంతి పండుగ వాతావరణంలో కోడి పందాలు గోదావరి జిల్లాల్లో ప్రధాన ఆకర్షణగా మారాయి.



# ముగిసిన మకరజ్యోతి ఉత్సవాలు

**స్పీకర్ అయ్యన్న పాత్రుడికి ఎన్టీఆర్ జీవన సాఫల్య పురస్కారం**

**అనకాపల్లి,జనవరి16 :**

అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో మకరజ్యోతి ఉత్సవాలు ముగిశాయి. స్థానిక ఐదు రోడ్ల కూడలి నుంచి కృష్ణ బజార్, వేంకటేశ్వర స్వామి ఆలయం మీదుగా రథోత్సవం సాగింది. ఈసందర్భంగా వేంకటేశ్వర స్వామి ఆలయంలో శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు సతీసమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సినీ సంగీత దర్శకుడు కోటి, అనకాపల్లి ఎంపీ రమేష్ హాజరయ్యారు.ఆ తర్వాత ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో అయ్యన్నపాత్రుడుకి ఆంధ్ర సారస్వత పరిషత్తు.. ఎన్టీఆర్ జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించింది. పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ మూడో తెలుగు మహాసభల తీర్మానాల ప్రతులను అయ్యన్నపాత్రుడుకి అందజేశారు. సంగీత దర్శకుడు కోటి తన పాటలతో అలరించారు. ఈ పురస్కార ప్రదానం కార్యక్రమంలో పలువురు స్థానిక ఐఏఎస్, ఐపీఎస్‌లు, యూపీ అడిషనల్ డీఐజీ కిల్లాడ సత్యనారాయణ, సత్య సాయి జిల్లా జాయింట్ కలెక్టర్ భరద్వాజ్, పరిషత్తు సభ్యులతోపాటు పలువురు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం
శనివారం 17 జనవరి 2026



# రేవుపోలవరం తీరానికి పోటెత్తిన పర్యాటకులు



**ఎస్. రాయవరం, జనవరి 16, (మనసులోమాట)..** ఎస్. రాయవరం మండలం రేవుపోలవరం సముద్ర తీరం శుక్రవారం పర్యాటకులుతో పోటెత్తింది. కనుమ పండుగ సందర్భంగా కుటుంబం, స్నేహితులుతో సరదాగా గడిపేందుకుగాను పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. సాయంత్రం సమయం లో సముద్ర తీరంలో పకృతి అందాలను అస్వాదిస్తూ సరదాసరదాగా గడిపారు. మధ్యాహ్నం నుండితీరానికి సందర్శకులుచేరుకుని సముద్ర స్నానాలు ఆచరించారు. సుదూర ప్రాంతాలునుండి సందర్శకులు తీరానికిచేరుకుని ఉత్సాహంగా గడిపారు.సంక్రాంతి పండుగశెలువులు నేపథ్యంలో తీరంమంతా జనసంద్రంగా మారింది. తీరంలో సాయిబాబా, రాధమాధవస్వామిలను దర్శించుకున్నారు.




# కలెక్టరేట్ క్యాంటీన్ రమణ

## తెలుగు సంప్రదాయానికి నిలువుటద్దం

**విజయనగరం (మనసులో మాట ):జనవరి 16:** ఆధునిక పోకడల్లో పడి అందరూ మన మూలాలను మర్చిపోతున్న తరుణంలో, ఒక వ్యక్తి తన వృత్తిని నిర్వహిస్తూనే మన ప్రాచీన కళను కాపాడుతూ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆయనే విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయ క్యాంటీన్ నడుపుతున్న రమణ.

అధికారులు, సామాన్య ప్రజలతో నిత్యం రద్దీగా ఉండే కలెక్టరేట్ ప్రాంగణంలో అందరికీ సుపరిచితుడైన రమణ, పండుగ వేళలో తనలోని మరో కోణాన్ని ఆవిష్కరించాడు. గంగిరెద్దుల వేషధారణలో, డోలు దరువుతో మన తెలుగు వారి అచ్చమైన సంప్రదాయానికి ప్రతిరూపంగా నిలిచారు.

క్యాంటీన్ బాధ్యతల్లో ఉంటూనే.. కళపై మక్కువ

క్యాంటీన్ బాధ్యతలు చూసుకుంటూ ఎంతో బిజీగా గడిపే రమణ, పండుగ రాగానే మన సంస్కృతిని భుజాన వేసుకుంటాడు. డోలును భుజానికి తగిలించుకుని ఆయన ఇచ్చే దరువు, ఆ సన్నాయి రాగాల సందడి పల్లెటూరి వాతావరణాన్ని తలపిస్తుంది. హోదా కంటే మన వారసత్వమే గొప్పదని రమణ నిరూపిస్తున్నారు.

**అందరికీ ఒక స్ఫూర్తి**

నేటి తరం యువత తమ సంస్కృతిని, కళలను మర్చిపోతున్న తరుణంలో, జిల్లా కలెక్టర్ కార్యాలయం వంటి చోట పని చేస్తూ కూడా ఇలాంటి కళా రూపానికి పునరుజ్జీవం పోయడం విశేషం.

**కళ పట్ల గౌరవం**


ఏ పనైనా చేసేటప్పుడు మొహమాటం పడకుండా, మన కళను ప్రదర్శించడానికి రమణ చూపించిన ఉత్సాహం అందరినీ ఆశ్చర్యపరిచింది.

**వారసత్వ సంరక్షణ:** మన పండుగలు, కళలు అంతరించిపోకుండా కాపాడుకోవాలనే సందేశాన్ని రమణ స్వయంగా ఆచరించి చూపిస్తున్నారు,

**చేసే వృత్తి ఏదైనా**

మన సంస్కృతిని కాపాడడం మన బాధ్యత" అని చాటిచెబుతున్న రమణ ఇప్పుడు విజయనగరంలో చర్చనీయాంశమయ్యాడు. పండగంటే కేవలం సంబరం మాత్రమే కాదు, ఇలా మన కళలను గౌరవించడం కూడా అని రమణ నిరూపించారు

# నేడు రైవాడ, ఎన్ జి నగరంలో పేరంటాలు తీర్థ మహోత్సవం



**దేవరాపల్లి, జనవరి 16, (మనసులో మాట) :** మండలంలోని రైవాడ ఎరకాలమ్మ, ఎన్ జి నగరం నారి తల్లమ్మ పేరంటాల తీర్థ మహోత్సవం శనివారం (నేడు ) అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి అమ్మవారి ఆలయం వద్ద ధూప దీప నైవేద్యాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్జీ నగరం గ్రామంలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి జిల్లాస్థాయి ఎడ్ల పరుగుల ప్రదర్శన జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 12 వేలు, రూ. 10 వేలు, రూ. 8 వేలు, రూ. 6 వేలు, రూ. 5 వేలు, రూ. 3 వేలు బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. రాత్రికి బాలు రైడర్స్ విశాఖపట్నం వారిచే డాన్స్ బేబీ డాన్స్, సీతారామ కళ్యాణం అను బుర్రకథ జరుగుతుందన్నారు.

# బొజ్జన్నకొండ వద్ద బౌద్ధ మేళా

## విదేశీ, స్వదేశీ బౌద్ధ బిక్షువుల పూజలు - తీర్థానికి పోటెత్తిన భక్తులు
## ఆలరించిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు






**అనకాపల్లి రూరల్, జనవరి 16 (మనసులో మాట):** ప్రపంచంలో ప్రసిద్ధి గాంచిన ప్రముఖ బౌద్ధ క్షేత్రం, ఆధ్యాత్మిక ఆరామం బొజ్జన్న కొండ వద్ద కనుమ నాడు బౌద్ధ తీర్థం కన్నుల పండుగగా జరిగింది. గురువారం బొజ్జన్నకొండ గుహలో బౌద్ధ స్తూపం వద్ద భగవాన్ బుద్ధునికి ప్రముఖ పూజ్య బౌద్ధబిక్షువులు ప్రత్యేక పూజలు, ప్రార్ధనలు చేశారు. అనకాపల్లి మణిహారం అతి ప్రాచీన బౌద్ధ పర్యాటక క్షేత్రం బొజ్జన్నకొండ వద్ద మహా బౌద్ధ మేళా కార్యక్రమము అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శతాబ్దాల చరిత్ర గల బౌద్ధ మేళ తీర్థ కార్యక్రమానికి దేశ, విదేశీ పూజ్య బౌద్ధ బిక్షువులు వెనరబుల్ డా జ్ఞాన్ దీప్ మహాథేరో (బుద్ధగయ), వెనరబుల్ రజ ధమ్మా జీ (మయన్మార్), వెనరబుల్ కంటి మార మోజీ (కంబోడియా), వెనరబుల్ వన్నెత్ చట్ జీ (కంబోడియా) పాల్గొని ప్రత్యేక పూజలు అనంతరం గౌతమ బుద్ధునిప్రవచనాలు సిద్ధాంతాలను భక్తులకు వివరించారు. బౌద్ధసంఘాల సమాఖ్యప్రతినిధులు, బౌద్ధ ఉపాసకులు, బౌద్ధ అభిమానులతో కలసి బౌద్ధ పతాకాలతో కొండపై ప్రధాన స్తూపం వరకు పంచశీల శాంతి ర్యాలీ యాత్ర నిర్వహించారు. అనంతరం కొండపై గల బుద్ధ గుహలో బౌద్ధ స్తూపం వద్ద భగవాన్ బుద్ధునికి పూలు, పండ్లు, స్వీట్లు సమర్పించి కొవ్వొత్తులు వెలిగించి బుద్ధునికి ప్రత్యేక పూజలు, ప్రార్ధనలు చేశారు. బుద్ధుని పంచశీల సూక్తులను ప్రభోదం గావించి బుద్ధుని అహింసా, శాంతి, సత్యం,శీలం, ధర్మ మార్గాలను ప్రతీ ఒక్కరూ ఆచరించి ప్రపంచ శాంతికి దోహదపడుతుందని పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతికి బుద్ధుని శాంతి మార్గమే శరణ్యమని భక్తులకు వివరించారు. కొండ దిగువ ఏర్పాటు చేసిన సభా సమావేశంలో పూజ్య బౌద్ధ బిక్షువులు భగవాన్ బుద్ధుడు సర్వమానవ వికాసానికి , ప్రపంచ శాంతి కొరకు తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప తత్వవేత్తని వారి ఆశయ స్ఫూర్తితో ప్రతీ ఒక్కరు ముందుకు సాగాలని వారు కోరారు.బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన మేళా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఇది కేవలం కనుమ రోజు ఒక పండగ కాకుండా నిత్యం ఈ ఆరామాన్ని దర్శించుకునే విధంగా కార్యక్రమాలు చేయవలసిన అవసరం ఉందన్నారు. ఇది పురాతన ప్రసిద్ధమైన ప్రాంతం కాబట్టి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఈ కొండను బౌద్ధారామంగా గుర్తించి, ఈ ప్రాంతానికి కావాల్సిన సదుపాయాలు ఏర్పాటు చేయమని కేంద్రానికి కి ఒక లేక పంపడం జరిగిందన్నారు. ఇక్కడ పిల్లలు ఆడుకునే విధంగా అతి త్వరలోనే పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో పోలీస్, ట్రాఫిక్, రెవెన్యూ, మెడికల్ అండ్ హెల్త్, ఆర్కియాలజీ, ఫైర్ డిపార్ట్మెంట్ల అధికారులు, కూటమి నాయకులు, సమీప గ్రామాల నుంచి వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మునగపాక లో ఆరోగ్యవంతమైన

# ఆవుల అలంకరణ పోటీలు

## - విన్నూత్న పోకడలకు తెరదీసిన యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్






**అనకాపల్లి/ మునగపాక, జనవరి 16 (మనసు లో మాట):** రాష్ట్రం లోనే తొలిసారి గా అనకాపల్లి జిల్లా లోని ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ విన్నూత్న పోకడలకు తెరదీసినట్టుంది. శుక్రవారం కనుమ పండుగ పర్వదినాన ఆ నియోజకవర్గ పరిధిలోని మునగపాక లో ఆరోగ్య వంతమైన ఆవుల అలంకరణ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు రైతులలో విశేష స్పందన కన్పించింది. జిల్లా నలుమూలల నుంచి వందకు పైగా ఆవులు ను పోటీలకు నిలిపారు. ఈ పోటీలలో ప్రథమ స్థానం కు ఏబై వేల రూపాయలు, ద్వితీయ స్థానం కు ముప్పై వేల రూపాయలు, తృతీయ స్థానం కు ఇరవై వేల రూపాయలు, చతుర్థ స్థానం కు పదిహేను వేల రూపాయలు, పంచమ స్థానం కు పది వేల రూపాయలు, అలాగే మూడు కన్సొలేషన్ బహుమతులు ప్రకటించడం జరిగింది. ముఖ్య అతిధిలు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి దాడి రత్నాకర్ తో కలిసి యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ ఈ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ పశువులతో రైతుల కుటుంబాలకు ఒక ప్రత్యేకమైన అనుబంధం ఉంటుందన్నారు. పశువులను ఆరోగ్యంగా ఆనందంగా పెంచి నట్లయితే రైతు కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతు ందని ఎమ్మెల్యే సుందరపు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పశువులను ఆప్యాయంగా పెంచాలన్నారు. అనంతరం పోటీల విజేతలైన గోమాతల రైతులకు ఎమ్మెల్యే విజయ్ కుమార్ ప్రోత్సహక నగదు బహుమతులు అందించారు. మొదటి బహుమతి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ కు చెందిన కపిల గోవు (ఆర్యన్)50000 రూపాయలు, రెండో స్థానం పెంటకోట సూర్యనారాయణ సత్యనారాయణ గోవు కు 30000 రూపాయలు, మూడో స్థానం హరిపాలెం కు చెందిన మారిశెట్టి శ్రీను గోవు కు 20000 రూపాయలు, నాలుగవ స్థానం బొడ్డేడ వెంకన్న గోవు కు 15000 రూపాయలు, ఐదో స్థానం ఆడారి వెంకటేష్ గోవుకు 10,000 రూపాయలు బహుమతులు దక్కాయి. అలాగే కన్సిలేషన్ బహుమతులు గా సాయి కుమార్, ఆడారి గణేష్, ఉల్లూరి శ్రీను గోవులకు వరుసగా 5000 వంతున నగదు బహుమతులు అందించారు. కాగా ఎమ్మెల్యే విజయ్ కుమార్ కు చెందిన కపిల గోవు కు వచ్చిన 50 వేల రూపాయలను మునగపాక రైతు సంఘానికి విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో మునగపాక మండల టిడిపి అధ్యక్షులు పెంటకోట విజయ్ బాబు, పిఎసిఎస్ ఛైర్పర్సన్ విల్లూరి నూక నర్సింగరావు, జిల్లా తెలుగు రైతు ప్రతినిధి దాడి ముసిలి నాయుడు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురామ్, జనసేన పార్టీ నాయకులు బొడ్డేడ అప్పలనాయుడు, ఆడారి శ్రీనివాసరావు, కూటమి నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన బాలిక పూజిత చికిత్స పొందుతూ మృతి



**పెదబయలు, జనవరి16,(మనసులో మాట)..** స్థానిక గిరిజన బాలికల ఉన్నత ఆశ్రమ పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న కొర్ర పూజిత 14 సంక్రాంతి సెలవులకు ఉరె ల్లి అనారోగ్యం తో బాధపడుతూ చికిత్స కోసం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స చేసిన ప్రయోజనం లేక గురువారం మృతి చెందింది. విద్యార్థిని స్వగ్రామం సీకారి పంచాయతీ కౌరుపల్లి లో దహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థిని హాస్టల్ శ్లో ఉన్నపటి నుంచి నీరసంగా అనారోగ్యం గా ఉండేదని విద్యార్థిని సంక్షేమ శాఖ అధికారులు విద్యార్థిని పట్ల కనీసం పర్యవేక్షణ లేదని వారు ఆరోపించారు. సంక్రాంతి సెల వులు నేపథ్యంలో సంబంధిత అధికారులకు ఉపాధ్యాయులకు చరవాణి ద్వారా విద్యార్థిని మృతిపట్ల సమాచారం సేకరిద్దామన్న అందుబాటులో లేకపోవడంతో మృతికి కారణాలు పూర్తిగా తెలియడం లేదు. ఉన్నత అధికారులు స్పందించి విద్యార్థిని మృతికి సమగ్రమైన దర్యాప్తు నిర్వహించి బాద్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థిని తల్లిదండ్రులు పేర్కొన్నారు.





అనకాపల్లి లో ఘనంగా డాక్టర్ కొణతాల రామలింగ స్వామి

# పురస్కార వేడుకలు

- రాష్ట్ర స్థాయి లో వివిధ రంగాల నుంచి ఉత్తమ సేవలు అందించిన ఆరుగురు కి అవార్డు లు ప్రదానం
- ముఖ్య అతిథిలు గా హజరైన రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మెన్ బత్తుల తాతయ్యబాబు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత డాక్టర్ కొణతాల పణిభూషణ్ శ్రీధర్

**అనకాపల్లి, జనవరి 16 (మనసు లో మాట):** అనకాపల్లి చంద్రశేఖర్ కళ్యాణ మండపం ప్రాంగణంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కొణతాల రామలింగస్వామి పురస్కార వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ రామలింగస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సంఘసేవా రంగం నుంచి విజయవాడ కు చెందిన చందన వెంకట గంగాధర్, అనంతపురం జిల్లా నుంచి యర్రగుంట కృష్ణారెడ్డి, విశాఖపట్నం నుంచి బోయిన నరేష్ కుమార్, పెందుర్తి నుంచి దాడి శ్రీను, ఉపాధ్యాయ రంగం నుంచి సామర్లకోట కు చెందిన తోటకూర సాయి రామకృష్ణ, ఉత్తమ విద్యార్ధి విభాగం నుంచి రుత్తల లీలా శ్రావణి ల ఉత్తమ సేవలకు డాక్టర్ కొణతాల రామలింగస్వామి పురస్కార్ అవార్డు లను ప్రదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ, వృక్షమిత్ర అవార్డు ల గ్రహిత, అనకాపల్లి గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు, డాక్టర్ కొణతాల రామలింగ స్వామి మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి కొణతాల ఫణిభూషణ శ్రీధర్ మాట్లడుతూ ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, రైతుల అభ్యున్నతి కి విశేష కృషి చేసిన స్వర్గీయ డాక్టర్ రామలింగ స్వామి ఆశయాలను కొనసాగించేందుకు గత ఐదు ఏళ్ళ నుంచి డాక్టర్ కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. అలానే రాష్ట్రం లోని జిల్లాల నుంచి వివిధ సేవా రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆరుగురు కి ఈ అవార్డు లను అందజేయడం జరుగుతుందన్నారు. ముఖ్య అతిధిలు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, విశాఖపట్నం రైల్వే ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. రామనాయుడు, విశ్రాంత శాస్త్రవేత్త కె. వీరభద్రరరావు తదితరులు చే ప్రతిష్టాత్మకమైన డాక్టర్ రామలింగ స్వామి అవార్డు లను ప్రదానం చేసిన అనంతరం వారు ప్రసంగిస్తూ డాక్టర్ కొణతాల రామలింగ స్వామి సేవలను వారు కొనియాడారు. భోగలింగేశ్వరస్వామి దేవస్థాన ఛైర్మెన్ కాంద్రేగుల సత్యనారాయణ, వివేకానంద విద్యా సంస్థ ల కరస్పాండెంట్ డాక్టర్ పేకేటి శ్రీనివాసరావు, ప్రముఖ వ్యాపారవేత్తలుకోరుకొండ బుచ్చిరాజు, కర్రి సన్యాసినాయుడు, ఉపాధ్యాయులు కె. శివశంకర్ బాబు, మళ్ళ జగదీష్, డాక్టర్ రామలింగ స్వామి మెమోరియల్ ట్రస్ట్ నిర్వహకురాలు కొణతాల లక్ష్మి పార్వతి, అధికసంఖ్యలో గ్రామస్తులు, పురప్రజలు పాల్గొన్నారు.

# అణుకు గ్రామానికి రహదారి మంజూరు



**కోటవురట్ల (మనసులో మాట) జనవరి 16:** కోటవురట్ల మండలం గొట్టివాడ శివారు అణుకు గిరిజన గ్రామంలో శుక్రవారం పర్యటించిన హోం మంత్రి వంగలపూడి అనితకు గిరిజనులు థింసా నృత్యంతో స్వాగతం పలికారు. గిరిజనుల గ్రామదేవత పరదేశమ్మను మంత్రి దర్శించుకుని పూజలు చేశారు. సంక్రాంతి పండుగను అణుకు గ్రామంలో గిరిజనుల మధ్య జరుపుకునేందుకు వచ్చినట్లు తెలిపారు. అలాగే గిరిజనుల కష్టసుఖాలను తెలుసుకోవడమే పర్యటన ముఖ్య ఉద్దేశంగా పేర్కొన్నారు.అణుకు గ్రామం నుంచి గొట్టివాడ వరకు 5.5 కి.మీ. రహదారి నిర్మాణానికి 2.50 కోట్లు మంజూరు చేసినట్లు గిరిజనుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. గ్రామానికి మూడు నెలల్లో సెల్ టవర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. గిరిజనులు గ్రామంలోని రేషన్ సరుకులు తీసుకునే విధంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామంలో మంచిని స్టాంప్ నిర్మిస్తామన్నారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గిరిజన యువకులతో కలిసి కాసేపు వాలీబాల్ ఆడారు. అనంతరం నూతన వస్త్రాలను గిరిజనులకు పంపిణీ చేశారు.మంత్రికి గిరిజన ఉత్పత్తులను గిరిజనులు బహుమతిగా అందజేశారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. వారు ఏ అవసరం ఉన్న తనను నేరుగా సంప్రదించవచ్చునన్నారు. జనసేన నియోజకవర్గం సమన్వయకర్త గెడ్డం బుజ్జి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు,మండల టిడిపి అధ్యక్షుడు లింగన్నాయుడు డీపీఓ సందీప్, డీఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీవారి గిరిప్రదక్షిణ



**ఎస్. రాయవరం, జనవరి16,(మనసులో మాట)..** అనకాపల్లి జిల్లాలోనే ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉప్మాక వెంకటేశ్వర స్వామి ఆలయంలో కనుమ పండగ సందర్భంగా శుక్రవారం సాయంత్రం స్వామివారి గిరిప్రదక్షిణ నిర్వహించారు. పుణ్యకోటి వాహనంపై స్వామివారిని అలంకరించి వేలాది మంది భక్తులు గోవింద నామస్మరణతో గరుడాద్రి పర్వతం చుట్టూ గిరిప్రదక్షిణ నిర్వహించారు. జిల్లాలో నలుమూలల నుండి వేలాది మంది భక్తులు స్వామి వారి దర్శించుకన్నారు. ఏడాదికి ఒక్కసారి మాత్రమే దర్శనమిచ్చే రాజాధిరాజా అలంకరణలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో టిటిడి అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



## కనుమ వేడుకల్లో రామగిరి శ్రీ రాములవారి తీర్థ మహోత్సవానికి హాజరైన కర్రి సాయికృష్ణ

**మునగపాక, జనవరి 16, మనసులో మాట..** ఎలమంచిలి నియోజకవర్గం, మునగపాక మండలం, రామగిరి గ్రామంలో ఎన్నో వందల ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ రాములవారి ఆలయంలో కనుమ పండుగ సందర్భంగా నిర్వహించిన శ్రీ రాములవారి తీర్థ మహోత్సవానికి తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీ కర్రి సాయికృష్ణ హాజరై భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ రాములవారికి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆయన, దర్శనానంతరం స్వామివారి కటాక్షంతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, శాంతియుత జీవితాన్ని గడపాలని స్వామివారిని ప్రార్థించారు. రామగిరి గ్రామంలో తరతరాలుగా కొనసాగుతున్న ఈ తీర్థ మహోత్సవం గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలు మరియు ఆధ్యాత్మిక విలువలకు ప్రతీకగా నిలుస్తోందని కర్రి సాయికృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. కనుమ పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ఈ మహోత్సవం భక్తులకు విశేష ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని తెలిపారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### వల్లభేశ్వరస్వామి జాతర సందర్భంగా

## రాష్ట్ర స్థాయి డాన్స్ పోటీలు



**ఎస్. రాయవరం, జనవరి 16,(మనసులో మాట)..** ఎస్. రాయవరం మండలం బంగారమ్మపాలెం మత్స్యకార గ్రామంలో ఈనెల 18వతేదీ ఆదివారం నిర్వహించే శ్రీ వల్లభేశ్వరస్వామి జాతర సందర్భంగా 17 వతేదీ శనివారం రాష్ట్ర స్థాయి డాన్స్ పోటీలు నిర్వహిస్తున్న ట్లు ఆగ్రామ సర్పంచ్ మైలపల్లి శ్రీను, ఎంపిటిసి సభ్యుడు పేర్ల మాధవ తెలిపారు. చొల్లంగి ఆమావాస్య సందర్భంగా ఏటానిర్వహించే స్వామివారి జాతరలో భాగంగా ఈపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ డాన్సు పోటీలలో మొదటి బహుమతిగా 50వేల రూపాయలు, ద్వితీయ బహుమతి గా 30 వేల రూపాయలు, తృతీయ బహుమతిగా 20 వేల రూపాయలును విజేతలుకు అందచేయన్నుట్లు తెలిపారు. జాతరలో భాగంగా శనివారం రోజున జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ బహుమతి గా15 వేలు, 10వేలరూపాయలు చొప్పున బహుమతులు అందచేస్తామన్నారు. వాలీబాల్ పోటీవిజేతలుకు మునగపాక ఎస్ ఐ ప్రసాదరావు అర్ధిక సహాయంఅందచేయనున్నట్లుతెలిపారు. దీనిలో భాగంగా ఆదివారం తెల్లవారుజామునుండి సముద్రస్నానాలు ఆచరిస్తారని, శనివారం రాత్రి జాగరణోత్సవం జరుగుతుందని తెలిపారు. జాతర సందర్భంగా గ్రామంలోపోలీసులుబందోబస్తు ఏర్పాటుచేసారు.

## పుట్టపర్తి అఖండ జ్యోతి దర్శనం సర్వపాప నాశనం



**దేవరాపల్లి, జనవరి 16, (మనసులో మాట) :** పుట్టపర్తి నుంచి వచ్చిన అఖండ జ్యోతి దేశ వ్యాప్తంగా పయనిస్తూ శనివారం ఉదయం 9 గంటలకు సబ్బవరం మండలంలో ప్రారంభమై వంగలి మీదుగా కోటపాడు మండలానికి చేరుకుని, చంద్రయ్యపేట, జోగన్నపాలెం , వారాడ మీదుగా దేవరాపల్లి మండలానికి చేరుకుంటుందని అన్నారు. దేవరాపల్లి మండలం ములకలాపల్లి,వేచలం, కొత్తపల్లి, కాశీపురం మీదుగా సాయంత్రం 6 గంటలకు దేవరాపల్లి చేరుకుంటుందని ప్రతీఒక్కరూ,సాయిభక్తులు, గ్రామస్తులు ,ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ,జ్యోతి దర్శనం చేసుకుని శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య ఆశీస్సులు పొందాలని సత్యసాయి సేవా సంస్థల జోన్ ఇంచార్జ్ సి హెచ్. వి. రవిశంకర్ తెలియజేశారు.

## ఉత్సాహంగా జరిగిన జిల్లా స్థాయి ఎడ్ల బండ్లు పోటీలు

పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ సీఎం రమేష్

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు - దౌడు తీస్తున్న ఎడ్ల బళ్ళు





**మునగపాక, జనవరి 16, మనసులో మాట..** మండల కేంద్రమైన మునగపాక లో జిల్లాస్థాయి ఎడ్ల బల్ల పోటీలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ, గౌరీ యూత్, ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలోమాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ జిల్లాస్థాయిలోనే సంక్రాంతి సంబరాల్లో మునగపాక గ్రామం 16 సంవత్సరాల ఎడ్ల బండ్లు పోటీలు నిర్వహిస్తూ రైతులను ఉత్సాపరిచే విధంగా ఈ పోటీలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని అన్నారు. సంక్రాంతి సంబరాలు రైతులతో ఎక్కువ అనుబంధం ఉన్న మునగపాక గ్రామం ఏటా ఈ పండుగను నిర్వహించడం ఎంతో అభినందనీయమని నిర్వాహకులను దాడి వీరభద్ర రావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి శాసనసభ్యులు సుందర విజయకుమార్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు గుర్తొచ్చే గ్రామం మునగపాక అని, ప్రతి సంవత్సరం ఉత్సాహంగా ఈ పోటీలను నిర్వహించడం నాకు చాలా ఆనందంగా ఉందని ఆనంద వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు సుందరపు సతీష్, దాడి వీరభద్ర తనయుడు దాడి రత్నాకర్, జిల్లా బిజెపి అధ్యక్షుడు పరమేశ్వర రావు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, ఎలమంచిలి నియోజవర్గం టిడిపి పరిశీలకులు జగన్నాథం, నిర్వాహకులు దాడి అప్పలనాయుడు, టెక్కలి పరశురాం, పెంటకోట విజయ్, కోరుకొండ రాంప్రసాద్, దాడి ముసలి నాయుడు, విల్లూరి నూక నరసింహారావు, ఆడారి గోవిందు, పెంటకోట శ్రీరామ్మూర్తి, దాడి శివ, పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## మునగపాక నందీశ్వర కళా ప్రాంగణం ఆవరణలో ముగ్గుల పోటీ





**మునగపాక , జనవరి 16, మనసులో మాట..** మండల కేంద్రం మునగపాక శ్రీ నందీశ్వర కళా ప్రాంగణం ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మీ పోటీల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల్లో మహిళలకు అత్యంత ఇష్టమైన ముగ్గులు పోటీలను నిర్వాహకులు ప్రతి యాట నిర్వహించడం ఎంతో అభినందనీయమని అన్నారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బొడ్డేడ ప్రసాద్ చేతుల మీదగా బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో సీనియర్ విభాగంలో కే వరలక్ష్మి ప్రథమ స్థానం, మాడ మధుబాల ద్వితీయ, టెక్కలి శాంతి తృతీయ బహుమతిని దక్కించుకోగా, జూనియర్ విభాగంలో ఎం సుజనా ప్రథమస్థానం, టీ తాబిత ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో మునగపాక ఎస్ ఐ పి ప్రసాద్ రావు, ఆడారి శ్రీకాంత్, ఆడారి గణపతి అచ్చియ్య నాయుడు, ఆడారి కాశిబాబు, పెంటకోట వెంకటరావు, వెలగ శ్రీనివాసరావు, సూరిశెట్టి శ్రీనివాసరావు, కెవిఎస్ అప్పారావు పలువురు పాల్గొన్నారు

## బొడ్డేడ కుటుంబ సభ్యులు ఒకే ఆకులో సహ ఫంక్తి భోజనం

### సమైక్యతను చాటిన బొడ్డేడ కుటుంబీకులు



**అనకాపల్లి, జనవరి 16 (మనసు లో మాట):** నూతన తరాలకు సాంప్రదాయ సమైక్యతల విలువలు తెలిపే విధంగా ఒకే కుటుంబానికి చెందిన 60 మంది సభ్యులు ఒకేచోటికి చేరి ఒకే ఆకులో సహఫంక్తి భోజనం చేసి సమైక్యతకు ప్రత్యేకతగా బొడ్డేడ కుటుంబీకులు ఆదర్శంగా నిలిచారు. అనకాపల్లి గవరపాలెం లో శుక్రవారం సంక్రాంతి కనుమ పండుగ వేడుకలు పురష్కరించుకొని ఉమ్మడి విశాఖ జిల్లా అనకాపల్లి గవరపాలెం కు చెందిన సుంకరమెట్ట శ్రీ సత్యనారాయణ స్వామి శ్రీ సూర్యనారాయణ స్వామి వార్ల దేవస్థానం చైర్మన్ బొడ్డేడ మురళి కుటుంబీకులు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నారు. ప్రతి ఏటా వలె ఈ ఏడాది సంక్రాంతి కి కూడా ఒకే ఆకుపై సహా ఫంక్తిభోజనం చేసి సమైక్యతను చాటుకున్నారు. గడిచిన 5 దశాబ్దాల నుంచి కుటుంబ పెద్దల ఆశయాలకు అనుగుణంగా ఉద్యోగ, వ్యాపార రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా కనుమ పండుగ కు గవరపాలెం చేరుకుంటారు. కనుమ పండుగ వేడుకలలో భాగంగా ఆటపాటలతో ఉత్సహం గా గడుపుతారు. అనంతరం దేవస్థాన ఛైర్మెన్ బొడ్డేడ మురళి నేతృత్వంలో సమఖ్యతను చాటి చెప్పే విధంగా 60 మంది కుటుంబ సభ్యులు సహాఫంక్తి భోజనం చేయడం విశేషం. ఏదేమైనా ఈ బొడ్డేడ కుటుంబీకులు సమఖ్యత ఆదర్శప్రాయమే అవుతుంది.

### రోలుగుంట మండలం కంచుగుమ్మలలో సంక్రాంతి సందర్భంగా

## మహిళల ముగ్గుల పోటీలు



**రోలుగుంట మనసులో మాట, జనవరి 16.** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని కంచుగుమ్మల గ్రామంలో వేణుగోపాలస్వామి గుడి ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన సుమారు 40 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని, అందమైన రంగుల రంగవల్లులతో తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. కార్యక్రమం హైందవ సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేస్తూ, సంక్రాంతి పండుగ శోభను మరింత పెంచింది. ఈపోటీలకు జడ్జిలుగా రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఆంగ్ల ఉపాధ్యాయురాలు గా పని చేస్తున్న శ్రీమతి పి. వి. ఎం. నాగజ్యోతి, రిషి కాలేజీ కరస్పాండెంట్ శ్రీ కోన సతీష్, డాన్ బాస్కో కాలేజ్ కెమిస్ట్రీ లెక్చరర్ శ్రీ ఓ. సత్యనారాయణ, శ్రీ చిరంజీవి, శ్రీ రాజారావు వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా శ్రీమతి పి. వి. ఎం. నాగజ్యోతి, రోలుగుంట ఎస్సై శ్రీ జి. రామకృష్ణ హాజరయ్యారు పోటీలలో గెలుపొందిన వారికి : మొదటి బహుమతి: గ్రైండర్ రెండవ బహుమతి, కూలర్ మూడవ బహుమతి, మిక్సీ నాలుగవ బహుమతి డైనింగ్ సెట్. పాల్గొన్న ప్రతి మహిళకు చీరలు బహూకరించారు. ముఖ్య అతిథి శ్రీమతి నాగజ్యోతి మాట్లాడుతూ, "ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం ఆనందం. మహిళల ప్రతిభ అద్భుతం. ఇలాంటి కార్యక్రమాలు సంప్రదాయాలను తరతరాలకు చేరవేస్తాయి" అని అన్నారు. ఎస్సై రామకృష్ణ కూడా మహిళల సృజనాత్మకతను ప్రశంసించారు. గ్రామస్తులు ఈ కార్యక్రమం ద్వారా సంక్రాంతి ఉత్సవాలు మరింత రసవత్తరంగా మారాయని హర్షం వ్యక్తం చేశారు. హైందవ ధర్మ సంప్రదాయాల ప్రచారానికి ఇది మైలురాయిగా నిలిచింది.

## కుశర్లపూడిలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి



**రోలుగుంట మనసులో మాట జనవరి 16..** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం కుశర్లపూడి గ్రామంలో సర్పంచ్ మద్దు అప్పలనాయుడు ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ ముగ్గులు పోటీల్లో సుమారు 48 మంది మహిళలు ముగ్గులు పోటీల్లో పాల్గొనగా అందులో మొదటి బహుమతి గెలిచిన కే సుజాతకు 5వేలు, రెండవ బహుమతి మద్దు లాస్య 3వేలు, మూడవ బహుమతి గుడివాడ ప్రగతికి 2వేలు అందజేయడం జరిగింది. వీటితోపాటు మిగిలిన 45 మందికి కౌన్సిలేషన్ బహుమతులు ఇవ్వడం జరిగింది. అలాగే ఈ కార్యక్రమానికి న్యాయం నిర్ణేతలైన ఉపాధ్యాయులకు సాలువాతో సత్కరించి బహుమతిని బహుకరించడం జరిగింది. అలాగే దీంట్లో భాగంగా 400 మంది నిరుపేద కుటుంబాలకు చీరలు, దుప్పట్లు అందజేయడం జరిగింది. అనంతరం సుమారు 1500 మందికి అన్న సమారాధన కార్యక్రమం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్దు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ కొల్లి సన్యాసి నాయుడు, పెద్దింటి అమ్మ తల్లి ఉత్సవ కమిటీ చైర్మన్ కిల్లాడ అప్పల జ్యోతి నాయుడు, గొర్లి రమణ, ఎస్ పెద్ది నాయుడు, కేతిరెడ్డి సుధాకర్ నాయుడు, గొర్లి గోవింద, గొర్లి నారాయణరావు పెద్దలు గ్రామస్తులు నాయకులు పాల్గొన్నారు.



### 'కన్నవరం'లో సంక్రాంతి

## వాలీబాల్ సందడి

### - గిరిజన యువతకు క్రీడా ప్రోత్సాహం

**కొయ్యూరు, జనవరి 16 (మనసులో మాట):** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కొయ్యూరు మండలం, బూదరాళ్ల పంచాయతీ పరిధిలోని కన్నవరం గ్రామంలో నిర్వహించిన పంచాయతీ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ అత్యంత ఉత్సాహంగా ముగిసింది. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు వంతల నారాయణ, వైఎస్సార్సీపీ పంచాయతీ వర్కింగ్ ప్రెసిడెంట్ కంకిపాటి శివకుమార్ ఆధ్వర్యంలో ఈ క్రీడలు జరిగాయి. మారుమూల ప్రాంతాల్లోని గిరిజన యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ పోటీలు ఒక వేదికగా నిలిచాయి.

హోరాహోరీగా సాగిన పోటీలు – విజేతల వివరాలు:

పలు జట్లు తలపడిన ఈ టోర్నమెంట్‌లో క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారు. తుది పోరులో విజయం సాధించిన జట్ల వివరాలు ఇలా ఉన్నాయి:

ప్రథమ బహుమతి: లోయలపాలెం టీమ్ (రూ. 8,000 నగదు)

ద్వితీయ బహుమతి: గొర్రెలమెట్ట టీమ్ (రూ. 5,000 నగదు)

తృతీయ బహుమతి: గోధుమలంక టీమ్ (రూ. 3,000 నగదు)

క్రీడలతో మానసిక ఉల్లాసం: ఎంపీటీసీ వంతల నారాయణ

ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు వంతల నారాయణ మాట్లాడుతూ, క్రీడలు శారీరక ధారుడ్యాన్ని ఇవ్వడమే కాకుండా మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని తెలిపారు. క్రీడల వల్ల యువత మధ్య స్నేహభావం పెరుగుతుందని, క్రమశిక్షణ అలవడుతుందని పేర్కొన్నారు. గిరిజన క్రీడాకారులు కేవలం పంచాయతీ స్థాయికే పరిమితం కాకుండా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి గ్రామానికి గుర్తింపు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

**వెల్లువెత్తిన అభినందనలు:**

మారుమూల గ్రామాల్లో క్రీడా స్ఫూర్తిని నింపుతూ, యువతను క్రీడల వైపు మళ్లించేందుకు కృషి చేస్తున్న వంతల నారాయణ, శివకుమార్ పై స్థానికులు ప్రశంసల వర్షం కురిపించారు. యువతలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం గర్వకారణమని బూదరాళ్ల పంచాయతీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

### బిజెపి మండల అధ్యక్షుడు మల్ల కాళేశ్వరరావు ఆధ్వర్యంలో

## దుప్పట్లు పంపిణీ



**మునగపాక, జనవరి 16, మనసులో మాట..** మునగపాక మండలం నాగులపల్లి గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా కనుమ పండుగ సందర్భంగా శ్రీ మల్ల కాళేశ్వరరావు స్వగృహం నందు శ్రీ మల్ల రామనాయుడు కొబ్బరి రాములు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మల్ల అప్పలనాయుడు గారి జ్ఞాపకార్థం వారి కుమారుడు ట్రస్ట్ వ్యవస్థాపకులు మల్ల కాళీశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 250 పేద ప్రజలకు తుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. మల్ల కాళీశ్వరరావు మాట్లాడుతూ సంక్రాంతి సమయంలో కొత్త దుస్తులు ధరించాలని ఉద్దేశంతో పేదలకు దుప్పట్లు చీరలు గత 9 సంవత్సరాలు నుండి ఆనవాయితీ కొనసాగుతుంది. అదే విధంగా హిందూ ధర్మ పరిరక్షణ కోసం పలు ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నాము అని చెప్పడం జరిగినది. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్ల ఆదినారాయణమూర్తి గారు, ఉమామహేశ్వరరావు గారు, గోపాల్ రావు గారు, దివాకర్ గారు, అప్పలనాయుడు గారు, శ్రీను, పెంటకోట గరీబ్ నాయుడు, ఆడారి రాహుల్ మరియు శ్రీ వెంకటేశ్వర స్వామి పల్లకి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దిమ్మల అచ్చియమ్మ జ్ఞాపకార్థం దుప్పట్లు పంపిణీ

దుప్పట్లు పంపిణీ చేస్తున్న గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు



**మునగపాక, జనవరి 16 మనసులో మాట..** మునగపాక పంచాయతీ పరిధిలోగల శిరిడి సాయిబాబా ఆలయంలో గత 16 సంవత్సరాలుగా గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు అమ్మ అచ్చి అమ్మజ్ఞాపకార్థం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఈ దిమ్మల అప్పారావు మాట్లాడుతూ తన తల్లి జ్ఞాపకార్థం గత 16 సంవత్సరాలుగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో 135 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. దిమ్మల నూకరాజు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం లో పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



### సంక్రాంతి పేరుతో జోరుగా

# అక్రమ కోడి పందాలు

- చిత్తుల ఆటల్లో లక్షల రూపాయల లావాదేవీలు
- సెలవుల ముసుగులో పోలీసుల కనున్నల్లోనే పందెలు.

**హుకుంపేట జనవరి 16 (మనసులో మాట)..** మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో జోరుగా కోడి పందేలు చిత్తులటలు. సంక్రాంతి పండుగను ఆసరాగా చేసుకుని మండలంలోని పలు గ్రామాల్లో అక్రమ పందాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పండుగ ఆనందం పేరుతో గ్రామ శివార్లలో, తోటల మధ్యలో కోడి పందాలు, చిత్తుల ఆటలు బహిరంగ రహస్యంగా నిర్వహిస్తున్నారు. ఈ పందాలలో ఒక్కో ఆటపై వేల నుంచి లక్షల రూపాయల వరకు బెట్టింగులు జరుగుతున్నట్లు సమాచారం. పందెందారులు ముందుగానే ఏర్పాట్లు చేసుకుని గుంపులుగా ఈ అక్రమ కార్యకలాపాలను నిర్వహిస్తుండటం గమనార్హం. పండుగ సెలవుల కారణంగా యువతతో పాటు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పందాల వద్దకు చేరుతుండటంతో సామాజిక అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం కలుగుతోంది. అధికారులు, పోలీసులు ఈ అక్రమ పందాలపై కన్నెత్తి చూడకపోవడంపై స్థానికుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. చట్ట విరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కోదండ సీతారాముడు నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా రాపేటి పరమేశ్వరరావు





**మునగపాక, జనవరి 16, మనసులో మాట..** మండలలో గవర్ల అనకాపల్లి గ్రామం లో అనేక దశాబ్దాల క్రితం గౌరీగిరి పై వెలిసిన శ్రీశ్రీశ్రీ కోదండ సీతారామచంద్రస్వామి ఆలయం లో ఇప్పటివరకూ పాలక వర్గం అధ్యక్షులు గా వ్యవహరించిన దాడి శ్రీను, గంగాజీ( బ్రదర్స్) వైస్ చైర్మన్ పాలమర్శెట్టి నరేంద్ర, కోశాధికారి పలమరశెట్టి సుధాకర్, సెక్రెటరీ రాపేటి పరమేశ్వరరావు, సలహాదారులు దాడి అప్పారావు, ఆళ్ల వెంకటేష్, కాంద్రేగుల శేషు, బొడ్డేడ స్వామి త్రినాధ్, పొలమరశెట్టి అంజి, పొలమరశెట్టి శ్రీకాంత్, పోలమరశెట్టి అప్పారావు, కాంద్రేగుల వెంకటేష్, పెంటకోట వినోద్, కాంద్రేగుల జగ్గప్పారావు ( చిన్న),బొడ్డేడ గణేష్, మల్ల అప్పలనాయుడు ( బ్రదర్స్) ఆళ్ల హనుమంతు (బ్రదర్స్ ) కాంద్రేగుల జగ్గారావు.కర్రి శ్రీనివాసరావు, చదరం శ్రీహర్సా,ఆళ్ల దిలీప్, కమిటీ సభ్యులు... ఆధ్వర్యంలో పోయిన సంవత్సరం అంతా జరిగిన అనేక కార్యక్రమాలు శ్రీ రామనవమి వేడుకలు ఈ కార్యక్రమం లో 12 జంటలకు దేవుని వివాహ వేడుకల్లో కూర్చునే అవకాశం కూడా ఏర్పాటు జరిగింది.ముక్కోటి ఏకాదశి పర్వదినం నాడు జరిగిన వేడుకలు గాని . అలాగే పునరనిర్మాణం జరిగి ఇప్పటివరకూ ప్రతీ సంవత్సరం జరుపుకునే వేడుకల్లా గానే 22వ వార్షికోత్సవాన్ని గణం గా నిర్వహించడం జరిగింది..

అలాగే ప్రతీ సంవత్సరం కనుమ రోజున జరిగే.. లెక్కలు పూర్తి చేసుకొని గత సంవత్సర కాలం లోనూ జరిగిన అన్ని కార్యక్రమాలను గొప్పగా.. ట్రాన్సపరెంట్ గా జరగడం వలన కమిటీ ని పెద్దలు సత్కరించడం జరిగింది.

కొత్తకార్యవర్గాన్ని కూడా ఏర్పాటు చేసుకోవడం జరిగింది.. ఈ కార్యక్రమం లో ఆలయ ధర్మకర్తలు, భక్తులు, గ్రామ ప్రజలు, దేవస్థానం శాశ్వత సభ్యులు. కాంద్రేగుల సూర్యనారాయణ. షేక్ ఇస్మాయిల్. బొడ్డేడ ముసిలి నాయుడు. బొడ్డేడ రాము. దాడి నాగేశరావు. వెలగ సత్తిబాబు పోలమరశెట్టి సుధాకర్. కాంద్రేగుల శేషు ఆళ్ల వెంకటేష్ దాడి అప్పారావు పోలమరాశెట్టి అప్పారావు బొడ్డేడ గణేష్ పొలమరశెట్టి శ్రీకాంత్,బొడ్డేడ శ్రీను, పెంటకోట వినోద్ తదితర పెద్దలు పాల్గోవడం జరిగింది..

నూతన కార్యవర్గం అధ్యక్షులు రాపేటి పరమేశ్వరరావు
వైస్ చైర్మన్ దాడి శ్రీను
కోశాధికారి పొలమరశెట్టి నరేంద్ర కుమార్
సెక్రెటరీ పొలమరశెట్టి సుధాకర్
సలహాదారులు దాడి అప్పారావు, ఆళ్ల వెంకటేష్ను ఎంపిక చేసుకోవడం జరిగింది.

# జిల్లాస్థాయి ఎడ్ల బండి పోటీల్లో విజేత లెక్కల సత్తిబాబు

### - విజేతలకు బహుమతులు అందజేస్తున్న దాడి రత్నాకర్





**మునగపాక, జనవరి 16, మనసులో మాట..** ఎంతో ఉత్సాహంగా జరిగిన జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పోటీల్లో లెక్కల సత్తిబాబుకు ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు. మండల కేంద్రం మునగపాక లో జరిగిన జిల్లా స్థాయి ఎడ్లబల పోటీలు చాలా ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను తొలగించడానికి జిల్లా నలుమూలల నుండి వేలాదిమంది తరలు వచ్చారు. పోటీలను ఎంతో ఆసక్తితో ప్రజలు తిలకించారు. ఈ పోటీలను ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ప్రారంభించారు. విజేతలకు బహుమతులను రాష్ట్ర టిడిపి ఆర్గనైజింగ్ కార్యదర్శి దాడి రత్నాకర్ చేతుల మీద అందజేశారు. ఎడ్లబల్ల పోటీల్లో ద్వితీయ స్థానం దేవరపల్లి సత్తిబాబు, తృతీయ బహుమతి లెక్కల సత్తిబాబు, చతుర్థి బహుమతి బి కొత్తూరు శంకర్, ఎం కొత్తపల్లి రామకృష్ణ, పంచము బహుమతి చుక్కల పల్లి మజ్జి దేవేందర్ దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి పరిశీలకులు బొండా జగన్నాథం, రాష్ట్ర టిడిపి ఆర్గనైజింగ్ కార్యదర్శి సాయి కృష్ణ, కే రాంప్రసాద్, కే గోపికృష్ణ,మండల టిడిపి అధ్యక్షుడు పెంటకోట విజయ్, దాడి ముసిలి నాయుడు, దాడి అప్పలనాయుడు, విల్లూరు నూక నరసింహారావు, ఆర్డర్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

# వినిగ్నంగా సంక్రాంతి సంబరాలు





**హుకుంపేటజనవరి 16 (మనుసులో మాట)** ఏజెన్సీ ప్రాంతంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు హుకుంపేట మండలంలోని ఏజెన్సీ ప్రాంత గ్రామాల్లో సంక్రాంతి పండుగను గిరిజనులు సంప్రదాయబద్ధంగా, ఆత్మీయంగా జరుపు కున్నారు. పంట కోతలు పూర్తవడంతో రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసి ంది. ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు, గోబ్బెమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచా యి. పల్లెల్లో పశుపూజలు, గోదానాలు నిర్వహించి ప్రకృతి దేవతలకు కృతజ్ఞతలు తెలిపారు. భోగి రోజు తెల్లవారుజామున భోగి మంటలు వెలిగించి, పాతదాన్ని వదలి కొత్త జీవనానికి స్వాగతం పలికారు. సంక్రాంతి రోజున కుటు ంబ సభ్యులు, బంధువులు ఒకచోట చేరి సంప్రదాయ వంటకాలు తయారు చేసి పంచుకున్నారు. గిరిజన సంప్రదాయానికి ప్రతీకగా పసుపు, కుంకుమతో పశు వులను అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగింపులు నిర్వహించారు.

కనుమ రోజున యువత సంప్రదాయ ఆటలు, గిరిజన నృత్యాలతో సందడి చేసింది. డప్పులు, మేళాలు మోగు తూ పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది. వలస వెళ్లిన కుటుంబ సభ్యులు స్వగ్రామాలకు రావడంతో గ్రామాల్లో కళకళలాడా యి. హుకుంపేట ఏజెన్సీ ప్రాంతంలో సంక్రాంతి సంబరాలు గిరిజన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకగా నిలిచాయి.

# అప్పలరాజుపురంలో టిడిపి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



**చీడికాడ, జనవరి 16, (మనసులో మాట)** మండలంలో అప్పలరాజు పురం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా శుక్రవారం గ్రామ టిడిపి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు జరిగాయి ఈ పోటీల్లో మహిళలు పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు మొదటి బహుమతి 4500 రూపాయలు రెండవ బహుమతి 3500 రూపాయలు మూడవ బహుమతి 2500 రూపాయలు నాలుగో బహుమతిగా 2000 రూపాయలు ఐదో బహుమతి గా 1500 రూపాయలు ఆరో బహుమతిగా వెయ్యి రూపాయలు ఏడవ బహుమతిగా 500 రూపాయలు ముగ్గుల పోటీలకు నిర్వాహకులు ప్రకటించారు మొదటి బహుమతిగా కాశీ మంగ రెండో బహుమతిగా సిహెచ్ గాయత్రి మూడో బహుమతిగా చుక్క హారిక నాలుగో బహుమతిగా కె రమాదేవి ఐదో బహుమతిగా కె ధనలక్ష్మి ఆరో బహుమతిగా జి హేమలత ఏడవ బహుమతిగా జి హర్షిత నిలిచారు అలాగే ముగ్గుల వేసిన వారందరికీ 300 రూపాయలు కమిటీ వారు ప్రకటించారు వీరందరికీ చీడికాడ పిఎసిఎస్ అధ్యక్షులు గవిరెడ్డి జగన్నాథం గ్రామ టిడిపి నాయకులు గవిరెడ్డి శ్రీనివాసరావు మాజీ ఎమ్మెల్యే తనయుడు కురచా శేషు గ్రామ టిడిపి అధ్యక్షులు కురచా సురేషు బహుమతులు అందజేశారు అలాగే ఇంగ్లీషు డిక్షనరీలు అందజేశారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాశీపురంలో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

### - 500 మందికి వైద్య పరీక్షలు, మందులు పంపిణీ



**దేవరాపల్లి, జనవరి 16, (మనసులో మాట) :** మండలంలోని కాశీపురం గ్రామంలో స్ఫూర్తి ఫౌండేషన్ ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో గురువారం జరిగిన ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అదే గ్రామానికి చెందిన ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ బొడ్డు దేముడు బాబు ఆధ్వర్యంలో డాక్టర్ పూడి శివాజీ, డాక్టర్ ఆదిరెడ్డి సుష్మ కళ్యాణి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మెగా వైద్య శిబిరం, ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ రక్తదాన శిబిరం నిర్వహిస్తూ 10వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాలలో మండల స్థాయి ప్రతిభా పరీక్షను నిర్వహించారు. ఉదయం 6 గంటల నుండి సుమారు 500 మందికి ఉచితంగా షుగర్, బిపి, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించారు. తగిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. 40 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా ముగ్గులు పోటీలు నిర్వహించి బహుమతు లను అందజేశారు. కోలాటం, సంప్రదాయ నృత్యాలతో ఆనందంగా గడిపారు. స్ఫూర్తి ఫౌండేషన్ (కాశీపురం)వారు సహకరించిన అందరికీ ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

# పెదబయలు పెట్రోల్ బంక్ లో విక్రయం లేక వాహన దార్లు ఇబ్బందులు



**పెదబయలు జనవరి మనసులో మాట:** పెదబయలు విక్రయం లేక వెలబోయిన పెట్రోల్ బంక్ మండల కేంద్రంలో ఐ టి డి ఎ అనుసంధానం తో ఏర్పాటుచేసిన హెచ్ పీ సి ఎల్ పెట్రోల్ బంక్ లో జి సి సి ఉద్యోగులు విధులకు డుమ్మా కొట్టడంతో గురువారం పెట్రోల్ బంక్ నిర్మాణయుషంగా కనిపించింది సంక్రాతి పండగ నేపథ్యంలో స్వంత ఇళ్లకు వెళుతున్న మైదానప్రంతా ఉద్యోగులు చుట్టాలు తమ వాహనాలతో కుటుంబసభ్యులతో బయలు దేరి ముందు స్థానిక పెట్రోల్ బంక్ లో వెళ్తే పెట్రోల్ సరఫరా చేసే గన్ బోయ్స్ లేక పెట్రోల్ పంపిణి జరగడం లేదు ఎంతసేపటికి గన్ బోయ్స్ బంక్ లో రాలేదు ఫోన్ చేసిన రెస్పాన్స్ లేదని వినియోగదారులు ఆందోళనతో దిగులు చెందుతూ వేను దిరిగారు ముందురోజులు క్యాన్ లతో బ్లాక్ లో అమ్మేసారని ఇప్పుడు బంక్ తెరవకుండా వెళ్లారని బయట షాపులో ప్రభుత్వం నిర్ణహించిన ధర కంటే అత్యధికంగా ధర చెల్లించి పెట్రోల్ కొనుగోలు చేసి ఇళ్లకు వెళ్లారు పెట్రోల్ బంక్ లో స్థానిక గన్ బోయ్స్ ఇంచార్జ్ నియమించి సంక్రాతి కి ఇళ్లకు వెళ్లాల్సిన స్థానిక జి సి సి అధికారులు విధులకు డుమ్మాకొట్టి వారి ఇళ్లకు పోయారు విధులకు నిర్లక్ష్యం వహించిన జి సి సి ఉద్యోగులకు ఉన్నత స్థాయి అధికారులు తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులకు డిమాండ్ చేస్తున్నారు.



### సంక్రాంతి పండుగ సందర్భంగా

# పేదలుకు దుప్పట్లు పంపిణీ

**ఎస్. రాయవరం, జనవరి 16,(మనసులో మాట):** ఎస్. రాయవరం మండలం గుర్రాజుపేట గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామంలోని నాలుగువందల మంది పేదలుకు ఉచితం గా దుప్పట్లు పంపిణీ చేసారు. గ్రామానికి చెందిన సీనియర్ టిడిపినాయుకుడు సాగిరామరాజు తన తల్లిదండ్రులు జ్ఞాపకార్ధం గ్రామంలోని పేదలందరికి ఏటా వస్త్రాలు పంపిణీచేస్తున్నారు. ఈ ఏడాది గ్రామంలోని పేదలకు దుప్పట్లు ను పంపిణీ చేసినట్లు రామరాజు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ కురందాసుశ్రీనివాసరావు, కోరారామారావు, దత్తుడు, శ్రీను, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# హోరాహోరీగా సాగిన సీనియర్ క్రికెటర్ లీగ్

### - విజయం సాధించిన శ్రీరామకృష్ణ టీం



**రోలుగుంట మనసులో మాట, జనవరి 16.** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం రోలుగుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మకర సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా 15, 16 తేదీల్లో నిర్వహించిన సీనియర్ క్రికెట్ పోటీలు గ్రామవాసుల్లో ఉత్సాహాన్ని రేకెత్తించాయి. నేతాజీ, వివేకానంద, వినాయక, రామకృష్ణ జట్ల మధ్య హోరాహోరీగా సాగిన మ్యాచ్లో రామకృష్ణ జట్టు మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.ఈ పోటీల్లో పాల్గొన్న యువకులు అద్భుతమైన ఆటను కనబరిచి, ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. గెలుపు సందర్భంగా వచ్చిన 15 వేల రూపాయల నగదు బహుమతిగా అందిన డబ్బును టీం సభ్యులు కొండపై ఉన్న శ్రీ శ్రీ జగ్గారాయుడు స్వామి గుడి అభివృద్ధికి కేటాయించారు. ఈ సేవాభావం గ్రామ ప్రజల్లో ప్రశంసలు అందుకుంది. టీం సభ్యులు మాట్లాడుతూ, “మా గెలుపు గ్రామ దేవాలయ అభివృద్ధికి దోహదపడాలని నిర్ణయించాం. సంక్రాంతి సంబరాలు మనల్ని ఐక్యత, సేవా భావంతో ముందుకు నడిపిస్తాయి“ అని తెలిపారు. ఈ ఉత్సవాల్లో గ్రామ పంచాయతీ అధ్యక్షుడు, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని పోటీలు తిలకించారు. ఈ సంఘటన గ్రామీణ యువతలో క్రీడలు, సేవా భావం కల్పించేందుకు మార్గదర్శకంగా మారింది. ప్రతి సంవత్సరం జరిగే ఈ ఉత్సవాలు రాబోయే తరాలకు మార్గదర్శకమని పలువురు ప్రసంశించారు.

# ఘనంగా జరిగిన సంక్రాంతి వేడుకలు



**దేవరాపల్లి, జనవరి 16, (మనసులో మాట) :** మండల వ్యాప్తంగా ప్రజలు సంక్రాంతి వేడుకలను సాంప్రదాయ బద్దంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతీ ఇంట భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. సంక్రాంతిని పురస్కరించుకొని మామిడిపల్లిలో స్థానిక సర్పంచ్ కర్రి సూరినాయుడు అధ్వర్యలో నిర్వహించిన ముగ్గులు పోటీలు, క్రికెట్, బైక్ స్లో పోటీలు ఉత్సహంగా భరితంగా జరిగాయి. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ సిఎం సీపీఆర్వో పూడి శ్రీహరి, విశాఖపట్నం సిఐ సిహెచ్. సింహాద్రినాయుడు, వైస్ ఎంపీపీ పంచాడ సింహాచలంనాయుడు, ఉప సర్పంచ్ చల్లా సుధాకర్ చేతులు మీదుగా నగదు బహుమతులను అందజేశారు. ఏ. కొత్తపల్లిలో స్థానిక కోదండ రామాలయం ఆవరణలో నిర్వహించిన ముగ్గులు పోటీలు ఆకట్టుకున్నాయి. విజేతలకు ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ చేతులు మీదుగా అందజేశారు. ఏ.కొత్తపల్లిలో స్థానిక కోదండ రామాలయం ఆవరణలో నిర్వహించిన ముగ్గులు పోటీలు ఆకట్టుకున్నాయి. కొత్తపెంటలో సైతం ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావు చేతులు మీదుగా అందజేశారు.

# పోయిన బంగారాన్ని తిరిగి అందజేసిన గొల్లవిల్లి స్వాతికి అభినందనలు




**మునగపాక, జనవరి 16, మనసులో మాట..** మండలంలో మంగళవారపు పేట గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో తీర్థ మహోత్సవంలో మునగపాక గ్రామానికి చెందిన ఆడారి భరద్వాజ్ తండ్రి దేవకి సుమారు నాలుగు తులాల బంగారం బ్రాస్లెట్ పోయినది, అదే గ్రామానికి చెందిన విశాఖ డైరీలో పీఎస్ గా పనిచేస్తున్న గొల్లవిల్లి సత్యనారాయణ కుమార్తె చిరంజీవి స్వాతి నీతి నిజాయితీగా నాలుగు తులాల బంగారు బ్రాస్లెట్లను స్టేజ్ దగ్గర ఉన్న నిర్వాకులకు అందజేసింది, అక్కడ ఉన్న స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ నిర్వహకులు, పెద్దలు బంగారం కంటే విలువైన నిజాయితీని నిరూపించిన స్వాతికి అభినందించారు.



## మక్కా దర్శనానికి వెళ్తున్న బాబర్ కు చిరు సత్కారం...

**అనకాపల్లి టౌన్ జనవరి 16మనసులో మాట..** మక్కా యాత్రకు వెళ్తున్న మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు, బాబర్ కు అనకాపల్లి మసీదు నుండి మస్తాన్ వల్లి, బాబ్ జానీ లకు జామియా మసీదులో చిరు సత్కారం చేశారు. ముస్లిం సోదరులకు అత్యంత పవిత్రమైన,మక్కా యాత్ర ఆ అల్లా అనుజ్ఞ యైతే కానీ దర్శించలేరు. ఈ మక్కా దర్శనం కోసం బాబర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత పవిత్రమైన ఇస్లామిక్ స్థలం ..సౌదీ అరేబియాలో నీ అల్... హరమ్ హజ్, ఉమ్రా తీర్థయాత్రలకు ఇది కేంద్రం అన్నారు. ఒకే సారి లక్షమంది ఆరాధకులు పట్టే అత్యంత పవిత్రమైన అతి పెద్ద మసీదు .కాబా,నల్లరాయి, జంజాం భావి, సప,మార్వా కొండలు కలిగిఉన్న ప్రదేశం ఆది అన్నారు. అంతటి పవిత్ర స్థలానికి ఉమ్రా యాత్ర ద్వారా మక్కా మదీనా షరీఫ్ ను దర్శించుటకు వెళ్ళే అవకాశం మాకు కల్పించిన ఆ అల్లా కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అనకాపల్లి జామియా మసీదు లో అధ్యక్షులు హుస్సేన్ ,కమిటీ సభ్యులు బాబర్ మస్తాన్ వలి బాబ్ జానీ లకు చిరు సత్కారం చేసి వారి యాత్ర విజయవంతం కావాలని అభినందనలు తెలిపారు .

## లింక్ క్లిక్ చేశారో ఇక అంతే..
### పెదబయలు ఎస్ఐ. టి. వెంకటేష్



**పెదబయలు జనవరి మనసులో మాట:** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెదబయలు ఎస్ఐ. టి. వెంకటేశ్ సూచించారు. వాట్సాప్ గ్రూపుల్లో చెక్కర్లు కొడుతున్న 'నాకు రూ.5వేలు వచ్చాయి. నేను నకిలీ అనుకున్నా.. మీరు ప్రయత్నించి చూడండి' అని వస్తున్న లింకులను క్లిక్ చేయవద్దని అన్నారు. సోషల్ మీడియా మాధ్యమాలలో వచ్చే ఎటువంటి లింకులను ఓపెన్ చేయవద్దని కోరారు. ఊరికే ఎవరూ డబ్బులు ఉచితంగా ఇవ్వరని, అత్యాశకు పోయి సైబర్ వలలో పడవద్దన్నారు.:

### వెంకటాపురం కేంద్రంగా
## సంక్రాంతి సంబరాల్లో జూదం



**రాంబిల్లి జనవరి 16 (మనస్సు లో మాట)..** సంక్రాంతి సంబరాలు పేరుతో రాంబిల్లి మండలం వెంకటాపురం గ్రామ పరిధిలో సంక్రాంతి సంబరాలు పేరున భారీ ఎత్తున జూదం గురువారం భోగి రోజున ప్రారంభమైన శుక్రవారం కనుమ పండుగ వరకు కోడి పందాలు పేకాట గుండాట కోసం భారీ మైదానంలో గుడారాల తో బరులు ఏర్పాటు లో కొనసాగాయి. భారీ లైటింగ్ మధ్య కొనసాగుతున్నాయి. లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. దూర ప్రాంతాల నుండి కార్లలో జూదగాళ్లు ఇక్కడకు చేరుకుంటున్నారు. కొందరు వినోదంగా భావించి తిలకించేందుకు తరలివస్తున్నారు రాంబిల్లి మండలంలో కని విని ఎరగని భారీ ఎత్తున జూదం జరగడం ఇదే మొదటిసారి అని స్థానికులు చెప్పుకుంటున్నారు. ఈ విషయమై రాంబిల్లి సీఐ నర్సింగరావును వివరణ కోరగా ప్రభుత్వం ఎలాంటి పర్మిషన్ ఇవ్వలేదన్నారు కోడిపందాలు గుండాట వంటి జూదం ఆడిన వారిపై కేసులు నమోదు చేశామన్నారు.

### ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలు పరిష్కరిస్తూ
# పోలీసు శాఖ ప్రతిష్టను పెంచాలి
### - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్




**విజయనగరం (మనసులోమాట) జనవరి 16..** జిల్లాలోని గుర్ల, గరివిడి, రాజాం మరియు రేగిడి ఆముదాలవలస పోలీసు స్టేషన్లను జిల్లా ఎస్పీ శ్రీ ఎ. ఆర్.దామోదర్, జనవరి 16న సందర్శించి, పోలీసు స్టేషను ప్రాంగణాలను పరిశీలించారు. అనంతరం అందుబాటులో ఉన్న పోలీసు అధికారులు మరియు సిబ్బందికి మిఠాయిలను జిల్లా ఎస్పీ స్వయంగా అందచేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ. ఆర్.దామోదర్ మాట్లాడుతూ – పండగ సందర్భంగా ప్రయాణాలు చేస్తున్న ప్రజలకు "రిటర్న్ జర్నీ సేఫ్ జర్నీ" పేరిట జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమం పట్ల తగు సూచనలు ఇచ్చి గమ్య స్థానాలకు క్షేమంగా చేరుకునే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు వాహనదారులకు భద్రత నియమాలు, హెల్మెట్ ధారణ పట్ల అవగాహన కల్పించాలన్నారు. పోలీసు స్టేషనుకు వచ్చే ఫిర్యాదుదారులు, బాధితుల సమస్యలను సామరస్య పూర్వకంగా అడిగి తెలుసుకోవాలన్నారు. సమస్య ప్రాధాన్యతను బట్టి వెంటనే చర్యలు చేపట్టాలని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళి, వారికి న్యాయం చేయాలన్నారు. స్మార్ట్ పోలీసింగుతో ప్రజలకు మెరుగైన సేవలందించాలని, అందుకు టెక్నాలజీని వినియోగించుకోవాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి నేరాలకు పాల్పడే వారిని, గంజాయి, మహిళలు పట్ల దాడులకు పాల్పడే వారిని, బాలలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని, చట్టపరంగా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఆదేశించారు. గంజాయి వినియోగించే స్థావరాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, గంజాయి వినియోగించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. మహిళలు, బాలల భద్రతకు పెద్ద పీట వెయ్యాలని, పాఠశాల స్థాయిలోనే విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల అవగాహన కల్పించాలని. ఎవరైనా వారి పట్ల అఘాయిత్యాలు చేసేందుకు ప్రయత్నిస్తే, వారు తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయుల దృష్టికి తీసుకొని వచ్చే విధంగా చూడాలన్నారు. ఇటీవల కాలంలో డిటిజిటల్ అరెస్టు పేరుతో సైబరు మోసగాళ్ళు అమాయకులను భయపెట్టి, బెదిరింపులకు పాల్పడుతూ, వారి వద్ద నుండి రబ్బులు కొల్లగొడుతున్నారని, అటువంటి నేరాలు జరగకుండా ప్రజల్లో డిజిటల్ అరెస్టు అన్నది పోలీసు వ్యవస్థలో లేనే లేదన్న విషయాన్ని తెలియజేసేందుకు క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజలతో మమేకయ్యేందుకు పల్లె నిద్ర కార్యక్రమాలు చేపట్టాలని, క్షేత్ర స్థాయిలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోలీసు స్టేషనులో పని చేసే పోలీసు సిబ్బందితో జిల్లా ఎస్పీ సుమేకమై, వారి సమస్యలను, విధుల నిర్వహణలోగల ఇబ్బందులను ఆడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఈ తనిఖీల్లో సంబందిత పోలీస్ స్టేషన్ సిఐలు, ఎస్ఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రథమ బహుమతి గెలుచుకున్న రేవళ్లు ఎడ్ల బండి



**నాతవరం, జనవరి 16, ( మనసులో మాట) :** నాతవరం మండలం దారగంగవరంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎడ్లబండి పోటీలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించు కుని నిర్వహించిన ఈ పోటీలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర, తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ, ఎస్ఐ వై.తారకేశ్వరరావు, జనసేన ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు ఊడి చక్రవర్తి, జిల్లా కార్యదర్శి సురేష్, పంచాడ హరినాథ్ ముఖ్య అతిథిలుగా హాజరై పోటీలను ప్రారంభించారు. జనసేన నాయకుడు ప్రగడ కృష్ణబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, యువకులు పాల్గొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమైన పోటీలు ఉత్కంఠభరితంగా కొనసాగాయి. ఎడ్లబండ్ల వేగం, రైతుల నైపుణ్యం ప్రేక్షకులను ఉత్సాహపరిచాయి. పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి పంచాడ వెంకటరావు (రేవళ్ల) రూ.12 వేలు, రెండవ బహుమతి మరిడిమాంబ రూ.10 వేలు, మూడవ బహుమతి పి రవి(ఎం కోటపాడు) రూ.8 వేలు, నాల్గో బహుమతి శ్రీ ఆంజనేయం (రేవళ్ల)రూ.6 వేలు, ఐదవ బహుమతి రాయపు రెడ్డి శ్రీను (చోడవరం)రూ.4 వేలు అందజేశారు. విజేతలను అతిథులు అభినందించారు. ఈ సందర్భంగా రాజాన వీర సూర్యచంద్ర మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో జనసేన పార్టీ ఇలాంటి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సంప్రదాయ కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### నాతవరం పోలీసుల ఘనకార్యం ఢిల్లీలో
# గంజాయి కేసు నిందితుడి అరెస్ట్
### నాలుగేళ్ల తర్వాత దొరికిన నిందితుడు



**అనకాపల్లి (నాతవరం), జనవరి 16( మనసులో మాట)** గంజాయి కేసుల్లో నిందితులు ఎక్కడ దాక్కున్నా చట్టం నుండి తప్పించుకోలేరని నాతవరం పోలీసులు నిరూపించారు. గత నాలుగేళ్లుగా పోలీసుల కళ్లు గప్పి తిరుగుతున్న ఒక కీలక నిందితుడిని నాతవరం పోలీసులు అత్యంత చాకచక్యంగా ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు. నాతవరం పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో నమోదైన క్రైమ్ నంబర్ 123/22 (చీణూాా ాాష్) కేసులో పశ్చిమ ఢిల్లీకి చెందిన రోహిత్ కుమార్ (39), తండ్రి ప్రీతమ్ సింగ్, ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. కేసు నమోదైనప్పటి నుండి ఇతను పరారీలో ఉన్నాడు. ఇతనిపై కోర్టు నాన్ బెయిల్ వారెంట్ కూడా జారీ చేసింది. జిల్లా పోలీస్ ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఐపీఎస్ వారి ఆదేశాల మేరకు, నాతవరం ఎస్సై వై.తారకేశ్వరరావు తన సిబ్బందితో కలిసి ప్రత్యేక నిఘా పెట్టారు. నిందితుడు ఢిల్లీలో ఉన్నట్లు పక్కా సమాచారం అందడంతో, అక్కడికి చేరుకున్న పోలీస్ బృందం నిందితుడిని చాకచక్యంగా పట్టుకుని, నాతవరం పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చి, ఈ రోజు రిమాండ్ కు తరలించారు. క్లిష్టమైన ఈ కేసులో నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్సై తారకేశ్వరరావు మరియు పి.సి టి.సన్యాసిరావు లకు జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ మరియు అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. గంజాయి రవాణాదారులపై ఉక్కుపాదం మోపుతామని ఈ సందర్భంగా ఎస్పీ గారు హెచ్చరించారు. గంజాయి కేసుల్లో నిందితులు ఎక్కడున్నా తప్పించుకునే అవకాశం లేదు. మరియు ఇతర మత్తు పదార్థాల రవాణా చేసేవారు, సేవించేవారు "తస్మత్ జాగ్రత్త" అని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

### విశాఖపట్నంలో ఘనంగా
## ముగిసిన రివైవల్ సమావేశాలు
### - డాక్టర్ రాజు ప్రకాష్ పాల్ దంపతులను సన్మానించిన టైటస్ గొర్లె




**దేవరాపల్లి, జనవరి 16, (మనసులో మాట) :** అంతర్జాతీయ దైవజనుడు డాక్టర్ రాజు ప్రకాష్ పాల్ జెస్సి పాల్ దంపతులను మండలంలోని కాశీపురం సీయోను ప్రార్ధన మందిరం దైవజనులు బిషప్ టైటస్ గొర్లె ఘనంగా సత్కరించారు.ద లార్డ్స్ చర్చి హైదరాబాద్ వారు నిర్వహించిన విశాఖపట్నం రివైవల్ మీటింగ్స్ గత మూడు రోజులు పాటు ఇందిరా ప్రియదర్శిని స్టేడియం విశాఖపట్నంలో ఘనంగా జరిగాయి. ప్రపంచ ప్రఖ్యాత ప్రసిద్ధిగాంచిన దైవజనులు ఇంటర్నేషనల్ యంగ్ డైనమిక్ స్పీకర్ ద లార్డ్ చర్చ్ వ్యవస్థాపకులు, అంతర్జాతీయ దైవజనులు ప్రపంచానికి దీవెనకరమైన పాత్ర డాక్టర్ జయపాల్ ( జయపాల్ ఫౌండేషన్ చెన్నై) కుమారుడు రెవరెండ్ డాక్టర్ రాజ్ ప్రకాష్ పాల్, జెస్సి పాల్ దంపతులు ఉజ్జీవకరమైన ఆశీర్వాదకరమైన రక్షణార్థమైన సందేశాలను ఈ మూడు రోజులు అందించారు. ఇటువంటి ఉన్నతమైన గొప్ప దైవజనులు మన ప్రాంతానికీ రావడం ఆశీర్వాదమని టైటాస్ అన్నారు. పాస్టర్స్ ,అనేక మంది లక్షలాది మంది క్రైస్తవులు, క్రైస్తవులు యవనస్తులు అనేకమంది వాక్యము చేత, ఆరాధన చేత బలపరచబడి దీవించబడ్డారు. ఇటువంటి వారిని సన్మానించడం మహాభాగ్యంగా భావిస్తున్నామన్నారు. అనేక మంది దైవజనులు కలిపి ఆయన్ని సత్కరించారు. మరి ముఖ్యంగా ఈ కార్యక్రమములో నిస్సి మినిస్ట్రీస్ డైరెక్టర్ రెవరెండ్ డాక్టర్ టైటస్ గొర్లె గ్రీటింగ్స్ తెలియజేస్తూ వారిని ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జాన్ మోజెస్ , పాస్టర్ యాంతోని రాజ్ పాస్టర్ అనిల్ , జార్జి బాబు,బిషప్ ఎల్ సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సంక్రాంతి పండుగ

**చీడికాడ, జనవరి 16, (మనసులో మాట)..** మండలంలో సంక్రాంతి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు మండలంలో ఖండివరం గ్రామంలో మోసూరి సింహాద్రి అప్పన్న యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు పిడత పోటీలు జరిగాయి ఈ పోటీలను ఎంపీటీసీ గెంజి స్వాతి బాలాజీ మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు షేక్ సూర్యనారాయణ మాజీ పీఏసీ ఎస్ అధ్యక్షులు మూసూరి సన్నిబాబు ప్రారంభించారు అలాగే బైల పూడి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా గుమ్మడి వారి సింహాద్రి అప్పన్న యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు పిడతలు బైక్ స్లో పోటీలు జరిగాయి ఈ ఫోటోలను గ్రామ ఉపసర్పంచ్ గుమ్మడి సంతోష్ జనసేన పార్టీ మండల అధ్యక్షులు జీవి మూర్తి ప్రారంభించారు గెలుపొందిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. గ్రామ పెద్దలు యువకులు మహిళలు పాల్గొన్నారు

## భక్తిశ్రద్ధలతో దేవత తల్లి తీర్థం
### భక్తులు ప్రత్యేక పూజలు, భక్తి గీతాలాపన



అనకాపల్లి రూరల్, జనవరి 16 (మనసులో మాట): గవరపాలెంలో పేరుందిన దేవత తల్లి తీర్థం వైభవంగా శుక్రవారం జరిగింది. ప్రతి ఏట కనుమ పండుగ నాడు పెద్ద నూతి వద్ద నిర్వహించడం సంప్రదాయగా వస్తుంది. ఈ సందర్భంగా కోలాట నృత్యం , తప్పేట గుళ్ళు, చిటికెల భజనలు, తాడిపెద్దు సేవా గరిడీలు, రంగుల రాట్నం వంటి అనేక సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. దేవత తల్లి ట్రస్ట్ సభ్యుల కృషిని భక్తులు అభినందించారు. అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించిన వారిలో వరుసగా మాజీ ఎమ్మెల్సీ, టిడిపి పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగ జగదీశ్వరరావు, బుద్ధ రమణజీ, భగవాన్, తాతునాయుడు, సీనియర్ జర్నలిస్ట్ బుద్ధ మోహన్, బుద్ధ జోగి నాయుడు, ధర్మ అప్పలనాయుడు, బుద్ధ శ్రీను, రామలింగ, పరమేశు, జగదీష్, రావు, నాయుడు, సన్యాసినాయుడు మహిళలు, భక్తులు, కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

## వైభవముగా శ్రీ బాల సన్యాసమ్మ తీర్థ మహోత్సవం



రాంబిల్లి జనవరి 16 (మనస్సులో మాట) మండలంలోని కట్టు బోలు శ్రీ బాల సన్యాసమ్మ పేరంటాలు వారి తీర్థ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. కట్టుబొళ్ళు పరిసర గ్రామాల్లోని భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, మాజీ ఎంపీ పప్పల చలపతిరావులు ఎంపీపీ గొట్టిముక్కల శిరీష శ్రీనుబాబు జడ్పిటిసి ధూళి నాగరాజు తదితరులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తీర్థ మహోత్సవానికి సందర్శకులు భారీగా రావడంతో ఆలయ ఆవరణము కిక్కిరిసింది.

## నాతవరంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు
### పోలీస్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు మరియు అవగాహన సదస్సు




**నాతవరం, జనవరి 16( మనసులో మాట)** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నాతవరం సబ్ ఇన్‌స్పెక్టర్ వై.తారకేశ్వరరావు గారి నేతృత్వంలో, గ్రామ పెద్దల సహకారంతో 'కమ్యూనిటీ పోలీసింగ్'లో భాగంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీలు మరియు అవగాహన కార్యక్రమాలు అత్యంత ఉత్సాహంగా, ప్రశాంతంగా ముగిశాయి. గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించేలా జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు వేడుకలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**క్రీడా మరియు రంగోలీ పోటీలు:** KSR యూత్ మరియు నాతవరం పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో యువతకు వివిధ క్రీడా పోటీలు, మహిళలకు రంగోలీ (ముగ్గుల) పోటీలు ఘనంగా నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎస్.ఐ తారకేశ్వరరావు గారు, గ్రామ పెద్దలు మరియు నిర్వాహకుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వేలాదిగా తరలివచ్చిన ప్రజల మధ్య ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పోలీసుల పర్యవేక్షణలో వేడుకలన్నీ అత్యంత శాంతియుత వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా ఎస్.ఐ తారకేశ్వరరావు గారు యువతను ఉద్దేశించి మాట్లాడుతూ రోడ్డు భద్రతపై కీలక సూచనలు చేశారు: "పండుగ ఉత్సాహంలో భద్రతను విస్మరించకూడదు. ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేసుకోవాలి. అతివేగం ప్రాణాంతకం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారానే ప్రమాదాలను నివారించగలం." పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలను పెంపొందించడం, యువతను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే ఈ 'కమ్యూనిటీ పోలీసింగ్' ముఖ్య ఉద్దేశమని ఎస్.ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఖూ= యూత్ సభ్యులు, జనసేన పార్టీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు స్థానిక యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
కోస్తాంధ్ర
తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా
గుంటూరు | ప్రకాశం | నెల్లూరు
శనివారం 17 జనవరి 2026




# చేతులు మారుతున్న వందల కోట్ల రూపాయలు!

- ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ
- పోలీసుల పాత్రపై విమర్శలు
- కోర్టులు, అధినాయకులూ వద్దంటారు..
- ఆ ఆదేశాలను బేఖాతరు చేస్తూ.. ప్రజాప్రతినిధుల సమక్షంలోనే కోడి పందాలు, గుండాటలు..

**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 16:** ఏటా మాదిరే..ఈ ఏడాదీ కోడి పందాలు, గుండాటలు, పేకాటలు..తదితర జూద క్రీడలు యధేచ్ఛగా సాగాయి. ఇంకా సాగుతూనే ఉన్నాయి. ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగలకు వారం పది రోజుల ముందు నుంచి..ఈ సంవత్సరం కోడి పందాలు జరుగుతాయా లేదా అనే మీమాంస 'సామాన్య' జనం మదిలో మెదులుతుంది. ఎందుకంటే.. ఒక వైపు కోర్టు చాలా స్ట్రాంగ్ గా "ఎట్టి పరిస్థితుల్లోనూ కోడి పందాలు, తదితర జూద క్రీడలు నిర్వహించడం చట్టరీత్యా నేరం..అలా ఎవరు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరిక చేస్తుంది. మరో వైపు పోలీసు ఉన్నతాధికారులు కూడా కోర్టు ఆదేశాలు ధిక్కరిస్తే చర్యలు తప్పవని పదేపదే హెచ్చరికలు జారీ చేస్తారు. గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తారు.

మరోవైపు ప్రజాప్రతినిధులపై గ్రామ స్థాయి నాయకులు వత్తిడి. కోడి పందాలకు అనుమతి ఇవ్వాలని కోరతారు. అగ్రనాయకులు వద్దంటారు. దిగువ స్థాయి నాయకులు ఎటువంటి ఆర్భాటాలు లేకుండా 'కామ్'గా నిర్వహించుకోండని గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తారు. మరోవైపు బరులకు ఇంత అని మామూళ్ళు వసూలు చేసి..ఆ మొత్తాన్ని అధికారులకు, ప్రజాప్రతినిధులకు స్థాయిని బట్టి పంచుకుంటూ..అందర్నీ ప్రసన్నం చేసుకుంటారు. అంతే..పండుగకు రెండు మూడు రోజుల ముందు నుంచి పొల్లాల్లో, విశాలమైన స్థలాల్లో, చెరకు తోటల్లో, మామిడి తోటల్లో.. బరులు సిద్ధమవుతాయి. ఇక్కడ మరో కండీషన్..కోళ్ళకు కత్తులు కట్టకూడదని. కత్తి కట్టకపోతే మజా ఏముంటుందని నిర్వాహకుల ప్రశ్న. సరె సరే..అదీ కామ్ గా చేయండి అని ప్రజాప్రతినిధుల సలహా. మొత్తంపై భోగి, సంక్రాంతి, కనుమ.. ఈ మూడు రోజులే కాదు. అటు తర్వాత మరో రెండు మూడు రోజుల పాటు..రకరకాల జాతులకు చెందిన కోడి పుంజులు పౌరుషంగా గాల్లో ఎగురుతాయి. రెండూ పోటాపోటీ తలపడతాయి. రక్తాన్ని చిమ్ముతాయి. చివరికి ఒక కోడి పుంజు తలపడే ఓపిక లేక..నేలపై జీవన్మరణ పోరాటం చేస్తుంటే..బరుల్లో అత్యంత ఉత్కంఠగా చూసే ప్రజల అరుపులు, కేకలతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోతుంది. గెలిచిన వారికి ఆనందం, ఓడిన వారి మొహంలో విషాదం.

**కోడి పందేల్లో రూ. కోటిన్నర గెలిచాడు..**

సంక్రాంతి సందర్భంగా రాష్ట్రంలో చాలా చోట్ల కోడి పందేలు భారీ ఏర్పాట్ల మధ్య జరుగుతున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఓ వ్యక్తి కోడి పందేల్లో రూ. కోటిన్నర గెలిచాడు. పీవీ రామయ్య బరిలో నిర్వహించిన కోళ్ల పందాలలో 'సేతువ' కోడిపై 'డేగ' కోడి నెగ్గడంతో డేగ కోడి యజమాని రూ.1.53 కోట్లు గెలుచుకున్నాడు. ఈ ఏడాది పశ్చిమ గోదావరి జిల్లాలో ఇదే భారీ పందెం అని స్థానికులు చెబుతున్నారు. ఈ కోడి పందాలతో పాటు అనేక జూద క్రీడలు కూడా బరుల వద్ద నిర్వహించారు. మద్యం ఏరులై పారుతోంది. తాగి తందనాలు. కొట్లాటలు.

**చేతులు మారిన కోట్లాది రూపాయలు..**

సంక్రాంతి మూడు రోజుల్లో వందల కోట్ల వ్యాపారం జరిగిందని ఒక అంచనా. భోగి, సంక్రాంతి, కనుమ ఈ మూడు పండుగలకూ కలిపి.. ఉమ్మడి పశ్చిమ గోదావరి వ్యాప్తంగా దాదాపు 500 కోట్ల రూపాయల వరకు బెట్టింగుల రూపంలో చేతులు మారినట్లు తెలుస్తోంది. కేవలం పందాలే కాకుండా, బరుల వద్ద ఏర్పాటు చేసిన గుండాట, కోత ముక్క వంటి ఇతర జూద క్రీడలు కూడా ఈ మొత్తాన్ని పెంచుతున్నాయి. చట్టపరంగా నిషేధం ఉన్నప్పటికీ, స్థానిక ప్రజాప్రతినిధులు స్వయంగా బరుల వద్ద ఉండి పందాలను ప్రోత్సహించడం చర్చనీయాంశమవుతోంది. ఇది ఒక రకమైన "అప్రకటిత అనుమతి"గా మారిపోయింది. పందాల నిర్వహణలో రాజకీయ పలుకుబడి ఉండటం వల్ల యంత్రాంగం కూడా వెనకడుగు వేస్తోంది.

**ఆకర్షణీయమైన బహుమతులు..**

పందెం గెలిచిన వారికే కాకుండా, నిర్వాహకులు ప్రేక్షకులను ఆకర్షించేందుకు మోటార్ సైకిళ్ళు, బంగారు నాణేలు వంటి బహుమతులు ప్రకటించడం ఈ ఏడాది ప్రత్యేకతగా కనిపిస్తోంది. ఒక్కో పందానికి కనిష్ఠంగా రూ.5 లక్షల నుండి 50 లక్షల వరకు పందెం కాస్తుండటం అక్కడి తీవ్రతను సూచిస్తోంది.

**పోలీసుల పాత్రపై విమర్శలు..**

పోలీసులు దాడులు చేసి కొందరిని అదుపులోకి తీసుకోవడం, నగదు సీజ్ చేయడం చేస్తున్నారు. కానీ వందల కోట్లు చేతులు మారే పెద్ద బరుల వద్ద కేవలం ట్రాఫిక్ క్రమబద్ధీకరణ లేదా నిఘా పెట్టడానికే పోలీసులు పరిమితమవుతున్నారు. రాజకీయ వత్తిళ్ల కారణంగా పెద్ద నిర్వాహకులపై చర్యలు తీసుకోవడం లేదనేది బహిరంగ రహస్యం. ఈ సంప్రదాయం పేరుతో జరుగుతున్న జూదం వల్ల ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉంది. చట్టపరంగా ఇవి నిషేధించబడినప్పటికీ, సంస్కృతి పేరుతో ఇవి కొనసాగుతున్నాయి. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం కోర్టు ఆదేశాలను సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోనంత వరకూ కోడి పందాల నిర్వహణను అరికట్టడం సాధ్యమయ్యే పనికాదు. పందాల కారణంగా వేల, లక్షల కోడి పుంజులు బలవుతున్నాయి. కోట్లాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

# నేడు రాష్ట్ర సీఎం, డిప్యూటీ సీఎంలు కాకినాడ కి రాక....

## ఏ ఎం గ్రీన్ ప్లాంట్ వద్ద ముమ్మర ఏర్పాట్లు - ఏర్పాట్లను పర్యవేక్షించిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు



**కాకినాడ (మనసులో మాట) జనవరి 16..** కాకినాడ రూరల్ నియోజకవర్గం లో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు కానున్న 'ఏ ఎం గ్రీన్ అమోనియా (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్' ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. సుమారు రూ. 13 వేల కోట్ల రూపాయలు పెట్టుబడితో నెలకొల్పుతున్న ఈ గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత గ్రీన్ అమోనియా పరిశ్రమ నిర్మాణ పనులను ప్రారంభించేందుకు నేడు (శనివారం, 17వ తేదీ) ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ప్లాంట్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను సీఎం పర్యటనల కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ అపూర్వ భరత్, మరియు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ లు కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నాయకులు అధికారులు ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్రోజెక్ట్ హెడ్ సీహెచ్. శ్రీనివాసరావు, కాకినాడ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస నాయుడు, శంకుస్థాపన కార్యక్రమ సమన్వయకర్త వి.నాగవర్ధన్ తదితరులతో మాట్లాడి ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం పర్యటన కావడంతో ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు అత్యంత పటిష్ఠంగా ఉండాలని ప్లాంట్ యాజమాన్యానికి మరియు సంబంధిత అధికారులకు సూచించారు.



# అమ్మ డైరీలో కొన్ని పేజీలు పుస్తకం అద్భుతం..

## రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు

**కాకినాడ (మనసులో మాట) జనవరి 16..** భావోద్వేగాలతో నిండిన రచనగా పాఠకుల హృదయాలను హత్తుకుంటున్న అమ్మ డైరీలో కొన్ని పేజీలు పుస్తకం ప్రతి ఒక్కరికి అమ్మ విలువను గుర్తు చేసే అపూర్వమైన గ్రంథమని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు అన్నారు.

ఈ సందర్భంగా రచయిత రవి మంత్రి తన రచన అమ్మ డైరీలో కొన్ని పేజీలు పుస్తకాన్ని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కి బహూకరించగా, ఇది ఎంతో ఆనందాన్ని, ఆత్మీయ అనుభూతిని కలిగించిందని తెలిపారు. శ్రీశ్రీ సాహిత్యంలో కనిపించే భావగంభీరత, హృదయస్పర్శ ఈ పుస్తకంలో స్పష్టంగా దర్శనమిస్తుందని ఆయన ప్రశంసించారు.

అత్యధికంగా అమ్ముడుపోయిన పుస్తకాలలో ఈ పుస్తకం ప్రత్యేక స్థానం సంపాదించుకోవడం విశేషమని, హిందీ, తమిళం సహా ఇతర భాషల్లోనూ అనువాదమై మరింత మంది పాఠకులను ఆకట్టుకుంటోందని పేర్కొన్నారు.

నేటి యువతకు ఈ పుస్తకం ఒక మార్గదర్శకంగా స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని, అమ్మ గొప్పతనాన్ని మరోసారి గుర్తు చేసే అమూల్యమైన సందేశాన్ని అందిస్తుందని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా రవి మంత్రిని సానా సతీష్ బాబు ఘనంగా సత్కరించారు.



# జనసంద్రంగా జగ్గన్నతోట ప్రభల తీర్థం

**అమలాపురం (మనసులో మాట) జనవరి 16 :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలిపల్లి శివారు జగ్గన్న తోటలో శుక్రవారం జరిగిన ప్రభల తీర్థం జనసంద్రంగా మారింది. జిల్లా నలువైపులనుండి వచ్చిన వందలాది భక్తులతో జగ్గన్న తోట కిక్కిరి పోయింది. జనసంద్రంగా మారింది. ఇతర దేశాలు రాష్ట్రాల్లో స్థిరపడిన కోనసీమ వాసులు అంతా సంక్రాంతి నేపథ్యంలో కోనసీమకు తరలిరావడం వీరంతా ప్రభల తీర్థానికి కుటుంబ సమేతంగా తరలివచ్చారు. మొసలపల్లి గ్రామం నుండి వచ్చిన ప్రభ స్థానిక కౌశిక్ కాలువ నుండి తోటలోకి ప్రవేశించే సందర్భంలో ప్రజలంతా ఆ ప్రవభను తిలకించడానికి ఎగబడ్డారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించడంతో స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఎంపీ గంటి హరీష్ బాలయోగి మంత్రి వాసంశెట్టి సుభాష్ రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బిజెపి రాష్ట్ర నాయకులు మాధవ్ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఎస్పీ రాహుల్ మీనాలు కుటుంబ సమేతంగా జగన్న తోటకు తరలివచ్చారు. ఈ ప్రభల తీర్థం ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ జగ్గన్న తోట ప్రభల ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా లు అధికారులను ఆదేశించారు. జగ్గన్న తోట ప్రభల ఉత్సవం కోనసీమ ప్రాంతంలో సుమారు 400 సంవత్స రాల చరిత్ర కలిగిన పవిత్ర తీర్థమని మకరసంక్రాంతి తర్వాత కనుమ రోజున ఏకాదశ రుద్రుల ప్రభల సమావేశంగా ప్రత్యేకత కలిగి ఉంది. 17వ శతాబ్దంలో కనుమ రోజున ఏకాదశ రుద్రులు లోక కళ్యాణార్థం జగ్గన్నతోటలో సమావేశమై, ప్రపంచ పరిస్థి తులపై చర్చించారని పురాణాలు చెబుతున్నాయి .అప్పటి నుంచి ప్రతి సంక్రాంతి కనుమ నాడు ఈ ప్రభల తీర్థం ఘనంగా నిర్వ హించుకోవడం ఆన వాయితీగా వస్తుంది. రాజా వత్సవాయి జగన్నా థ మహారాజు (జగ్గన్న) ఈ తీర్థానికి విచ్చేసి, ఘనంగా నిర్వహించ డానికి కృషిచేశారని, దీని ఫలితంగానే ఈ ప్రదేశం జగ్గన్నతోటగా ప్రసిద్ధి చెందిందని పూర్వీకులు చెబుతున్నారు. కోనసీమ చుట్టుపక్కల 11 శైవ క్షేత్రాలు ముక్కామల, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం మొదలైన ప్రభలు దేవుని పల్లకిలు మేళతాళాలతో ఊరేగి గోదావరి కౌశిక్ నది దాటి జగ్గన్నతోటకు చేరుకుంటాయన్నారు. మొసలపల్లి మధుమానంత భోగేశ్వరస్వామి ప్రభ ముందుగా చేరి మిగిలి నవాటికి ఆహ్వానం పలుకు తుందన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు కొబ్బ రితోటల మధ్య ఈ తీర్థం సందడిగా సాగింది లక్షలాది మంది భక్తులు సందర్శిం చారు. జన ప్రభంజనం జగ్గన్న తోట ప్రభల తీర్థం కొలువుదీరిన ఏకాదశ రుద్రులు జనంతో కిక్కిరిసిన కొబ్బరి తోటలు నిండిపోయాయి. ఉత్తరాయణ పుణ్యకాలం లో ఏకాదశ రుద్రుల సమాగమం ఐశ్వర్యాన్ని కలిగిస్తుందని స్థానికుల ప్రగాఢ నమ్మక మన్నారు.



# సామాన్యుడి గళం మనసులో మాట..

## ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్..

**పిఠాపురం మనసులో మాట జనవరి 16:** సామాన్య ప్రజల గొంతుకగా, వారి సమస్యలను వెలుగులోకి తెచ్చే వేదికగా 'మనసులో మాట' పత్రిక నిలవాలని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆకాంక్షించారు. శుక్రవారం కాకినాడలో 'మనసులో మాట' పత్రిక నూతన సంవత్సర (2026) కేలండర్‌ను ఆయన ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సమాజంలో సామాన్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో పత్రికలు కీలక పాత్ర పోషించాలన్నారు. 'మనసులో మాట' పత్రిక ప్రజల పక్షాన నిలబడి, వారి సమస్యల పరిష్కారానికి ఒక శక్తివంతమైన గళంలా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పత్రికా యాజమాన్యానికి సిబ్బందికి ఆయన ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పత్రిక ప్రతినిధులు, ప్రముఖులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆమరణ నిరాహారదీక్షలకు..

## వర్కింగ్ జర్నలిస్టుల జేఏసీ కఠిన నిర్ణయం

- రాజమహేంద్రవరం నగరంలో హాట్ టాపిక్
- అధికార యంత్రాంగం నిర్ణయం కోసం జేఏసీ నిరీక్షణ
- ప్రెస్ క్లబ్ సమస్యపై..తాడో పేడోకు.. తుది సమరం

**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 16:** ఒకటి కాదు రెండు కాదు..ఏకంగా ఏడేళ్ళ పాటు ప్రెస్ క్లబ్ కు ఎన్నికలు నిర్వహించకపోవటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రాజమండ్రి వర్కింగ్ జర్నలిస్టుల జేఏసీ తుది సమరానికి సన్నద్ధమవుతున్నట్టు సమాచారం. న్యాయం కోసం, తమ డిమాండ్ల సాధన నిమిత్తం ప్రెస్ క్లబ్ వద్ద రిలే దీక్షలు చేపట్టిన జేఏసీకి అన్ని వర్గాల నుంచి అనూహ్య రీతిలో స్పందన లభించింది. సీనియర్ జర్నలిస్టులు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, పలువురు న్యాయవాదులు, వివిధ వ్యాపార సంస్థలు, సామాజిక సేవా సంస్థలు..ఇలా పలువురు ప్రముఖులు దీక్షా శిబిరానికి వచ్చి తమ సంఘీభావం తెలిపారు. మూడు రోజుల రిలే దీక్షల తరువాత మండల మేజిస్ట్రేట్ సెక్షన్ 136 ప్రకటించటం, సంక్రాంతి పండుగలు కారణంగా, అధికారుల విజ్ఞప్తి మేరకు తాత్కాలికంగా రిలే దీక్షలను వాయిదా వేసిన జేఏసీ..మళ్ళా ఈ నెల 19 నుంచి ఆందోళనను కొనసాగించేందుకు జేఏసీ నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. 19 నుంచి రిలే దీక్షలు కొనసాగిస్తూ.. అప్పటికీ అధికార యంత్రాంగం తగిన రీతిలో స్పందించకుంటే..ఇక 'ఆమరణ దీక్ష'కు ఉపక్రమించాలని జేఏసీ భావిస్తోంది. ఇందుకు అధికారులకు వారం రోజుల ముందు అల్టిమేటమ్ జారీ చేసి..అప్పటికీ సానుకూలంగా స్పందించకుంటే ఇక తాడోపేడో తేల్చుకోవాలనే ఉద్దేశంతో వర్కింగ్ జర్నలిస్టుల జేఏసీ ఉద్యమం తీవ్రతరం చేసేందుకు కార్యాచరణతో ముందడుగు వేయాలని యోచిస్తోంది.

ఈ ఆమరణ నిరాహారదీక్ష కు తాము సిద్ధమంటే తాము సిద్ధమని పలువురు పాత్రికేయులు సమరోత్సాహంతో ముందుకు రావటంతో..ఇక చివరి అస్త్రంగా 'జేఏసీ' 'ఆమరణ' వదలనున్నట్టు తెలుస్తోంది. జేఏసీ డిమాండ్లలో ప్రధానంగా ప్రెస్ క్లబ్ కు బైలాలో పొందుపరిచిన విధంగా ఏటా ప్రెస్ క్లబ్ కు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని, ఈ ఏడేళ్ళలో జమాఖర్చుల వివరాలను, ఆడిట్ నివేదికలను బహిరంగ పరచాలని, అర్హులైన పాత్రికేయులు అందరికీ సభ్యత్వ పునరుద్ధరణతో పాటు, కొత్త సభ్యత్వాలను నమోదు చేయాలని జేఏసీ కోరుతోంది. ఎన్నికలు నిర్వహించే వరకూ ప్రెస్ క్లబ్ ను సీజ్ చేయడమో, లేక అధికారుల పర్యవేక్షణలో నిర్వహించడమో చేయాలని, ప్రెస్ క్లబ్ ఆధీనంలో ఉన్న నాలుగు దుకాణాలను సైతం వెంటనే అధికారులు స్వాధీనం చేసుకుని..వాటి నిర్వహణ విషయంలో కూడా అధికారుల సరైన నిర్ణయం తీసుకోవాలని జేఏసీ డిమాండు చేస్తోంది. ఇప్పటికే తమ డిమాండ్లను జిల్లా కలెక్టర్, ఎస్పీ, జేసీ, డీఆర్వో, ఆర్డీఓ, ఐ అండ్ పీఆర్వోలకు, స్థానిక ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నేతలకు, మంత్రి కందుల దుర్గేష్ కు జేఏసీ ప్రతినిధులు స్వయంగా కలుసుకొని వివరించారు. సమస్య తీవ్రతను తెలియజేశారు. ప్రెస్ క్లబ్ పేరుతో బినామీలు దందాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జర్నలిస్టులను వర్గాలుగా చీల్చి అక్రమాలకు, అక్రమార్జనకు తెర తీయటాన్ని జేఏసీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కొంతమంది కలిసి ఒక గ్రూప్ గా తయారై..బ్లాక్ మెయిలింగ్ కు పాల్పడుతున్నారని, ఇలాంటి జాబితాలు నగరంలో ఎవరికి వారు తయారు చేసుకుని "తామే అసలైన జర్నలిస్టులమని.. మా పేపర్లలోనే వార్తలు వస్తాయి..మేము రాస్తేనే వార్త.." అనే విధంగా బిల్డప్ ఇవ్వడాన్ని తాము పూర్తిగా ఖండిస్తున్నట్టు జేఏసీ ప్రతినిధులు చెబుతున్నారు. నాలుగైదు గ్రూపులుగా జాబితాలను తయారు చేసుకుని..పాత్రికేయ రంగాన్ని అస్తవ్యస్తం చేయటం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రశ్నించే జర్నలిస్టులను ప్రెస్ క్లబ్ సభ్యత్వాలను తొలగించినట్టు అర్హత లేని వ్యక్తులు ప్రకటించడాన్ని జేఏసీ నిరసిస్తోంది. అసలు క్లబ్ సభ్యత్వం తొలగించే అర్హత ఎవరికీ లేదనేది జేఏసీ వాదన.

మొత్తంపై పూర్తి స్థాయి ఆధారాలు, రికార్డులతో..జేఏసీ తమ అభిప్రాయాలను ఎక్కడైనా, ఎవరి వద్దనైనా సుస్పష్టంగా తెలియజేయడానికి సిద్ధమే అన్నట్టు పోరును ఉధృతం చేసేందుకు సమాయత్తమవుతోంది. ఆరు నూరైనా ప్రెస్ క్లబ్ ఎన్నికలు జరపాల్సిందే..అవసరమైతే ప్రాణత్యాగానికి కూడా సిద్ధమే అన్నట్టు 'ఆమరణ నిరాహార దీక్ష'కు కూడా వెనుకాడని జేఏసీ సాహసోపేత నిర్ణయం పట్ల అన్ని వర్గాల నుంచి.. ముఖ్యంగా నగరంలోని మెజారిటీ పాత్రికేయులు అభినందనలు అందుతున్నాయని జేఏసీ ప్రతినిధులు చెబుతున్నారు. ఉద్యమం ఉధృత రూపం దాల్చకముందే అధికారులు సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



## లింగంపర్తి పారిశుధ్య కార్మికులకు సన్మానం..

**ఏలేశ్వరం (మనసులో మాట) జనవరి 16..** ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామంలో విశ్వ హిందూ పరిషత్ ప్రచారకులు ఆధ్యాత్మిక ఉపన్యాసకులు ఆలమూరు సుబ్బారావు, ఉడతల రమణారావు ఊటుకూరు నానాజీ గార్ల ఆధ్వర్యంలో లింగంపర్తి పంచాయతీకి చెందిన పారిశుధ్య కార్మికులకు స్థానిక ఆంజనేయస్వామి గుడి వద్ద శుక్రవారం ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం వీధులను పరిపూర్ణంగా శుభ్రం చేసే పారిశుధ్య కార్మికులను వారి సేవలను గుర్తించి వారికి సన్మానం చేయాలనే ఆలోచన సంకల్పించి ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. పారిశుధ్య కార్మికులను ప్రభుత్వం వారి జీతభత్యాలను పెంచి ఆదుకోవాలని ఆయన కోరారు పారిశుధ్య కార్మికులు ఇప్పర్తి అప్పారావు సెలగల యేసు చొప్పల రాజు ఎప్పత్తిరత్నం ఉత్పత్తి మరి నెమ్మ కొట్టుమూరి లక్ష్మి మొదలగు వారికి సన్మానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో వల్లం రెడ్డి కొండయ్య పిల్ల రాంబాబు పాల్గొన్నారు.

## 5 వ ఆర్థిక సంఘ నిధులతో గ్రామీణ వైద్య సేవలు బలోపేతం




**కాకినాడ (మనసులో మాట) జనవరి 16..** ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పాటై చేస్తున్న సుపరిపాలనకు ప్రోత్సాహకంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలకు 15 వ ఆర్థిక సంఘం నిధులు చివరి విడతగా రూ. 567.40 కోట్లు విడుదల అయ్యాయని దీంతో వైద్య సేవలు బలోపేతం కానున్నాయని మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం రమణయ్యపేట లో జరిగిన ఒక కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 15 వ ఆర్థిక సంఘం ఏప్రిల్ 1, 2021 నుండి అమలులోకి వచ్చిందన్నారు. ఈ ఏడాది మార్చి 31 తో ఈ ఆర్థిక సంఘం చేసిన సిఫార్సులు ముగియనున్నాయన్నారు. తదుపరి ఏప్రిల్ ఒకటి నుండి 16వ ఆర్థిక సంఘం సిఫార్సులు అమలులోకి రానున్నాయని అన్నారు. ఆర్థిక సంఘ సిఫార్సులననుసరించి కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలకు వివిధ పథకాలకు నిధులు కేటాయిస్తుందన్నారు. విడతల వారీగా కేటాయించే నిధులను సకాలంలో నిర్మాణాలను వేగవంతం చేయడం తో బాటు వినియోగ పత్రాలను రాష్ట్రాలు కేంద్రానికి పంపితే మలి విడత నిధులు విడుదలవుతాయని అన్నారు. రాష్ట్రంలో అమలు చేసే కేంద్ర ప్రాయోజిత పలు పథకాలకు కేంద్రం కూడా నిధుల విడుదలలో ఒక్కొక్కసారి కోత విధిస్తుందన్నారు. ఎటువంటి కోత లేకుండా గ్రామాభివృద్ధి లక్ష్యంగా కేంద్రం మన రాష్ట్రానికి గణనీయంగా నిధులు కేటాయించడం హర్షనీయమని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పంచాయతీరాజ్ సంస్థలకు ఆర్థిక సంఘం నిధులు రూ. 2,099 కోట్లను కేటాయించగా ఆరోగ్య రంగానికి రూ .2600 కోట్లు కేటాయించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు వినియోగ పత్రాలను కేంద్రానికి పంపడంతో నిధులలో పూర్తి వాటాను సాధించిన మూడవ రాష్ట్రంగా మన ఆంధ్రప్రదేశ్ రికార్డ్ సాధించిందన్నారు. ఇప్పటివరకు తమిళనాడు, త్రిపుర మాత్రమే కేంద్రం నుండి ఈ మొత్తం నిధులు పొందాయన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు భవనాల నిర్మాణం, వ్యాధి నిర్ధారణ పరీక్షల మౌలిక సదుపాయాల కల్పన, బ్లాక్ లెవెల్ పబ్లిక్ హెల్త్ యూనిట్ల కోసం ఈ నిధులు వెచ్చిస్తారని అడబాల తెలిపారు.

# బరితెగించారు


**- రికార్డు స్థాయిలో కోడిపందాలు - ఒక్కరోజులో 1000 కోట్లు చేతులు మారాయి**
**- మూడు రోజుల్లో 5000 కోట్లు వ్యాపారం - కోనసీమలో అడుగడుగునా కోడిపందాలు రికార్డింగ్ డాన్సులు**







**అమలాపురం (మనసులో మాట) జనవరి 16..** ఈ ఏడాది కనీవిని ఎరగని రీతిలో కోడిపందాలు గుండాట, అశ్లీలనృత్యాలు నిర్వహించడానికి పందెం రాయుళ్లు బరితెగించారు. ఒక్కరోజులో 1000 కోట్లు కోడిపందాల్లో చేతులు మారాయంటే ఏ స్థాయిలో కోడిపందాలు, గుండాట జరిగాయో అర్థం అవుతుంది. గోదావరి జిల్లాలో ఈ ఏడాది కోడి పందెం రాయుళ్ళు మూడు రోజులపాటు సుమారు 5వేల కోట్ల రూపాయలు చేతులు మారినట్టు సమాచారం. కోడిపందాలను ఆకట్టుకోడానికి నిర్వాహకులు ఈసారి పందాల్లో గెలిచేవారికి ఖరీదైన బహుమతులు ఇచ్చి ఆకట్టుకున్నారు కార్లు, బుల్లెట్లు ఇలాంటి ఖరీదైన వస్తువులతో కోట్ల రూపాయల్లో వ్యాపారం జరిగింది. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో జరిగిన కోడిపందాల్లో గుడివాడ ప్రభాకర్ కు రాజమండ్రి రమేష్ ల మధ్య జరిగిన కోడిపందాల్లో రాజమండ్రి రమేష్ ఒక కోటి 53 లక్షల రూపాయలు పందెంలో గెలుచుకున్నారు. దీన్నిబట్టి కోడిపందాలు ఏ స్థాయిలో జరిగాయో అర్థమవుతుంది. కోడి పందాలు ఆడటానికి బడా బాబులు ముహూర్తం, సమయం, జాతకాలు లాంటివి చూసుకుని మరీ కోడిపందాలు బరుల్లో పందెం కాయడానికి సిద్ధమయ్యారు. ఈ కోడి పందాలను తిలకించడానికి సినీ హీరోలు గోదావరి జిల్లాలో పర్యటించి కోడిపందాలను ఆసక్తిగా తిలకించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా లో అడుగడుగునా కోడిపందాలు గుండాట ఆర్కెస్ట్రాలు నిర్వహకులు పట్టి యువతను ఆకట్టుకున్నారు. జిల్లావ్యాప్తంగా పండగ మూడు రోజులు పాటు కోడి పందాల్లో సుమారు 500 కోట్ల రూపాయలు చేతులు మారినట్టు సమాచారం. జిల్లాలో అమలాపురం, ముమ్మిడివరం, కొత్తపేట, రాజోలు నియోజవర్గాల్లో కోడిపందాలు బరులు వద్ద గుండాట పేకాట ఆర్కెస్ట్రాలతో యువతను ఆకట్టుకున్నారు. పగలు కోడిపందాలు వద్ద గుండాట ఆర్కెస్ట్రాల్ తో కోలాహాలంగా జను సమూహం తో నిండిపోగా రాత్రి సమయంలో గుండాట అశ్లీల నృత్యాలతో బరుల వద్ద యువత రెచ్చిపోయి గుండాటల్లో నిమగ్నమైపోయారు. దేశ విదేశాల్లో స్థిరపడిన కోనసీమ వాసులు ఈ ఏడాది పల్లెలకు తరలివచ్చారు. కోనసీమ వ్యాప్తంగా ఎక్కడ చూసినా పల్లెల్లో కోడిపందాల సందడి నెలకొంది. జనసమూహంతో నిండిపోయింది. గత 30 ఏళ్ళలో ఈ రీతిలో కోడిపందాలు,గుండాట,అశ్లీల నృత్యాలు జరగలేదని పలువురు బాహాటంగా చర్చించుకుంటున్నారు. ఇది ఇలా ఉండగా కోనసీమ జిల్లాలో బరులు నిర్వాహకులనుండి పోలీస్ స్టేషన్లు కు భారీగా ముడుపులు అందినట్టు విశ్వసనీయ సమాచారం.



# రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన



- ▸▸ భోగి, సంక్రాంతి, కనుమ పండుగ మూడు రోజులూ..
- ▸▸ ట్రాఫిక్ జంక్షన్ల వద్ద ప్రత్యేక డ్రైవ్
- ▸▸ కారు, ఆటో, ద్విచక్ర వాహనదారులకు సూచనలు
- ▸▸ హెల్మెట్, సీట్‌బెల్ట్ ధారణలో నిర్లక్ష్యం ప్రాణాలకే ప్రమాదం
- ▸▸ జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 16:** 'జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం- 2026' (నేషనల్ రోడ్డు సేఫ్టీ మంత్-ఎన్ఎస్ఆర్ఎం) కార్యక్రమాల్లో భాగంగా, భోగి, సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా మూడు రోజుల పాటు రాజమహేంద్రవరం నగరంలో విస్తృత స్థాయిలో రహదారి భద్రత అవగాహనా కార్యక్రమాలు నిర్వహించినట్లు జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్ తెలిపారు. పండుగల వేళ కుటుంబ సభ్యులతో కలిసి ప్రజలు పెద్ద ఎత్తున బయటకు రావడంతో రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. బుధ, గురు, శుక్రవారాలలో నగరంలోని మోరంపూడి, బొమ్మూరు, కంబాల చెరువు తదితర ప్రాంతాల్లోని ట్రాఫిక్ జంక్షన్లను రవాణా శాఖ అధికారులు సందర్శించి, ప్రజలకు నేరుగా అవగాహన కల్పించారన్నారు. ఎన్ఎస్ఆర్ఎం -2026లో భాగంగా బొమ్మూరు ట్రాఫిక్ జంక్షన్ వద్ద ఆటో రిక్షా వాహనదారులకు ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించగా, అధిక సంఖ్యలో ప్రయాణికులను తరలించడం నిషేధమని స్పష్టం చేశారు. అలాగే ఆటో రిక్షా వాహనాలకు సంబంధించిన పర్మిట్, ఫిట్నెస్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ వంటి పత్రాలు తప్పని సరిగా చెల్లుబాటులో ఉండాలని సూచించారు. రోడ్డు భద్రత ప్రాముఖ్యత, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అవసరంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా బైక్ నడపడం, సీట్‌బెల్ట్ ధరించకపోవడం వంటి చిన్న నిర్లక్ష్యాలు పండుగ ఆనందాన్ని క్షణాల్లో దూరం చేసి, జీవితాంతం మిగిలిపోయే చేదు అనుభవంగా మారుతాయన్నారు. మీ భద్రత మీ చేతుల్లోనే ఉందని, మీ కోసం, మీ కుటుంబ సంక్షేమం కోసం రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలి అన్నారు.
శిరస్త్రాణం, సీట్‌బెల్ట్ ధారణ తప్పనిసరి అని ఆయన మరోసారి గుర్తు చేశారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు సీహెచ్ సంపత్ కుమార్, ఎం రవి కుమార్, జీ రామ్ నారాయణ, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు బీ ఉమా మహేశ్వర రావు, జీ ప్రణీత్ కుమార్, పీవీవీ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఏసి అంబులెన్స్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు..





**ఐ.పోలవరం,( మనసులో మాట) డిసెంబర్ 16.** కేశనకుర్రుపాలెం సేవా సమితి ద్వారా చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. ఐ. పోలవరం మండలం కేశనకుర్రు గ్రామంలో క్షత్రియ కళ్యాణ మండపం వద్ద కేశనకుర్రు పాలెం సేవా సమితి స్థాపకులు పొత్తూరి నారాయణరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ముఖ్య అతిథిగా హాజరై అంబులెన్స్ సేవలను, కైలాస రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల కాలం నుండి గ్రామంలో అంబులెన్స్ సేవలు అందిస్తున్నారని, ఇప్పటివరకు కేశనకుర్రు సేవా సమితి ద్వార సమాజానికి ఉపయోగపడే గొప్ప కార్యక్రమాలు ఎన్నో నిర్వహిస్తోందని కొనియాడారు. అనంతరం నూతనంగా ఏర్పాటుచేసిన ఏసి అంబులెన్స్, కైలాస రథాన్ని ప్రారంభించారు. గ్రామంలో ఎవరికైనా ఆపద కలిగితే ఆపత్కాలంలో ఆపద్బాంధవుడులా ఈ సేవలు పని చేస్తున్నాయని రాబోయే కాలంలోనూ సమాజ హిత కార్యక్రమాలు మరెన్నో ఈ సేవా సమితి ద్వారా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు భీరా సత్యకుమారి, కడియం తమ్మయ్య తిల్లకుప్ప సొసైటీ అధ్యక్షుడు కడియం వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు చిలువూరి సుబ్బరాజు, ఇందుకూరి శ్రీను రాజు, విజిల్ రాజు, కార్యకర్తలు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతి రాజు కార్యకర్తలు,కేశనకుర్రు సేవా సమితి కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## పది పందాలు గెలిచి బుల్లెట్టు ను కొట్టేసాడు

**అమలాపురం(మనసులో మాట) జనవరి 16:** సంక్రాంతి పండుగ నేపథ్యంలో అమలాపురం ఎత్తు రోడ్డు సత్తెమ్మ తల్లి చెట్టు వద్ద జెట్టి కోడి పందాలు నిర్వహించారు. ఈ కోడి పందాల్లో ముమ్మిడివరం మండలం అనాతవరం గ్రామానికి చెందిన వలవల కిరిటి నిర్వాహకులు నుంచి బుల్లెట్ గెలుచుకున్నారు. రోజుకు అయిదు కోడి పుంజలతో 5 లక్షల వంతున మూడు రోజులు పాటు ప్రత్యర్థిని ఢీకొన్న కిరీటి 10 పుంజుల తో పాటు పది లక్షలు గెలుపొందాడు .దీంతో నిర్వహాకులు శుక్రవారం రూ.10 లక్షలు నగదు బుల్లెట్ బండిని అందజేసారు.

## అమలాపురం రోడ్ల పై అమెరికా టెస్లా కారు

**- చూడటానికి ఎగబడ్డ కోనసీమ వాసులు**



**అమలాపురం(మనసులో మాట) జనవరి 16..** కోనసీమలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఒక పారిశ్రామికవేత్త అమలాపురానికి కోట్ల రూపాయల విలువ గల టెస్లా కారు తీసుకురావడంతో అమలాపురం వాసులు చూడడానికి ఎగబడ్డారు. ఈ కారు అధికారికంగా ఇండియాలో ఇంకా విడుదల కాలేదు. దీనిని విదేశాల నుండి దిగుమతి (×ఎజూశీఔ) చేసుకుంటే, 100% ఇంపోర్ట్ డ్యూటీ (పన్నులు) కలుపుకుని దీని ధర దాదాపు రూ. 2 కోట్లు వరకు ఉంటుంది. ఈ కారు చెన్నైకి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఆదిత్య రామ్ సంక్రాంతి పండుగ కోసం ఆయన ఈ కారులో గురువారం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముఖ్య కేంద్రమైన అమలాపురానికి వచ్చారు. దీని బాడీ చాలా దృఢమైన స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారు చేయబడింది, ఇది బుల్లెట్ ప్రూఫ్ తో కూడిన కారు. అమలాపురం రోడ్ల పై ఇంత ఖరీదు కారు రావడానికి వ్యాపారవేత్త ఆదిత్య రామ్ ఈ ప్రాంత వాసి కావడంతో కారును చూసేందుకు ప్రజలు ఎగబడ్డారు.

## ఎమ్మెల్యే నల్లమిల్లిని సత్కరించిన జన్మభూమి ఎక్స్ ప్రెస్ ప్రయాణీకుల బృందం



**అనపర్తి (మనసులో మాట) జనవరి 16:** అనపర్తి, మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల నుండి పలువురు వ్యాపారులు, నేడు రామవరం వచ్చి ఎమ్మెల్యే నల్లమిల్లికి రామకృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలియజేసారు. 2024 ఎన్నికల ముందు అనపర్తికి జన్మభూమి సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్ హాల్టు కావాలని ఎమ్మెల్యేని నల్లమిల్లిని కలసి విజ్ఞప్తి చేసిన ఇదే బృందం, నేడు తమ కల సాకారం కావడంతో ఎమ్మెల్యే నల్లమిల్లిని కొని యాడారు. ఎమ్మెల్యేని సత్కరించిన బృందంలో అనపర్తి, బిక్కవోలు, రాయవరం, పెదపూడి, మండపేట తదితర మండలాలకు చెందిన వ్యాపారులున్నారు.

## సిక్కిం డిజిపి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



**అమలాపురం (మనసులో మాట) జనవరి 16 :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ జనుపల్లి గ్రామానికి చెందిన నవుండ్రు శ్రీ ధరరావు సిక్కిం రాష్ట్ర డిజిపిగా పనిచేస్తున్నారు.సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఆయన స్వగ్రామం జనుపల్లి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు శుక్రవారం స్థానిక నాయకులు పుష్పగుచ్చాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మడికి శ్రీరాములు ఆధ్వర్యంలో, సిక్కిం రాష్ట్ర విజిలెన్స్, అవినీతి నిరోధక డైరెక్టర్ జనరల్ గా పనిచేస్తున్న శ్రీ ధరరావును కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మడికి శ్రీరాములు మాట్లాడుతూ... శ్రీధర్ రావు గతంలో ఢిల్లీ డీజీపీగా పని చేశాడని, అలాగే అతను చేసిన విశిష్ట సేవలకు గాను 2024 సంవత్సరంలో రాష్ట్రపతి పోలీస్ పతకంతో సత్కరించారని తెలిపారు. డిజిపి శ్రీధర్ రావు కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఏఐసిసి మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, సబ్ రిజిస్ట్రార్ రాయి రాంబాబు, అసోసియేషన్ డివిజనల్ అధ్యక్షులు మడికి సత్యనారాయణ, సభ్యులు కొరుకూరి కృపావరం, సవరపు సుదర్శనరావు, సీలి శాంసన్, నవుండ్రు శ్రీనులు ఉన్నారు.



## సంక్రాంతి అల్లుడికి 160 రకాలతో పసందైన విందు

**తాళ్ళరేవు (మనసులో మాట), జనవరి 16:** మండల పరిధిలోని పి.మల్లవరం గ్రామానికి చెందిన పాలూరి భీమేశ్వరరావు, తిరుమల తనూజ దంపతులు తమ కొత్త అల్లుడికి 160 రకాల విభిన్నమైన వంటలతో పసందైన సంక్రాంతి విందును వడ్డించి అదరహో అనిపించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా తొలి పండుగకు వచ్చిన కొత్తల్లుడు ఆకుల రామకృష్ణకు వివిధ రకాల స్వీట్స్, హాట్స్, శీతల పానీయాలు అనేక రకాలైన వంటలతో ఆహార పదార్థాలను వడ్డించారు. కొత్త దంపతులు రామక్రిష్ణ, సత్య మాధురి లు ఒకరికొకరు ఆప్యాయంగా తినిపించుకున్నారు.

## నేషనల్ మీన్స్‌కంమెరిట్ స్కాలర్షిప్ పరీక్ష

**ఈ నెల 20..సర్టిఫికెట్ల ధృవీకరణకు గడువు**

**-డీఈఓ కే వాసుదేవ రావు**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 16:** డిసెంబరు 7న నిర్వహించిన నేషనల్ మీన్స్‌కంమెరిట్ స్కాలర్షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు హాజరైన విద్యార్థులు తమ కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, 7వ తరగతి మార్కుల శాతం సర్టిఫికెట్లను తప్పని సరిగా 20-01-2026 లోపు సిద్ధం చేసుకోవాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కే వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. సదరు సర్టిఫికెట్ల ధృవీకరణకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో పత్రికా ప్రకటన రూపంలోనూ, అలాగే పాఠశాల విద్యా శాఖ అధికారిక వెబ్‌సైట్ www.bse.ap.gov.in లో విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు.

కావున విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తాజా సమాచారాన్ని తెలుసుకోవాలని కోరారు. ఈ పరీక్ష ఫలితాల ప్రక్రియలో భాగంగా, విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన నిమిత్తం జాబితాను పాఠశాల విద్యా సంచాలకుల ద్వారా సంబంధిత జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కార్యాలయానికి త్వరలో పంపడం జరుగుతుందని తెలిపారు. ఆ సమయంలో అధికారులు కోరిన వెంటనే హాల్ టికెట్ జిరాక్స్ కాపీతో సహా అన్ని అవసరమైన సర్టిఫికెట్లను జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించవలసి ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి సూచించిన గడువు తేదీలోపు సర్టిఫికెట్ల నకళ్లను సమర్పించని విద్యార్థుల వివరాలు తుది జాబితా నుంచి తొలగించబడతాయని, దీనికి తల్లిదండ్రులే పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందని తెలిపారు. ఎస్సీ విద్యార్థులు తప్పని సరిగా గ్రూప్1 లేదా గ్రూప్2 లేదా గ్రూప్3కు సంబంధించిన కుల ధృవీకరణ పత్రం కలిగి ఉండాలని తెలిపారు. ఈ పరీక్షను జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించ బడుతుందని, స్కాలర్ షిప్ పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు ఒఒఒ.ంఎష్ట్రశీశ్రీఖితీంష్ట్రఱజూం.స్త్రశీజ.ఱఅ (జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్) లేదా ఒఒఒ.ఎంవ.ఖజూ.స్త్రశీజ.ఱఅ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్) లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తుది జాబితా విడుదలైన అనంతరం ఎటువంటి అభ్యర్థనలు, వినతులు, కోర్టు వ్యాజ్యాలు లేదా లోకాయుక్త ఫిర్యాదులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబడవని స్పష్టం చేశారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి, గడువు తేదీకి ముందుగానే అవసరమైన అన్ని సర్టిఫికెట్లను సిద్ధం చేసుకుని, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కార్యాలయానికి అందజేయాలని ఆయన కోరారు. ఈ విషయాన్ని డీఈఓ కే వాసుదేవరావు తెలిపారు.

## కోటిపల్లి – ముక్తేశ్వరం రోడ్డు

# బ్రిడ్జి సాధనే లక్ష్యం

**రాష్ట్ర, రామచంద్రపురం ప్రజల రుణం తీర్చుకుంటా - కోనసీమ సంక్రాంతి ఉత్సవ్ ముగింపు సభలో మంత్రి సుభాష్**





**రామచంద్రపురం(మనసులో మాట) జనవరి 16..** రాష్ట్ర ప్రజలకు సేవ చేసుకునే అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు నాయుడుకి జీవితాంతం రుణపడి ఉంటానని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజల కోరిక కోటిపల్లి - ముక్తేశ్వరం రోడ్డు బ్రిడ్జి నిర్మాణ లక్ష్యమే ధ్యేయంగా పనిచేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ సారథ్యంలో స్థానిక వి ఎస్ ఎం కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న కోనసీమ సంక్రాంతి ఉత్సవ్-2026 మూడవ రోజు ముగింపు కార్యక్రమం ఉల్లాసంగా ఉత్సాహంగా యువత కేరింతల మధ్య ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజవర్గ ప్రజలంతా నా కుటుంబంగా భావించి వారి ఆనందం కోసం సంక్రాంతి ఉత్సవాలు అద్భుతంగా నిర్వహించామన్నారు. కనుమరుగవుతున్న మన సంస్కృతి, సంప్రదాయాలు నేటి తరానికి అందించడం మనందరి కర్తవ్యం అన్నారు. నిజ జీవితంలో నేను నాలానే ఉంటా.. ఎవరికోసమో మారను... మరిన్ని సమన్వయం చేసుకొని సీఎం చంద్రబాబు బాటలో నడుస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి కుటుంబ సభ్యుడిగా సేవలు అందిస్తానన్నారు. నిరుద్యోగ నిర్మూలన, మహిళా సాధికారత, నియోజవర్గాన్ని సువర్ణ రామచంద్రపురంగా తీర్చిదిద్దడమే నా ప్రధాన కర్తవ్యం అన్నారు. రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లు తనకు ఆదర్శమని మంత్రి వ్యాఖ్యానించారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ సత్యం మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు, ప్రజలు ఆనందం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించా మన్నారు. ప్రతి ఏడాది ఇంతకుమించి సేవా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.

**మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యంకు జబర్దస్త్ టీం ప్రశంసలు**

జబర్దస్త్ ఫేమ్, సినీ నటులు హైపర్ ఆది, రైజింగ్ రాజు లు మాట్లాడుతూ ప్రజల ఆనందం కోసం భారీ స్థాయిలో సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తర్వాత ఆ స్థాయిలో సేవా కార్యక్రమాలు చేస్తున్న ఘనత మంత్రి సుభాష్ కే దక్కుతుందని ప్రశంసించారు. నియోజకవర్గ ప్రజల కోసం భారీ ఏర్పాట్లు చేసిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యంను జబర్దస్త్ టీం ప్రత్యేకంగా అభినందించారు.

**హాస్యపు జల్లులు కురిపించిన హైపర్ ఆది టీమ్ అదిరేటి స్టెప్పులతో మురిపించిన డాన్స్ మాస్టర్ అభి టీమ్**

కోనసీమ సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. ముఖ్యంగా జబర్దస్త్ హైపర్ ఆది టీమ్ రైజింగ్ రాజు, దొరబాబు, శాంతి స్వరూప్ లు పండించిన హాస్యం రక్తి కట్టించాయి. డాన్స్ మాస్టర్ అభి, భూమిక, శంకర్ లు అదిరేటి స్టెప్పులతో అలరించారు. యువతి, యువకులు కేరింతలు కొడుతూ సందడి చేశారు.

**పోటిల్లో విజేతలకు బహుమతులుగా ఐఫోన్, కెమెరా, మ్యూజిక్ సిస్టం లు**

జూనియర్, సబ్ జూనియర్, సీనియర్స్ విభాగాల్లో జరిగిన నృత్య పోటీల్లో యువత పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా ఐఫోన్, కెమెరా, సౌండ్ సిస్టం లు మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు అందించి ప్రోత్సహించారు. సంక్రాంతి ఉత్సవాల్లో మంత్రి సుభాష్, ఆయన తండ్రి వాసంశెట్టి సత్యం లు ప్రే క్షకులతో మమేకమై ఉత్సాహ పరుస్తూ చేసిన నృత్యాలు వీక్షకుల మనసులు దోచాయి. ఆధ్యాంతం కోనసీమ ఉత్సవ్ అంబరాన్ని తాకాయి. మూడు రోజులపాటు నియోజవర్గ ప్రజల ఆనందం కోసం చేసిన ఏర్పాట్లు పట్ల అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రామచంద్రపురం చరిత్రలో కనీ విని ఎరుగని రీతిలో వేలాదిమంది ఈ సంబరాలకు హాజరవ్వటం విశేషం.

## జనసంద్రంగా మారిన కొత్తపేట తీర్థం మహోత్సవం

**– వందలాదిగా తరలివచ్చిన జన సమూహం**



**అమలాపురం (మనసులో మాట) జనవరి 16..** సంక్రాంతి పండుగ నేపథ్యంలో భోగి తర్వాత వచ్చే కనుమ రోజున కొత్తపేటలో జరిగే ప్రభల తీర్థం లో నిర్వహించే పాణాసంచా కాల్పులకు ప్రత్యేక మైన పేరుప్రఖ్యాతులు ఉన్నాయి. తరతరాలుగా వస్తున్న ఈ ఆచారం కనుమ రోజు జరిగే ఈ ఉత్సవాలను చూడడానికి వందలాదిగా భక్తులు యువత తరలివస్తుంటారు. కొత్తపేట ప్రభుత్వ కళాశాల ఆవరణలో గురువారం జరిగిన తీర్థ మహోత్సవానికి వందలాదిగా భక్తుల తరలివచ్చారు. ఇక్కడ జరిగే ఉత్సవానికి ఒక ప్రత్యేకత ఉంది రాష్ట్రంలో ఎక్కడా కూడా జరగని బాణాసంచా కాల్పులు ఇక్కడ జరిగితాయి. కొత్తపేటలో ప్రధానంగా మూడు వీధుల్లో పోటీపడి బాణాసంచా కాల్పులు జరుపుతారు. సాయంత్రం 6 గంటల నుండి8 వరకూ,అలాగే రాత్రి 9 గంటలకు 11వరకూ మరొకటి అర్ధరాత్రి 1 గంటకు బాణాసంచా కాల్పులు చూడడానికి తండోపతండాలుగా యువత కొత్తపేట వస్తారు. సుమారుగా కోటి నుండి 2 కోట్ల రూపాయల వరకు ఈ బాణాసంచా కాల్పులకు ఖర్చు పెడతారు. ఒక తారా జువ్వలో రెండు బ్రతికి ఉన్న పావురాలను పెట్టి దాన్ని అంటించినప్పుడు తారాజువ్వ పైకి వెళ్ళి పేలగా జువ్వ నుండి రెండు పావురాలు బయటికి వెళ్లిపోవడం సూపర్ల ను ఆశ్చర్యానికి గురిచేస్తాయి. ఇటువంటి విచిత్రమైన సన్నివేశాలతో ఆకాశం దద్దరిల్లిపోయే మందు గుళ్ళు సమానం కనులకు పిరమిడ్లు కలిగించే విధంగా రకరకాల రంగుల వెలుతురులో ఆకాశం మెరిసిపోతుంది. ఇటువంటి సుందరమైన దృశ్యాలను చూడడానికి యువత ఎగబడతారు.

## అంతర్జాతీయ స్థాయిలో మెరిసిన దర్శకుడు ఎం.వి.సతీష్ కుమార్



**పిఠాపురం,మనసులో మాట జనవరి 16 :** పిఠాపురం మండలం, విరవాడ గ్రామానికి చెందిన దర్శకుడు ఎం.వి.సతీష్ కుమార్ మరోసారి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఉజ్జయినిలో నిర్వహించిన 7వ అంతర్జాతీయ సంస్కృత లఘు చలనచిత్రోత్సవం2026లో ఆయన దర్శకత్వంలో రూపొందిన సంస్కృత షార్ట్ ఫిల్మ్ అస్తేయంకు ద్వితీయ స్థానం లభించింది. ఉజ్జయినిలోని విక్రమాదిత్య భవన్‌లో జరిగిన ఈ ఉత్సవాన్ని సంస్కృత భారతి నిర్వహించింది. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అస్సాం, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలతో పాటు అమెరికా నుంచి కూడా పాల్గొనడం విశేషం. మొత్తం 90 ఎంట్రీలు రాగా, అందులో 20 రీల్స్ విభాగంకు చెందినవి. వివిధ విభాగాల్లో 30 బహుమతులు ప్రదానం చేశారు. సంపూర్ణంగా సంస్కృత భాషలో రూపొందిన "అస్తేయం" చిత్రం కథా ప్రవాహం, భావవ్యక్తీకరణ, సంస్కృత భాషను సులభంగా ప్రజలకు చేరువ చేసే విధానంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. అంతర్జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం ద్వారా ఈ చిత్రం మాత్రమే కాకుండా, దర్శకుడి స్వగ్రామం విరవాడ పేరు కూడా జాతీయ స్థాయిలో వినిపించింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యుడు బాలయోగి ఉమేశ్‌నాథ్ మహారాజ్ మాట్లాడుతూ భారతీయ భాషలు, సంస్కృతి పరిరక్షణకు ఇలాంటి ఉత్సవాలు అవసరమని, ముఖ్యంగా సంస్కృతాన్ని కొత్త తరానికి చేరవేయడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నటి ఐశ్వర్య శర్మ మాట్లాడుతూ సంస్కృతం క్లిష్టమైన భాష అన్న అపోహ తప్పని, సరైన విధానంలో అందిస్తే ఎవరైనా నేర్చుకుని ఆస్వాదించగలరని వ్యాఖ్యానించారు. ఈ చిత్రంలో నటించిన కె. లలితకు ఉత్తమ నటి అవార్డు లభించడం మరో విశేషం. చిత్రాన్ని ఏకదంత నిర్మాణ సంస్థ నిర్మించగా, నిర్మాతగా మేడూరి విష్ణు వర్ధన్ రెడ్డి వ్యవహరించారు. రచన సహకారం ఆచార్య సి.హెచ్. సద్గుణ అందించారు. గతంలో కూడా అనేక అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్స్‌లో అవార్డులు అందుకున్న ఎం.వి.సతీష్ కుమార్, హైదరాబాద్ కేంద్రంగా తెలుగు చిత్ర పరిశ్రమలో పనిచేస్తూ ఖర్జూరం, మిక్చర్ పొట్లం వంటి చిత్రాలతో పాటు మొత్తం నాలుగు సినిమాలకు దర్శకత్వం వహించారు. అలాగే ఏకదంత ద స్కూల్ ఆఫ్ ఏన్షియంట్ స్టడీస్ సంస్థకు ఫౌండర్ & డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. విరవాడ గ్రామానికి చెందిన ఓ దర్శకుడు సంస్కృత సినిమాతో అంతర్జాతీయ వేదికపై నిలవడం పిఠాపురం మండలానికి గర్వకారణమని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రక్తదానంతో పలువురికి ప్రాణదానం

**తాళ్ళరేవులో 85 మంది రక్తదానం - సామ్యూల్ సాగర్**



**తాళ్ళరేవు (మనసులో మాట), జనవరి 16:** రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయంలో ఉన్న పలువురికి ప్రాణదానం చేసిన వారమవుతామని తాళ్ళరేవు జడ్పిటిసి సభ్యులు, పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు దొమ్మేటి సామ్యూల్ సాగర్ అన్నారు. పంపన దావీదు జ్ఞాపకార్థం స్థానిక చర్చి వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 85 మంది రక్తదానం చేశారు. కాకినాడ రోటరీ బ్యాంక్ వైద్యులు పి. కామరాజు బృందం రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో దావీదు కుమారులు జాన్ ప్రసాద్, పరంజ్యోతి వాలంటీర్లు పాల్గొన్నారు.



## గోదావరి సంప్రదాయం గుంటూరుకి అంటింది

**గుంటూరు/ రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 16:** గోదావరి జిల్లాల్లో అల్లుళ్లకు పిండి వంటల మర్యాద సంప్రదాయమే. కానీ ఈ సారి ఆ సంప్రదాయాన్ని ఇప్పటి వరకు ఎక్కడాలేని విధంగా మరో స్థాయికి తీసుకెళ్లారు గుంటూరు జిల్లా తెనాలి దంపతులు. మొదటి సంక్రాంతికి వచ్చిన అల్లుడికి ఏకంగా 158 రకాల పిండి వంటలతో విందు భోజనం ఏర్పాటు చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు దంపతులు. మామూలుగా గోదావరి జిల్లాలో పండుగలకు వచ్చిన అల్లుళ్లకు ఎక్కువ సంఖ్యలో పలు రకాల పిండి వంటలు వండి పెట్టడం మనం ప్రతి సంవత్సరం చూస్తున్నాం. కానీ ఈ సంక్రాంతి పండుగకు గుంటూరు జిల్లా తెనాలికి చెందిన వందనపు మురళీకృష్ణ దంపతులు.. ఇంటి అల్లుడికి ఊహించని అదిరే రేంజ్‌లో ట్రీట్ ఇచ్చారు. అల్లుడు శ్రీదత్త గోదావరి జిల్లా రాజమండ్రికి చెందినవారు కావడంతో.. వారి లెవల్‌కు ఏ మాత్రం తగ్గకుండా పండుగ విందు ఏర్పాటు చేశారు. ఏకంగా 158 రకాల పిండి వంటలతో విందు భోజనం వడ్డించి సర్ ప్రైజ్ చేశారు. మురళీకృష్ణ దంపతుల కుమార్తె మౌనికను రాజమండ్రి వాసి శ్రీదత్తకు ఇచ్చి గత ఏడాది వివాహం జరిపించారు. పెళ్లయ్యాక మొదటి సంక్రాంతి పండుగ సందర్భంగా గోదావరి జిల్లా వారికి మనం ఏ మాత్రం తీసిపోము అనే రీతిలో 158 రకాలతో విందు భోజనం ఏర్పాటు చేయడంతో కొత్త సాంప్రదాయానికి శ్రీకారం చుట్టినట్లు గుంటూరు జిల్లా వాసులకు అనిపించింది.

## సేవే లక్ష్యంగా కొల్లు వెంకన్న ఫౌండేషన్ సేవలు



**కాజులూరు (మనసులో మాట) జనవరి 16..** బడుగు, బలహీన వర్గాలకు సేవ చేయడమే లక్ష్యంగా కొల్లు వెంకన్న ఫౌండేషన్ నిరంతరం సేవలు అందిస్తోందని ఫౌండేషన్ అధ్యక్షుడు , పెనుమల్ల సహకార సంఘం అధ్యక్షుడు కొల్లు వెంకటేశ్వర రావు తెలిపారు. శుక్రవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని, గత 30 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయంలో భాగంగా కాజులూరు మండలం అయితపూడి గ్రామంలో కొల్లు వెంకన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 500 మంది మహిళలకు చీరలు, స్వీట్లు, పురుషులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొల్లు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అండగా నిలవడమే తమ లక్ష్యమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని వెంకటేశ్వర రావు తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు కొల్లు వరలక్ష్మి, చైతన్య కృష్ణ , మణికుమారి వెంకటేశ్వరరావు శకుంతల మరిశెట్టి రామస్వామి రాణి గ్రామస్తులు పాల్గొన్నారు.

## అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు



**కాకినాడ (మనసులో మాట) జనవరి 16..** కాకినాడ లోని రమణయ్యపేట లో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో కనుమ పండుగను పురస్కరించుకుని బాల బాలికలకు ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంతి ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తరతరాలుగా ఆనందాన్ని పంచుతున్న సంక్రాంతి ఆబాల గోపాలానికి ఆనంద పర్వమని అన్నారు. ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బాల బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముగ్గులు పోటీలు, స్లో సైక్లింగ్, మ్యూజికల్ చైర్ వంటి పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సుబ్బారావు, ఎస్. శ్రీ నగేష్, సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ఇంజరంలో పారిశుద్ధ్య కార్మికులకు ఘన సత్కారం - వస్త్రాలు పంపిణీ



**తాళ్ళరేవు (మనసులో మాట), జనవరి 16:** మండల పరిధిలోని ఇంజరం గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను సర్పంచ్ ముద్దన వెంకట శివరాం ప్రసాద్ తన సొంత ఖర్చులతో ఘనంగా సత్కరించి అభినందించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు కోరుకొండ కిరణ్ కుమారి చంటి, ఉప సర్పంచ్ కోరుకొండ అప్పారావు బృందం పాల్గొని పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్యం పనులు నిర్వహిస్తున్న సిబ్బందికి నూతన దుస్తులు, వివిధ రకాల పిండి వంటలు, పండ్లు అందజేసి పాదపూజ చేశారు. అనంతరం ఘనంగా సత్కరించారు. వారికి భోజనాలు ఏర్పాటు చేసి సంక్రాంతి పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

### జె. అన్నవరం రోడ్డు కోసం జనవరి 22 తేదిన మరో సారి

# కదం తొక్కనున్న గిరిజన పోరాటం

### - లోత రామారావు ఆదివాసి గిరిజన సంఘం నాయకులు




**ఏలేశ్వరం (మనసులో మాట) జనవరి 16..** ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం మండలం రమణయ్యపేట గ్రామం నుండి జే. అన్నవరం వరకు ఉన్నఆర్ అండ్ బి రోడ్డు పూర్తిగా పాడైపోయి దశాబ్ద కాలం గడుస్తున్నప్పటికీ పాలకులకి మాత్రం ఏ మాత్రం సిగ్గు లజ్జ కానరాక పోవడం తో గిరిజనానికి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చెందుతూ మరో విప్లవనికి ఈ నెల 22 తేది తెర లేపనున్నారు.ఈ దశాబ్ద కాలంలో ఆ పదిహేను కిలోమీటర్ల రోడ్డు లో ప్రయాణించే గిరిజనులు మైదాన ప్రాంతం అయినా ఏలేశ్వరం చేరుకోవాలంటే అనేక ఇబ్బందులు పడుతూన్నారు. గర్భిణీ స్త్రీలు దారిలోనే ప్రసవం అయిపోవడం జరుగుబ్. అలాగే ఆర్ టి సి బస్సులు ఆ గోతుల్లో పడి, ఏదో ఒక పార్ట్ విరిగిపోవడం, తద్వారా బస్సు నిలిచిపోవడం జరగడం తో అందులో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి లో ప్రయాణించే అనేక ప్రమాదాలు గుర్తై ఈ పదేళ్ల కాలంలో ఎన్నో ప్రాణాలు గాలిలో కలసి పోయాయి. ఇలా జరుగుతున్నా ఏ ఒక్క అధికారి గాని పోలవరం జిల్లా కి అధికారులు గాని,ప్రజా ప్రతినిధి గాని, ప్రత్తిపాడు నియోజకవర్గనికి చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు గాని పట్టించు కొన్న పాపానికి పోలేదు. దీనితో గిరి జనం లో చైతన్యము కట్టలు తెంచుకుపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ ఆర్ అండ్ బి రహదారి లో గత పది సంవత్సరాల నుండి అనేక మంది ప్రాణాలు పోవడమే కాకుండా క్షతగాత్రులు కూడా అయ్యి మంచాన పడి తమ జీవితాలు నాశనమైన దాఖలు ఈ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు అలవాటైపోయింది. ఈ రోడ్డు నిర్మాణం పనులు వెంటనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చి , అధికారంలోకి వచ్చిన టిడిపి ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా, అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఆ రోడ్డు పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే ఉన్నట్టుగా ఉంది. ఈ సమస్యపై అనేకమంది ప్రతిపక్ష నాయకులు, సిపిఐ, సిపిఎం పార్టీ ప్రతినిధులు విద్యార్థుల తోపాటు ఆదివాసి గిరిజన సంఘం నాయకులు ఈ 10 ఏళ్లలో ఎన్నో పోరాటాలు చేశారు. అయినప్పటికీ సమస్య ఎక్కడి వేసిన గొంగళి అక్కడే ఉన్నట్టుగా కనబడు తున్నడంతో పోలవరం జిల్లా రాజవొమ్మంగి మండలం లోదొడ్డి గ్రామస్తులు, ఆదివాసి గిరిజన సంఘం నాయకుడు అయిన లోతా రామారావు నేతృత్వం లో ఈనెల 22 తేదిన రమణయ్యపేట నుండి జె.అన్నవరం వరకు ఉన్న ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణం కోసం మరోసారి అల్లూరి సీతారామరాజు ఏడుంపుల ఘాటీ వద్ద ఏ విధంగా పోరాటం చేసాడు అదే రీతిలో గిరిజనుల్లో రహదారి నిర్మాణ విప్లవ పోరాటం రాష్ట్రస్థాయి నుండి కేంద్ర స్థాయి వరకు జరిగే విధంగా ఈ పోరాటం మొదలవుతుందని ఒక ప్రకటనలో గిరి జనం తెలిపారు. పాడేరు జిల్లా రాజవొమ్మంగి, అడ్డతీగల , వైరామవరం అల్లూరి జిల్లా కొయ్యూరు కేడీపేట గోలకొండ నర్సీపట్నం వంటి మండలాల ప్రజాప్రతినిధులు అన్ని పార్టీల రాజకీయ నాయకులు, ఆదివాసి సంఘాల నాయకులు ప్రజా సంఘాల నాయకులు తో పాటు వర్తక సంఘాలు, సామాజిక కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని చలో గొంతువానిపాలెం నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని లోత తమ్మారావు కోరారు. ఈ నిరవధిక నిరసన దీక్ష ను విజయవంతం చేయాలని ఈ రహదారి నిర్మాణానికి పెద్ద ఎత్తున తరలి రావాలని ఆదివాసి గిరిజన సంఘం నాయకుడు లోత రామారావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.



### గ్రీన్ అమోనియా ఉత్పత్తిలో

# కొత్త చరిత్రకు శ్రీకారం

- ఏపీలో అతిపెద్ద గ్రీన్ అమోనియా ప్రాజెక్టు..
- రూ.13 వేల కోట్లతో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్లాంట్‌కు నేడు శంకుస్థాపన చేయనున్న... ముఖ్య మంత్రి చంద్రబాబు
- కాకినాడలో 495 ఎకరాల్లో ఏర్పాటు..2,600 మందికి ఉద్యోగాలు
- ఏడాదికి 1 మిలియన్ మెట్రిక్ టన్ను గ్రీన్ అమోనియా ఉత్పత్తి...



**కాకినాడ (మనసులో మాట) జనవరి 16..** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం క్లీన్ ఎనర్జీ రంగంలో సరికొత్త చరిత్రను సృష్టించబోతోంది. గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత గ్రీన్ అమోనియా పరిశ్రమ ఏర్పాటుతో దేశంలోనే అతిపెద్ద పర్యావరణహిత పరిశ్రమలలో ఒకటిగా నిలిచి చారిత్రాత్మక అడుగు వేయనుంది. గత ఏడాది గ్రీన్‌కో గ్రూప్‌కు చెందిన ఏఎమ్ గ్రీన్ సంస్థకు ఏడాదికి 1 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమోనియా ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఏడాదిలోనే ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చడం గమనార్హం. ఈ పరిశ్రమకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శనివారం ఉదయం కాకినాడలో శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 10.30 గంటలకు ముఖ్యమంత్రి అమరావతి నుంచి కాకినాడకు వస్తారు. 11.20 గంటలకు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు.

**రూ.13 వేల కోట్ల పెట్టుబడులు 2,600 మందికి ఉద్యోగాలు..**

గ్రీన్ హైడ్రోజన్‌ను ఉపయోగించి పూర్తిగా పునరుత్పాదక శక్తితో తయారయ్యే కార్బన్ ఉద్గారాలు లేకుండా గ్రీన్ అమోనియాను ఏఎమ్ గ్రీన్ సంస్థ ఉత్పత్తి చేయనుంది. బొగ్గు, చమురు, సహజ వాయువులతో తయారయ్యే గ్రే, బ్లూ అమోనియాకు భిన్నంగా ఈ ఉత్పత్తి జరుగుతుంది. పర్యావరణానికి ఏమాత్రం హానికరం కాదు. ప్రపంచం మొత్తం డీకార్బనైజేషన్, నెట్-జీరో ఎమిషన్స్ లక్ష్యాల వైపు అడుగులు వేస్తున్న తరుణంలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా భవిష్యత్ ఇంధనాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో కాకినాడలో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్రాజెక్ట్ దేశానికే గర్వకారణంగా నిలవనుంది. నాగార్జున ఫెర్టిలైజర్స్ కెమికల్స్ లిమిటెడ్ పాత గ్రే అమోనియా ప్లాంట్‌ను గ్రీన్ ప్లాంట్‌గా అభివృద్ధి చేస్తున్నారు. 495 ఎకరాల్లో రూ.13 వేల కోట్ల పెట్టుబడితో ఏఎమ్ గ్రీన్ సంస్థ ఈ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. ఈ ప్లాంట్ ఏర్పాటు ద్వారా సుమారు 2,600 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. 2027 చివరినాటికి ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు.

**ఎగుమతులకు అద్భుత అవకాశం..**

ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్లాంట్ కాకినాడ పోర్ట్‌కు కేవలం 1 కిలోమీటర్ దూరంలో ఉంటుంది. గ్రీన్ అమోనియాను అవసరమైన ప్రపంచ దేశాలకు ఎగుమతులకు అద్భుత అవకాశం ఉండనుంది. ఏఎమ్ గ్రీన్ సంస్థ ఇప్పటికే జర్మనీకి చెందిన యూనిపర్ ఎస్‌ఈతో ఒప్పందం కుదుర్చుకుంది. 2028 నుంచి ఏడాదికి 125 కేటీపీఏ గ్రీన్ అమోనియాను ఆ దేశానికి ఎగుమతి చేయనుంది. అలాగే మలేషియాకు చెందిన పెట్రోనాస్, సింగపూర్‌కు చెందిన జీఐసీ, యూఏఈకి చెందిన ఏడీఏఐ వంటి సంస్థల సహకారంతో ఏర్పాటు చేస్తోన్న ఈ ప్రాజెక్ట్ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందనుంది. ఈ ప్రాజెక్టుతో పాటే కాకినాడలోనే 2,000 కోట్ల రూపాయలు వ్యయంతో 2 గిగావాట్ల ఎలక్ట్రోలైజర్ తయారీ యూనిట్‌ను కూడా ఏఎమ్ గ్రీన్ ఏర్పాటు చేస్తోంది.



సీతారామపురంలో రామాలయం

# భూమి కబ్జా..!

### అనధికారికంగా విక్రయాలు అక్రమార్కులపై చర్యకు ప్రజా సంఘాలు డిమాండ్

**తాళ్లరేవు (మనసులో మాట), జనవరి 16:** మండల పరిధిలోని కోరంగి పంచాయతీ సీతారామపురం గ్రామంలో విలువైన రామాలయ స్థలాన్ని పలువురు ఆక్రమించుకుని అనధికారకంగా విక్రయాలు సాగిస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కోరింగ పంచాయితీ సీతారాంపురం గ్రామంలో సర్వే నంబర్ 363లో సుమారు 70 సెంట్లు గ్రామకంఠం రామాలయ స్థలాన్ని ఆక్రమించుకుని అనధికారికంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని, ఆ స్థలాన్ని రామాలయానికి కేటాయించాలని ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, దుప్పి అదృష్టదీపుడు, సంగాని దాసు, దాసరి నాగేశ్వరరావు, వళ్ళు రాజబాబు, భజన శ్రీను, బొమ్మిడి శివరాం, కాల రాజారావు తదితరులు ప్రభుత్వ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు విలేకరులతో మాట్లాడుతూ సీతారాంపురం గ్రామంలో పైన పేర్కొన్న సర్వే నంబర్లు సుమారు 70 సెంట్లు స్థలం రామాలయం పేరుతో 50 సంవత్సరాలు నుండి ఖాళీగా తుప్పలతో ఉందన్నారు. దానిని గతంలో ప్రజలు ఇళ్ల స్థలాలుకు పెడితే ఇది రామాలయం భూమి అని, అన్నారని, అప్పటినుండి ఆ స్థలాన్ని అలాగే ఉంచడం జరిగిందని తెలిపారు. ఈ 50 సంవత్సరాలు కాలం నుండి కూడా ఆ స్థలములో ఎవరు కాపురం చేయడం గాని, నివాసం ఉండడం గానీ, జరగలేదని ఆ స్థలాన్ని ఇప్పుడు కొందరు వ్యక్తులు ప్రోక్లైన్లతో తో చదును చేసి అమ్ముకొనుటకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఈ నెల 13న మండల తాసిల్దారు పితాని త్రినాధరావుకి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని అక్రమార్కుల నుంచి స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

### రేపూరులో ఘనంగా ముగ్గుల పోటీలు

# అభివృద్ధికి కృషి చేస్తాం

### రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ (మనసులో మాట) జనవరి 16..** కాకినాడ రూరల్ మండలం రేపూరు గ్రామం అభివృద్ధికి తమ వంతు కృషి చేయడం జరుగుతుందని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీలు స్పష్టం చేశారు.

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రేపూరు గ్రామంలో గత 13 ఏళ్లుగా తోట వేణు, నక్క శ్రీమ, ముమ్మిడి బుజ్జి, ముమ్మిడి రాజా నేతృత్వంలో మహిళల కోసం ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది నిర్వహించిన ముగ్గుల పోటీల 13వ వార్షికోత్సవ వేడుకలకు రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు వేసిన రంగురంగుల, కళాత్మక ముగ్గులను అతిథులు ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ, సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడే ఇలాంటి కార్యక్రమాలు ప్రశంసనీయమని, రేపూరు గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు.

ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, ఎమ్మెల్యే పంతం నానాజీలు బహుమతులను చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బుర్రయ్య, నూరుకుర్తి గోవింద్, గ్రామ పెద్దలు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# ఆకట్టుకున్న అల్లూరి సీతారామరాజు నాటకం

### - ఘనంగా శ్రీ గౌరీశంకరుల ఉత్సవాలు







**ప్రత్తిపాడు,( మనసులోమాట) జనవరి 16.** ప్రత్తిపాడు మండలంలోని ధర్మవరం గ్రామంలో శ్రీ గౌరీ శంకరుల వార్షిక మహోత్సవాల్లో భాగంగా ప్రదర్శించిన అల్లూరి సీతారామరాజు నాటకం ప్రేక్షకులను విశేషంగాఆకట్టుకుంది .89వ గౌరిశంకరుల వార్షికోత్సవ మహోత్సవాలను నిర్వహకులు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా వరుసగా రెండు రోజులుగా అల్లూరి సీతారామ రాజు,శ్రీ రామాంజనేయుల యుద్ధం నాటకాలను ప్రదర్శించారు. ఈ నాటకాల్లో కళాకారులు తమ నటనతో స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నారు. అల్లూరి సీతారామరాజు కథ,ఆయన వీరత్వం,సాహసం, బ్రిటిష్ అధికారుల ఆగడాలను ఎదిరించడం వంటి అంశాలు ప్రదర్శనలో ప్రధాన ఇతివృత్తాలుగా నిలిచాయి. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు,భారత గడ్డ నుండి బ్రిటిష్ వారిని తరిమేయడానికి అన్యం పుణ్యం ఎరుగని మన్యవాసుల భూములను లాక్కోని వారిపై పెత్తనం చెలాయించే ఆ దొరలను తరిమేసే క్రమంలో వారి చేతిలోనే ప్రాణాలు విడిచిన సీతారామరాజు దృశ్యాన్ని కళ్ళకు కట్టినట్టుగా చూపించడం జరిగింది.అల్లూరి సీతారామరాజు చారిత్రక నాటకంలో అల్లూరి సీతారామరాజులుగా గల్లా పద్మరావు, గోపు రాంబాబు, గంటందొరగా ఎస్ నాయుడు, సింగన్నగా కనకం, బాస్టియన్‌గా కె సూరిబాబు, గుడాల్‌గా ఎస్ చిట్టిబాబు, గోవింద్‌గా గొల్లపల్లి శివాజీ, మల్లుగా సాదనాల అప్పన్న, పడాలుగా శ్రీను,ఎస్పైగా డి గోవిందు, తిరేగా గణేష్, పోలీసులు, పాండవులుగా బాబ్జి, రతిగా అనకాపల్లి భాను, డ్యాన్సర్‌గా శ్రీలక్ష్మీ నటించారు. ట్రూప్ ఆర్గనైజర్‌గా గణేష్ వ్యహరించారు.

### క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్ లో భాగంగా

# మొదటి కార్యక్రమం సంక్రాంతి సంబరాలు..



**కాకినాడ (మనసులో మాట) జనవరి 16..** వాసవి క్లబ్ హ్యూమానిటీ కాకినాడ లోని 37వ వార్డు నందు నిర్వహించడం జరిగింది. రంగోలి అనేది నేలపై లేదా ఇంటి ప్రవేశ ద్వారాలపై గీసే అలంకరణ కళ ఇది ఇంటికి అండ్ కుటుంబంలో అదృష్టం, శ్రేయస్సును తెస్తుందని అతిథులను స్వాగతిస్తుందని భావిస్తాం కొంతమంది ప్రతి రోజు ఉదయం లేదా సంక్రాంతి వంటి ప్రత్యేక పండుగ సందర్భంగా రంగోలి వేస్తారు.అలాంటి రంగోలి పోటీలను నిర్వహించి పోటీలో పాల్గొన్న వాళ్ళకి మొదటి బహుమతి గా చీరలు,రెండవ బహుమతిగా గిఫ్ట్,మూడవ బహుమతిగా గిఫ్ట్ లు మరియు రంగుల పోటీలో పాల్గొన్న వారందరికి గిఫ్ట్స్ అందించడం జరిగింది.స్థానిక పిల్లలందరికీ పతంగిలు (గాలిపటాలు) పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కోశాధికారి కేదారిశెట్టి సురేష్ ,డిస్ట్రిక్ట్ సి.ఎమ్.ఆర్ ఇంచార్జ్ కె వి ఆర్ మూర్తి ,వాసవి క్లబ్ హ్యూమానిటీ కాకినాడ ప్రెసిడెంట్ మన్యం దుర్గ సుభద్ర గణేష్ , వైస్ ప్రెసిడెంట్ కేదారిశెట్టి శ్రీదేవి , సెక్రటరీ నాళం సూర్య ప్రభ ,కేదారిశెట్టి శ్రీను మన్యం గణేష్ పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# ఆయ్.. మరదే.. మా మర్యాదండి

## కొత్త అల్లుడికి 70 రకాల వంటకాలు - గోదారోళ్ల మర్యాదలు అంతే మరి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), జనవరి 16:** మర్యాద..మర్యాద అంటే గోదారోళ్ళదేనండి. మాటలోనే కాదు..బంధుమిత్రులకు ఆతిథ్యం ఇవ్వాలన్నా గోదారోళ్ళ తర్వాతేనండి మరెవరైనా. మాటకు ముందు చివర ఆయ్..మరండి, ఉంటానండీ అనే పదాలు భలే ముచ్చటగా ఉంటాయి. కల్లా కపటం లేని మనుషులు, అమాయకత్వం చూపులు, చేష్టలు. అలాగని అమాయకులని కాదండోయ్. ఎవరైనా ఒక తూరి వచ్చి మాట్లాడితే చాలండి..పాణాలెట్టేతారం. అలాంటిది.. ఇంటి అల్లుడు వత్తే..మరి మామూలుగా ఉండదండి. ఆ మర్యాదలే ఏరండి. అందులోనూ సంక్రాంతి పండుగలకు మా గోదారోళ్ళ అత్తింటికి వత్తే..మరేదకు అస్సలు కొదవే ఉండదండి. ఆ మర్యాదలు, పలకరింపులూ చూస్తే ఎవరైనా ఉబ్బితబ్బిబ్బు అయిపోవల్సిందే..ఆయ్.

సంక్రాంతి వచ్చిందంటే కొత్త అల్లుడికి పండగే పండగ. అత్తారింట్లో వారికి జరిగే రాచ మర్యాదలు మామూలుగా ఉండవు. తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం జేగురుపాడులో కొత్త అల్లుడికి 70 రకాల వంటకాలతో శుక్రవారం కనుమ రోజు విందు భోజనం ఏర్పాటు చేశారు. ఆ గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ రంకిరెడ్డి సుబ్రహ్మణ్యం కుమార్తె లీలావతిని అదే మండలం దామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన యువ నర్సరీ రైతు తోరాటి శివ సూర్యకు ఇచ్చి గతేడాది ఫిబ్రవరి 6న వివాహం జరిపించారు. ఇప్పుడు ఆయన కొత్త అల్లుడు కావడంతో మేక, కోడి, చేప, రొయ్య, పీత వంటి మాంసాహారాల తోపాటు పలు రకాల సంక్రాంతి వంటకాలతో అదిరిపోయే విందు ఇచ్చారు. గోదావరి జిల్లాల్లో మర్యాదలు ఇలా ఉంటాయని చాటి చెప్పారు. ఇవన్నీ అతనొక్కడే తినేస్తాడా అనే చర్చలు పెట్టకండి. గోదావరి మర్యాదలు అంటే అలాగే ఉంటాయి మరండి.

## సంప్రదాయం- సంస్కృతికి ప్రతీక సంక్రాంతి పండుగ : గుంజ గంగారావు



**పల్నాడు, జనవరి 16,(మనసులో మాట):** మన భారతీయ సాంప్రదాయాలు సంస్కృతిని ప్రతిబింబించే మహత్తర పండుగ సంక్రాంతి అని పెదకూరపాడు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గుంజ గంగారావు అన్నారు. బెల్లంకొండ మండలంలోని చంద్రాజు పాలెం గ్రామం వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద సంక్రాంతి పర్వదినాన పెదకూరపాడు శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్ ఆదేశాలతో గ్రామ పెద్దలు, వెంకటేశ్వర స్వామి దేవస్థాన కమిటీ సభ్యులు, సంఘ ప్రెసిడెంట్. క్యాషియర్ సహకారంతో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ముఖ్య అతిథులుగా కితకితలు సినిమా హీరోయిన్ గీతా సింగ్, సీరియల్ నటి జాను, ప్రొడ్యూసర్ గిరిరాజు పాల్గొని, గుంజ గంగారావు సారధ్యంలో ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతుల ప్రదానోత్సవం లో అంగన్వాడీ టీచర్ ముద్ద విజయ పాల్గొని అందజేశారు. గ్రామంలో సినీ,టీవి నటీమణుల రాకతో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ సభ్యులు స్నేహితులు ప్రజలందరూ కలిసి ఆనందంగా జరుపుకునే పండగే సంక్రాంతి అని, ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో సుఖశాంతులు సౌభాగ్యాన్ని నింపాలని ఆకాంక్షించారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న 30 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు రాంబాబు నితీష్ వెంకటగిరి లక్ష్మయ్య, భత్తుల శీను, ఉప్పు సుబ్బారావు, తమ్మిశెట్టి వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.



# పండగంటే... పందెం కాదు



- యువత పండక్కి వస్తున్నారు
- జూదాలు కోసమే మరి!
- సంక్రాంతి అంటే అర్ధం మారనుందా!
- పాడి పంటలు పండగ... కోడి పందేలు పండగలా మార్చేసేరా!
- సంక్రాంతి అంటే జూదాలే అనేలా చూస్తున్న ప్రజలు

**ముమ్మిడివరం (మనసులో మాట) జనవరి 16:** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో సంక్రాంతి సంబరాలు కేవలం వినోదం మాత్రమే కాదు, అవి మన సంస్కృతికి నిలువుటద్దం. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వేడుకల అసలు ఉద్దేశం పక్కదారి పట్టి, కేవలం కోడిపందేలు, జూదాలే ప్రధానంగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

గోదారి జిల్లాలు సంక్రాంతి సంబరాలకు కేరాఫ్ అడ్రస్. పచ్చని పొలాలు, కొబ్బరి తోటల మధ్య ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసుల కీర్తనలతో పల్లె సీమలు కళకళలాడుతుంటాయి. కానీ, గత కొన్నేళ్లుగా సంక్రాంతి అంటే కోడిపందేలే అనే ముద్ర బలంగా పడిపోతోంది.

**కోడిపందేల కోసం గోదావరి జిల్లాలకు పరుగులు:**

సంక్రాంతి పండుగ మూడు రోజుల్లో గోదావరి జిల్లాలలో కోడిపందేలు, గుండాటలు వంటి జూదాల్లో వందల కోట్ల రూపాయలు చేతులు మారడం కామన్‌గా జరిగిపోతోంది. జూదం ఒక వ్యసనంగా మారడం వల్ల పండుగ అసలు పరమార్థం మరుగున పడిపోతోంది. కత్తులు కట్టి ఆడటం నేరం అయినా ఆపే పరిస్థితి లేదు. ఏ ప్రభుత్వం అయినా తల వంచక తప్పని పరిస్థితి ఏర్పడింది. మూడు రోజుల పాటు వదిలేస్తున్నారు. తర్వాత కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ మూడు రోజుల పాటు పందెం రాయుళ్లు కుటుంబాలను వదిలేసి పందేలతోనే పండగ చేసుకుని సర్వం కోల్పోతున్నారు.



**పండగంటే పందేలు కాదు :**

సంస్కృతి – సంప్రదాయాల కలయికే అసలైన పండుగ. సంక్రాంతి అంటే రైతన్నలు తాము పండించిన పంట లక్ష్మిని ఇంటికి తెచ్చుకునే పండుగ. ముత్తయిదువల రంగవల్లులు, గంగిరెద్దుల విన్యాసాలు, గాలిపటాల సందడి, పిండివంటల ఘుమఘుమలు.. ఇవే మన వారసత్వ సంపద. కోడిపందేలను కేవలం పందెం రాయుళ్ల 'బెట్టింగ్' అడ్డాగా కాకుండా, గ్రామీణ క్రీడగా మాత్రమే చూడాలి. జూదాన్ని విడనాడి, మన కళలను, కట్టుబాట్లను భావి తరాలకు అందించే వేదికగా సంక్రాంతిని తీర్చిదిద్దాలి. కానీ జరుగుతోంది వేరు. ప్రభుత్వం , స్థానిక సంస్థలు సంప్రదాయ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించడం ద్వారా ప్రజల దృష్టిని పందేల నుంచి మరల్చవచ్చు. ఇటీవల అలాంటి ప్రయత్నాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

**పందేల సంస్కృతి మార్చేందుకు అడుగులు:**

ఇటీవల కొన్ని ప్రాంతాల్లో జరిగిన సంక్రాంతి మహోత్సవాలు బాగా జరిగాయి. పిఠాపురం,



ఆత్రేయపురం, ఎస్. యానాం లలో బాగా పండగ ను ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుపుకున్నారు. పడవ పందేలు, ఎడ్ల బళ్ల పోటీలు, రంగవల్లికల పోటీలు , సాంస్కృతిక ప్రదర్శనలకు ప్రాధాన్యతనిస్తే, పండుగ ఒక సామాజిక ఉత్సవంలా మారుతుంది. పర్యాటకులకు గోదావరి ఆతిథ్యాన్ని, ఇక్కడి రుచులను పరిచయం చేసే ఫుడ్ ఫెస్టివల్స్ లాంటివి మరిన్ని నిర్వహించాలి. మార్పు ప్రజల నుంచే రావాలి. చట్టాలు, పోలీసు ఆంక్షలు ఎన్ని ఉన్నా, ప్రజల్లో మార్పు వచ్చినప్పుడే ఈ జూద సంస్కృతి అంతమవుతుంది. పండుగ అంటే కుటుంబ సభ్యులంతా కలిసి ఆనందంగా గడపడం, బంధుమిత్రులతో ఆత్మీయతలను పంచుకోవడం. లక్షల రూపాయలు పందేల్లో పోగొట్టుకుని ఆర్థికంగా చితికిపోవడం పౌరుషం కాదు, పండుగ స్ఫూర్తి అంతకన్నా కాదు.



# మందు చూపు

- ప్రభుత్వం నుండి అనుమతి రాకుండానే అక్రమ వసూళ్లు
- ప్రభుత్వం 10 రూపాయలు అంటే సిండికేట్ 20 కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారని మందు బాబులు గగ్గోలు



**ముమ్మిడివరం (మనసులో మాట) జనవరి 16:** మద్యం విక్రయాలకు సంబంధించి బాటిల్‌పై రూ.10 పెంచుకోవడానికి మంత్రి వర్గంలో తీర్మానం అలా చేశారంతే. ఆ తీర్మానం తరువాత ఆ ప్రతిపాదనలు ప్రభుత్వం వద్దకు వెళ్లాలి, ప్రభుత్వం వాటిలో లోటుపాట్లు గుర్తించి జీవో ఇవ్వాలి. ఇవేవీ తమకు పట్టదన్నట్లు జిల్లాలో మద్యం వ్యాపారులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. మంత్రి వర్గం ధరల పెంపునకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని, టీవీల్లో బ్రేకింగ్ న్యూస్ రాగానే.. జిల్లాలో ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై ఏకంగా రూ.10 చొప్పున పెంచేశారు.

**అక్రమ వసూళ్లు:**

కోనసీమ జిల్లాలో సుమారుగా 99 మద్యం దుకాణాలు ఉన్నాయి ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం నుంచే 90 శాతం దుకాణాల్లో మద్యం ధరలకు రెక్కలొచ్చేశాయి. ఆ రోజు అమరావతిలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఎక్సైజ్ పాలసీలో పలు మార్పులు చేస్తూ క్యాబినెట్ నిర్ణయిం తీసుకుంది. ఇందులో ప్రతీ మద్యం బాటిల్‌పై రూ.10 పెంచడమనేది ప్రధాన నిర్ణయం. రూ.99 మద్యానికి ఇందులో మినహాయింపు ఇచ్చింది. మంత్రి వర్గంలో దీనిపై నిర్ణయం తీసుకున్న క్షణాల్లోనే కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఉన్న మద్యం దుకాణాల్లో ధరలు అమాంతంగా పెంచేశారు. ప్రతీ క్వార్టర్ బాటిల్‌పై రూ.10 అక్రమంగా వసూలు చేసేస్తున్నారు. బీర్ విక్రయాలపై ధరల పెంపు లేకపోయినా.. జిల్లాలో యథేచ్ఛగా దోచుకుంటున్నారు. ఇక ప్రీమి యం బ్రాండ్ల క్వార్టర్ బాటిల్‌పై రూ.20 చొప్పున వసూలు చేస్తున్నారు. ఐదు రోజులుగా ఈ దందా సాగిస్తున్నా అడిగే దిక్కులేదు. రోజుకు రూ.కోటికి పైగా సాగే మద్యం విక్రయాల నుంచి ఈ ఐదు రోజులకు అక్రమ వసూళ్ల ద్వారా రూ.కోటి వరకు ఆదాయం చేకూరింది.

**సోమవారం నుంచి రూ.10 పెంపు:**

మద్యం బాటిళ్లపై రూ.10 పెంచుతూ తీసుకున్న నిర్ణయంపై సోమవారం రాత్రి జీవో విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం నుంచి మద్యం బాటిల్‌పై రూ.10 పెంచుతున్నట్లు పేర్కొంది. బీర్, వైన్‌బాటిళ్లు, రూ.99 మద్యంపై ఈ పెరిగిన ధరలు వర్తించవు.

**మద్యం విక్రయాల్లో చిలక్కొట్టుడు:**

**భారీగా ఆఫ్ టేక్**

మరోవైపు ప్రభుత్వం నుంచి ధరల పెంపు జీవో రాకమునుపే మద్యం డిపోల నుంచి భారీగా స్టాకును (ఆఫ్‌టేక్)కు దుకాణాలకు తరలిస్తున్నారు. ధరలు పెరిగిన తరువాత లాభం కోసం ఎదురుచూడడంకంటే.. అమల్లోకి రాకమునుపే మద్యం బాటిళ్లను భారీ మొత్తంలో తీసుకుంటూ రోజుకు రూ.లక్షలు ఆర్జిస్తు న్నారు.కేవలం ధరల పెరుగుదల కారణంగానే ఈ వ్యత్యాసం కనిపిస్తోంది. ఇటు ధరల పెంపునకు ముందు.. పెంపు తరువాత మద్యం ప్రియుల జేబులకు చిల్లు పడ్డట్లయ్యింది.



## వెయ్యి మంది నిరుపేదలకు చీరలు పంపిణీ

**తాళ్ళరేవు (మనసులో మాట), జనవరి 16:** పి. మల్లవరం మాజీ సర్పంచ్, ముమ్మిడివరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ సంక్రాంతి పండుగ సందర్భంగా సుమారు వెయ్యి మంది నిరుపేదలకు చీరలు పంపిణీ చేశారు. పత్తిగొంది లోని ఆయన స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో చీరలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుడిపూడి శ్రీనివాస్, దున్న మురళి, సోనూ, దడాల సువర్ణ లత, బొంతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా ముగిసిన జూద క్రీడలు



**కాకినాడ (మనసులో మాట) జనవరి 16..** రాష్ట్ర వ్యాప్తంగా చిన్నచితక ఘర్షణలు మినహా కోడిపందాలు , గుండాట , పేకాట , అక్రమ మద్యం తో మూడు రోజులపాటు సాగిన జూధ క్రీడలు ఎటువంటి పోలీసుల ఆంక్షలు లెక్క చేయక కుటుంబ సమేతంగా వచ్చి తిలగించారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ముందుగా హెచ్చరికలు జారీ చేసిన కూటమి నాయకులు ప్రజల మద్దతుతో నిర్వహించి అందరిని అలరించాయి. కొన్నిచోట్ల చిన్నచిన్న తగాదాలు ఘర్షణలు తలెత్తిన పెద్దలు కలగజేసుకొని వెంటనే వాటిని సర్ది చెప్పి ఆటలకు ఎటువంటి అంతరాయం కలగకుండా ఆటలను జరిపించడం విశేషం.

## ఘనంగా ప్రభల తీర్థం



**ముమ్మిడివరం (మనసులో మాట) జనవరి 16:** ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి పల్లిపాలెం లో ప్రభల తీర్థం శుక్రవారం ఘనంగా జరిగింది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రభలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొన్నారు. ప్రభల తీర్థం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ముమ్మిడివరం సీ.ఐ ఎం. మోహన్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్. ఐ డి.జ్వాలాసాగర్ గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే మండలంలోని క్రాప చింతలపూడి, అయినాపురం,అన్నం పల్లి, చెయ్యేరు గున్నేపల్లి గ్రామాల్లో ప్రభల తీర్థం ఘనంగా జరిగింది

## గేదెల రాజు చిత్ర బృందం సందడి



**ముమ్మిడివరం (మనసులో మాట) జనవరి 16:** గేదెల రాజు చిత్ర బృందం శుక్రవారం ముమ్మిడివరంలో సందడి చేశారు. ఈ సినిమా కో- ప్రొడ్యూసర్ తాడాల వీరభద్రరావు ఇంటికి ఈ చిత్ర బృందం విచ్చేసింది. గేదెల రాజు సినిమాలో గాయకుడు, సంగీత దర్శకుడు, నటుడు రఘు కుంచె టైటిల్ పాత్ర పోషించారు.నూతన దర్శకుడు చైతన్య మోటూరి దర్శకత్వంలో లవ్ అండ్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందుతుంది. కాకినాడ దగ్గరలో జరిగిన యాదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రఘుకుంచే సమర్పిస్తుండగా, వాణి రవికుమార్ మోటూరి నిర్మాత.రవి చిన్నబిల్లి, తాడాల వీరభద్రరావు సహ నిర్మాతలు. ఈ సందర్భంగా రఘు కొంచెం మాట్లాడుతూ గేదెల రాజు టీజర్ ను గురువారం సాయంత్రం ఎస్.యానంలో జరిగిన ఈవెంట్లో రిలీజ్ చేశామన్నారు. సినిమాను వచ్చేనెల ఫిబ్రవరిలో విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## క్రాపలో ముగ్గుల పోటీలు



**ముమ్మిడివరం (మనసులో మాట) జనవరి 16:** సంక్రాంతి సందర్భంగా క్రాప గ్రామంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు దామిశెట్టి అంజి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పమిడికొండల శ్రీను,బొబ్బిలి రాజా, ప్రదీప్, చిక్కం సత్యనారాయణ, కురసాల బాబి, ఎస్.సుబ్బారావు,కృష్ణమూర్తి ఏసు, రాంబాబు, రంగబాబు లతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప
శనివారం 17 జనవరి 2026


# తమిళనాడు రాష్ట్రంలో ప్రఖ్యాత గాయని సోమిశెట్టి సరళకు అవార్డు

**ధర్మవరం జనవరి 16 (మనసులో మాట)..** తమిళనాడు రాష్ట్రంలోని కలైమా మణి అవార్డు గ్రహీత ప్రఖ్యాత శాక్సాఫోన్ కళాకారులు ,కలైమామని అవార్డ్ గ్రహీత అయిన ఆచార్య డాక్టర్ మానిక్ జయకుమార్ నిర్వహించే "మర్గజి సంగీత ఉత్సవాలు "కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన ప్రఖ్యాత గాయని సోమిశెట్టి సరళ కు ప్రత్యేక ఆహ్వానం రావడంతో వారు వెళ్లారు. ఈ వేడుకలు తమిళనాడు, తిరిచేంగోడ్ పట్టణం లోని వి.ర్.టి గార్డెన్స్ ,అగ్రహారం నందు డిసెంబర్16 ,2025 నుండి 14,జనవరి 2026 వరకు జరిగిన ఈ సంగీతోత్సవాలల్లో వివిధ రంగాలలో నిష్ణాతులైన కళాకారులను గుర్తిస్తూ టైటిళ్ళు ప్రధానం చేశారు. జనవరి 14వతేది ఈ ఉత్సవాలలో పాల్గొని సోమిశెట్టి సరళ తన భక్తి సంగీత గీతాలాపన ప్రదర్శనతో తమిళ శ్రోతలను కూడా ఆకట్టుకున్నారు. ప్రముఖుల



అభినందనలు అందుకున్నారు . సంగీతరంగం లో సరళ చేస్తున్న కృషిని గుర్తింపు ఇస్తూ.. " తేనిసై పెరరసి" "(మధుర సంగీత సామ్రాజ్ఞి) బిరుదు ను కలైమామణి తెంకని కొట్టై మిస్టర్ వి. మణి, నాథస్వర చక్రవర్తి కలైమామణి ఎం.కె.ఎస్. నటరాజన్, ఎం.వి. అరూరు సుబ్రమణ్యం కలైమామని జయకుమార్ తదితర పెద్దల చేత ప్రకటించబడి బిరుదు పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ కళాకారులు, అభిమానులు, బంధుమిత్రులు, అధికారులు తమ అభినందన శుభాకాంక్షలు



## మామిడి రైతులకి రావలసిన బకాయిలు రూ 8 రూపాయలు ఇతర సమస్యలపై

# లోకేష్ కి వినతి

### అందించిన మామిడి రైతు సంఘం నేతలు

పలమనేరు జనవరి 16( మనసులో మాట): ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతు సంఘం అధ్యక్షులు సి. మునీశ్వర్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ ని నారావారిపల్లెలో కలిసి ప్రభుత్వ ఆదేశాలను సైతం ధిక్కరించి రైతులకు గుజ్జు ఫ్యాక్టరీలు చెల్లించాల్సిన రూ :8 రూపాయల బకాయిల కై వినతి పత్రం అందించడం జరిగింది.

7 నెలలు దాటిన రైతులకు ఇవ్వాల్సిన బకాయిలను గుజ్జు ఫ్యాక్టరీలు చెల్లించకుండా రైతులను దోచేస్తున్న గుజ్జు ఫ్యాక్టరీల పై చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. రూ: 8 చెల్లించని గుజ్జు ఫ్యాక్టరీల పై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు,మామిడి రైతు సంఘం నేతలతో కలిసి నిజనిర్ధారణ కమిటీ వేసి ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి మామిడి రైతులను గుజ్జు ఫ్యాక్టరీల పై చర్య తీసుకోవాల్సిందిగా కోరడం జరిగింది.ప్రస్తుత మామిడి సీజన్ లో పురుగు మందులకు సంబంధించి కంపెనీలు,డీలర్ల పై ఉన్నతాధికారులతో కమిటీలు వేసి నకిలీ మందులు అమ్మకుండా చర్యలు చేపట్టాలని కోరడం జరిగింది. గత సంవత్సరం మామిడిలో నష్టపోయిన రైతులకు ప్రస్తుత సంవత్సరంలో పురుగుమందులు 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వమే నేరుగా రైతులకు అందించాలని కోరడం జరిగింది.ఉపాధి హామీ పథకాన్ని మామిడి కి అనుసంధానం చేసి రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉన్న చిత్తూరు మామిడిని,రైతులను కాపాడాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో మామిడి రైతు సంఘం నేతలు మునిరత్నం నాయుడు, ఉమాపతి నాయుడు, జయదేవయ్య, తదితరులు పాల్గొనడం జరిగింది.

## ధర్మవరం పట్టణంలో బేకరీలో

# భారీ అగ్నిప్రమాదం

### సంఘటనా స్థలాన్ని సందర్శించిన మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు



**ధర్మవరం, జనవరి 16 (మనసులో మాట)..** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న ఒక బేకరీలో శుక్రవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బేకరీ పూర్తిగా దగ్ధమై, దాదాపు రూ.50 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేయబడింది. ప్రమాద సమాచారం అందిన వెంటనే మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు. బాధిత బేకరీ యజమానులతో మాట్లాడి జరిగిన నష్టాన్ని వివరంగా తెలుసుకున్నారు. అనంతరం ఈ ఘటనను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లినట్లు హరీష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పందిస్తూ, బాధితులకు తగిన నష్టపరిహారం అందేలా తక్షణమే అంచనా నివేదిక సిద్ధం చేయాలని, అలాగే సంబంధిత శాఖలు సమన్వయంతో తదుపరి చర్యలను వేగవంతంగా చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ఇలాంటి అగ్నిప్రమాదాలు పునరావృతం కాకుండా వ్యాపార సముదాయాలు, బేకరీలు, హోటళ్లు తదితర వాణిజ్య సంస్థలలో అగ్నిమాపక భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని మంత్రి సూచించినట్లు హరీష్ బాబు తెలిపారు. అవసరమైన చోట అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయడం, భద్రతా ప్రమాణాలను క్రమం తప్పకుండా పరిశీలించడం తప్పనిసరి చేయాలని అధికారులకు సూచనలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడం ఊరట కలిగించే అంశమని, అయినప్పటికీ బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని హరీష్ బాబు భరోసా ఇచ్చారు.

## మూడు రోజుల సంక్రాంతి సంబరాలతో

# పండుగ వాతావరణంలో ధర్మవరం

- మన సంస్కృతి మన వారసత్వం - దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే
- చేనేత పరిశ్రమకు చారిత్రాత్మక శుభవార్త - ధర్మవరానికి దేశంలో ఏకైక మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ మంజూరు
- దేశంలో ఒక్కటే మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ - అది ధర్మవరానికే.
- వచ్చే ఏడాది ఇంకా పెద్దగా ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ- ధర్మవరాన్ని ఆదర్శ నియోజకవర్గంగా మార్చి తీరుతాం
- అభివృద్ధిలో తక్కువ చేయనుడ సంక్షేమంలో వెనకడుగు వేయను మంత్రి సత్య కుమార్ యాదవ్.



**ధర్మవరం, జనవరి 16 (మనసులో మాట)** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సంప్రదాయ నాట్య ప్రదర్శనలు, డాన్స్ పెర్ఫార్మెన్సులు, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అవతార ప్రదర్శనలు సహా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ హాజరై, కళాకారుల ప్రదర్శనలను ఆసక్తిగా, తీక్షణంగా వీక్షించారు. బాబు బాలాజీ వారి ఆధ్వర్యంలో మహాగణపతి, అంబాపరాకు, మహిషాసుర మర్ధిని, అలాగే సినిమా పాటలకు డ్యాన్సులు, కిషోర్ వారి ఆధ్వర్యంలో సంక్రాంతి పాటలు, రఘుకుల తిలక రారా, విఘ్నేశ్వరుడి పాటలు,

లోకేష్ వారి ఆధ్వర్యంలో సినిమా పాటలకు నృత్యాలు,

పళ్లెం వేణుగోపాల్ వారి ఆధ్వర్యంలో నర్తనశాల పద్యాల ప్రదర్శన, వంటి పలు అద్భుతమైన సంప్రదాయ ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.

ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ. గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ సంక్రాంతి సంబరాలు మీకు ఎలా అనిపించాయి? ధర్మవరం నియోజకవర్గ కుటుంబ సభ్యులందరికీ నా హృదయపూర్వక మకర సంక్రాంతి శుభాకాంక్షలు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా, మరింత వినూత్నంగా, కొత్తగా, మొత్తం ధర్మవరం పట్టణం, చుట్టుపక్కల గ్రామాలన్నీ కలిసి ఒక కుటుంబంలా సంక్రాంతిని జరుపుకున్నాం.

సంక్రాంతి అనేది ఆంగ్ల నూతన సంవత్సరంలో వచ్చే తొలి పండుగ. ఈ పండుగ గొప్పతనాన్ని నేటి తరానికి మాత్రమే కాకుండా, భావితరాలకు కూడా మరింత కొత్తగా పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ సంబరాలను మూడు రోజుల పాటు నిర్వహించాం.

మన పెద్దలు, మన పూర్వీకులు అందించిన సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ సంపదను పరిరక్షించుకోవడమే కాకుండా, భవిష్యత్ తరాలకు అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గోమాతకు గోపూజ చేసి కార్యక్రమాలను ప్రారంభించాం. భోగి మంటలతో పాత కష్టాలను విడిచి, ఉత్తరాయనంలోకి అడుగుపెట్టి కొత్త ఆశలతో ముందుకు సాగనున్నాం. ఈ మూడు రోజులుగా సంప్రదాయ ఆటలు, పాటలు, నృత్యాలు, వేషధారణలు అద్భుతంగా ప్రదర్శించబడ్డాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు చూపించిన ప్రతిభను చూస్తే, ధర్మవరం అంటే టాలెంట్ అనే విషయం మరోసారి నిరూపితమైంది. స్థానిక కళాకారుల్లో ఇంతటి ప్రతిభ ఉందని ఈ స్థాయిలో నేను ఊహించలేదు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రతి చిన్నారికి, ప్రతి కళాకారునికి, నిర్వాహకులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. గ్రామీణ క్రీడలైన గోలీలాట, బొంగరాలు, కబడ్డీ, క్రికెట్‌తో పాటు కరాటే, కర్రసాము వంటి విన్యాసాలు 5 సంవత్సరాల పిల్లల నుంచి 60 సంవత్సరాల వయస్సు వారివరకు అద్భుతంగా ప్రదర్శించారు. ఈ ప్రతిభ ప్రపంచానికి తెలియాల్సిన అవసరం ఉంది. రాబోయే సంవత్సరం మరింత పెద్ద స్థాయిలో ఈ సంబరాలు నిర్వహిస్తాం. ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ. ధర్మవరం అంటే ఒక కుటుంబం, ధర్మవరం అంటే టాలెంట్ అనే విషయాన్ని రాష్ట్రానికి తెలియజేస్తాం. ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం వహించిన వాలంటీర్లు, మీడియా మిత్రులు, పోలీసులు, మున్సిపాలిటీ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు. పండగ రోజుల్లోనూ శ్రమించి గ్రౌండ్ శుభ్రంగా ఉంచిన మున్సిపల్ సిబ్బంది అభినందనీయం.

కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ గారు ఫోన్ చేసి, ధర్మవరానికి దేశంలో ఏకైక మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ మంజూరైందని తెలియజేశారు. ఇది చేనేత సోదరులకు గొప్ప వరం, చేనేత రంగ అభివృద్ధికి కీలక మలుపు, వేలాది చేనేత కుటుంబాలకు ఉపాధి అవకాశాలు, స్థానిక ఉపాధికి బలం చేకూర్చే విధంగా మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ అని పేర్కొన్నారు. అలాగే హరిత ధర్మవరం స్వచ్ఛ ధర్మవరం లక్ష్యంగా 10,000 చెట్లను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఏక్ పెడ్ మా కే నామ్ భావనతో ప్రతి ఒక్కరూ చెట్టు నాటి పరిరక్షించాలి. మీ అందరి ఆశీర్వాదాలతో అభివృద్ధి, సంక్షేమంలో ఎవరికి అన్యాయం జరగకుండా ధర్మవరాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం అని మంత్రి పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమంలో ప్రదర్శనలు చేసిన కళాకారులకు మంత్రి సత్య కుమార్ యాదవ్ మెమెంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు.

# కలికిరి ధ్యాన ఆశ్రమంలో సంక్రాంతి సంబరాలు

### - ధర్మవరం శ్రీకృష్ణ కోలాట బృందానికి ఘన సన్మానం



**ధర్మవరం జనవరి 16 ( మనసులో మాట)..** అన్నమయ్య జిల్లా కలికిరి నియోజకవర్గం కొట్టాల గ్రామంలోని పిరమిడ్ జేతవనం ధ్యాన ఆశ్రమంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలు జనవరి 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వైభవంగా జరిగాయి.



ఈ కార్యక్రమాల్లో భాగంగా శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన శ్రీకృష్ణ కోలాట బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బాబు కృష్ణ, అన్వేశ్వర్ బాబు ఆధ్వర్యంలో కోలాట బృందం మూడు రోజులపాటు అద్భుతమైన కోలాట ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించింది. ధర్మవరం కొత్తపేట బాయ్స్ హై స్కూల్‌లో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థులు శ్రీ చాణిక్య, శ్రావణ్, విష్ణువర్ధన్, ధర్మ తేజ, నిహాష్, వంశి, జయంత్, రాజ్ కుమార్, ప్రజ్వల్, మనోజ్‌లు తమ ప్రతిభతో సంక్రాంతి సంబరాలకు ప్రత్యేక శోభను చేకూర్చారు. ఈ సందర్భంగా కోలాట బృందాన్ని, వారి గురువులు అన్వేశ్వర్ బాబు, బాబు కృష్ణలను కలికిరి కొట్టాల పిరమిడ్ జేతవనం ధ్యాన ఆశ్రమ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. సంప్రదాయ కళలను ప్రోత్సహిస్తూ చిన్నారుల్లో సాంస్కృతిక విలువలు పెంపొందించడంలో ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడిందని నిర్వాహకులు తెలిపారు.

# బెహెన్ మాయావతి 70వ జన్మదినం

### అనంతపురంలో ఘనంగా 'జన్ కళ్యాణ్ కారి దివస్' - బీఎస్పీ బాల ప్రదర్శన మహిళల భాగస్వామ్యం విశేషం



**అనంతపురం, జనవరి 16 (మనసులో మాట)..** జాతీయ అధ్యక్షురాలు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి బెహెన్ కుమారి మాయావతి 70వ జన్మదినాన్ని పురస్కరించుకుని అనంతపురం నగరంలో జన్ కళ్యాణ్ కారి దివస్ కార్యక్రమాన్ని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఘనంగా నిర్వహించింది. అనంతపురం నగరంలోని టవర్ క్లాక్ సమీపంలో ఉన్న ఏపీ ఎన్‌జీవో హోమ్లో జరిగిన ఈ కార్యక్రమానికి బీఎస్పీ అనంతపురం జిల్లా అధ్యక్షులు కాసాని నాగరాజు అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో ఆర్.జె. మల్లికల్ (బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయలసీమ జోనల్ కన్వీనర్), చిందనూరు నాగరాజు (రాయలసీమ జోన్ కోఇంచార్జ్) ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర కార్యదర్శులు గద్దల నాగభూషణం, అంపావతిని గోవిందు, లక్ష్మి నారాయణ, హనుమన్న, శ్రీరాములు ప్రసంగించారు.అనంతపురం, శ్రీ సత్యసాయి, నంద్యాల, కర్నూలు, కడప, అన్నమయ్య జిల్లాల నుంచి బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. లక్నోలో జరిగిన బెహెన్ మాయావతి ప్రసంగాన్ని భారీ ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారంగా ప్రదర్శించారు. మహిళల పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం మిఠాయిలు పంచుకొని బెహెన్ మాయావతికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న బీఎస్పీ నాయకులు. ఇందీవర్, జిలాన్ భాష, కంచె గోపాల్, గవ్వల ఓబులేసు, నరేంద్ర బాబు, సాకె వినయ్, హేమ సుందర్, నాగరత్నమ్మ, రాఘవేంద్రమ్మ, బీబీ, శైలజ, నరసప్ప, విజయ్, రామాంజినేయులు, అనిల్, శీనా (అప్పాజీపేట), మల్లికార్జున, రాజు (తంబాలపల్లి), రాజు (రాయదుర్గం), గొల్ల నాగరాజు, పరశురామ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# సెలవులలో పిల్లలతో మొక్కలు నాటించండి

**పలమనేరు జనవరి 16( మనసులో మాట):** పలమనేరు పట్టణంలోని లక్ష్మీ నగర్ లోని ఓం శక్తి గుడి సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా పలమనేరు ప్రకృతి కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్ర పిల్లలతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ సెలవులలో పిల్లలతో ఒక మొక్క నాటించి దానీ సంరక్షణ బాధ్యతను అప్పగించాలని కోరారు. తద్వారా పిల్లలకు మొక్కలపై మమకారము పర్యావరణానికి ఉపకారం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలు భక్తులు పాల్గొన్నారు.

## హైకోర్టు లాయర్ గంగయ్య నాయుడు చేతుల మీదుగా

# బలిజ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**పలమనేరు జనవరి 16 ( మనసులో మాట):** ప్రముఖ హైకోర్టు న్యాయవాది గంగయ్య నాయుడు వారి స్వగృహమైన పలమనేరు పట్టణం సమీపంలోని గబ్బిళ్ళకోటూరు వారి నివాసం వద్ద బలిజ అభ్యుదయ సేవా సంఘం క్యాలెండర్ ను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మీరు అనుకున్న లక్ష్యాన్ని చేరేవరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వచ్చే సంవత్సరానికి మన సొంత బలిజ భవనంలో సమావేశం ఏర్పాటు చేసి అక్కడ అన్ని కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అందుకు ఇప్పటినుండే ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఆ భవనం పూర్తి చేయడానికి అందరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సుధాకర్, అధ్యక్షులు రూపేష్, పి జె సి బాబు, కిరణ్, సుబ్బ నాగయ్య, ముని రాజా, దైవప్రసాద్, సిద్దయ్య, కోటి, రఘునాథ్, గణేష్, సుదర్శన్ బాలాజీ, డాక్టర్ జనార్దన్, లక్ష్మీపతి, సుబ్రహ్మణ్యం, రవి, శివ, హేమంత్, వెంకటేశ్వర్లు,గంటవూర్ చంద్ర, శ్యామ్ కుమార్, బలిజ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కనుమ సంబరాలు

### - కెలవాతిలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అమర్



**పలమనేరు జనవరి 16 ( మనసులో మాట) :** సంక్రాంతి పండుగలో భాగంగా మూడోవ రోజైన కనుమ పండుగ సంబరాలు పలమనేరులో శుక్రవారం ఘనంగా జరిగాయి. పెద్ద పంజాణి మండలంలోని తమ స్వగ్రామం కెలవాతిలో జరిగిన కనుమ పండుగ వేడుకల్లో స్థానిక శాసన సభ్యులు అమరనాథ రెడ్డి తమ కుటుంబీకులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోవులకు పూజలు నిర్వహించి వేడుకున్నారు. అనంతరం గ్రామ నడిబొడ్డులోని ఆలయం వద్ద జరిగిన సామూహిక పూజల్లో గ్రామస్థులతో కలసి పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా గ్రామానికి చెందిన రైతులు తమ పశువులను వివిధ ప్రభలతో అలంకరించి ఊరెగించగా గ్రామస్థులతో కలసి తిలకించారు. ఈ వేడుకల్లో పలువురు కూటమి నాయకులు సైతం పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతి


### కేసు నమోదు చేసిన రూరల్ ఎస్సై రాజశేఖర్



**ధర్మవరం జనవరి 16 (మనసులో మాట)..** పట్టణములోని దుర్గా నగరకు చెందిన సాయికిరణ్, స్నేహితుడు యోగానంద అను ఇరువురు గురువారం ద్విచక్ర వాహనంలో కునుతురు గ్రామానికి పేడ తేవడానికి వెళ్లారు. ఆ గ్రామ సమీపము లో మలుపు వద్ద అతివేగంతో పోవడం వలన ద్విచక్ర వాహనమును అదుపు చేయలేక వారు ఒక విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టారు. డ్రైవింగ్ చేస్తున్న యోగానందకు, వెనుక వైపున కూర్చున్న సాయి కిరణ్ కు బలమైన గాయాలు కావడంతో, అప్పుడే ఆ రోడ్డు మార్గం వస్తున్న కారు యజమాని గమనించి వెనువెంటనే ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇందులో సాయికిరణ్ (21) ను వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మరి యోగానంద్ కు ప్రాథమిక చికిత్సలు అందించి ఇంటికి పంపించేశారు. మృతి చెందిన సాయి కిరణ్ డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడని తల్లి తెలిపింది. తదుపరి రూరల్ ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# కన్యాకుమారిలో రోడ్డు ప్రమాదం

## లక్షెట్టిపేటకు చెందిన దంపుతల దుర్మరణం



**మంచిర్యాల, జనవరి 16:** తమిళనాడులోని కన్యాకుమారి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన దంపతులు మరణించారు. అయ్యప్ప మాల ధరించిన వారు.. శబరిమలకు వెళ్లొస్తుండగా ఈ దారుణం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చెందిన పాలకుర్తి సత్యనారాయణ (63), రమాదేవి (59) జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నారు. ఇటీవల అయ్యప్ప మాల ధరించిన ఈ దంపతులు జనవరి 8వ తేదీన ఓ ప్రైవేటు సర్వీస్‌లో శబరిమల దర్శనానికి వెళ్లారు. జనవరి 15వ తేదీన మకర సంక్రాంతి రోజున అయ్యప్ప స్వామి దర్శనం చేసుకుని తిరిగి బయల్దేరారు. ఈ క్రమంలో కన్యాకుమారి సమీపంలో బైపాస్ రోడ్డులో బస్సును ఆపారు. అక్కడ సముద్ర స్నానం చేసుకుని దేవాలయాలు సందర్శించుకుని బస్సు దగ్గరకు వస్తుండగా వారికి ఓ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతదేహాలను కన్యాకుమారి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కన్యాకుమారి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



# రాష్ట్ర అభివృద్ధి కోసమే నా ఆరాటం

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ మంజూరు



- బాసర ఐఐటీలో క్యాంపస్ ఏర్పాటు చేస్తాం
- నిర్మల్ జిల్లాకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు
- ఆదిలాబాద్ విమానాశ్రాయానికి ప్రధానితో శంకుస్థాపన
- పనుల కోసమే ప్రధాని మోడీతో భేటీ అవుతూనే ఉంటా
- తుమ్మడిహట్టి వద్ద ప్రాజెక్ట్ కట్టి తీరుతాం
- కేసీఆర్ అప్పులతో తెలంగాణ కుప్పయ్యింది
- అభివృద్ధి కోసం ఆశీర్వదించండి..మున్సిపల్ ఎన్నికల్లోనూ ఆదరించండి
- నిర్మల్ సభలో సీఎం రేవంత్

**ఆదిలాబాద్/నిర్మల్, జనవరి 1:** పాలమూరు జిల్లాతో సమానాంగా ఆదిలాబాద్ జిల్లాకు నిధులు మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల అనంతరం నిర్మల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. నిర్మల్ ప్రజలు ఇచ్చిన భరోసా, మద్దతు వల్లే సీఎం అయ్యాను. ఆదిలాబాద్ జిల్లా పోరాటానికి, పౌరుషానికి గడ్డ అంటూ.. జల్, జంగల్, జమీన్ అంటూ కుమురం భీం కొట్లాడారని అన్నారు. ఈ జిల్లాలో జరగాల్సినంత అభివృద్ధి జరగలేదు. బాసర ట్రిపుల్ ఐటీలోనే యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం. జిల్లాలోని ప్రజాప్రతినిధులంతా ఇందుకు సహకరించాలి. పారిశ్రామికంగానూ ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేస్తాం. జిల్లాకు ఎయిర్ బస్ తీసుకొస్తాం. ఎయిర్‌పోర్టు కోసం 10వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందన్నారు. విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిద్దాం. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టాల్సిందే.. ఆదిలాబాద్ జిల్లాకు నీరు ఇవ్వాల్సిందే. ప్రతి 3 నెలలకు ఒకసారి ప్రధాని వద్దకు వెళు_న్నాం. ఆయనకు ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చి.. అడగాల్సిన ప్రాజెక్టులు అడుగుతున్నాం. మోదీని పదే పదే కలుస్తున్నానని కొంత మంది విమర్శిస్తున్నారు. రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు ఎవరు ఇస్తారు.. ప్రధాని కాదా? ప్రధానిని కలవకపోతే నిధులు, ప్రాజెక్టులు ఎలా వస్తాయి. పదేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వాన్ని గత ప్రభుత్వం అడగలేదు. అడగకపోతే రాష్ట్రానికి ఏం కావాలో కేంద్రానికి ఎలా తెలుస్తుంది. పైరవీలు చేయను.. పర్సనల్ ఎంజెడా లేదు.. రాష్ట్ర అభివృద్ధి కోసం, నిధుల కోసం.. ప్రధాని మోదీ, అమిత్ షా సహా ఎవరినైనా కలుస్తానని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు.. ఆ తర్వాత అభివృద్ధే అందరి లక్ష్యం. పదేళ్లు అధికారంలో ఉన్న వారు ఈ ఆలోచన చేయకపోవడం వల్లే.. తెలంగాణకు తీరని నష్టం జరిగిందని పరోక్షంగా కెసిఆర్ తీరుపై మండిపడ్డారు.. రాష్ట్ర భాజపా నేతలు కూడా ప్రధాని మోదీని కలిసి రాష్ట్రానికి ప్రాజెక్టులు, నిధులు తేవాలి. నిర్మల్ జిల్లాకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు చేస్తున్నాం. నాగోబా జాతరకు రూ.22కోట్లు మంజూరు చేసి అభివృద్ధి చేస్తాం. సమ్మక్క-సారలమ్మ జాతరకు రూ.300 కోట్లు కేటాయించి పునర్నిర్మాణం చేశాం. ప్రపంచ పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామంగా మారిందన్నారు. పెట్టుబడుల కోసం మేం ప్రయత్నిస్తుంటే.. స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పదేళ్ల అధికారాన్ని అనుభవించి రూ.8లక్షల కోట్లు అప్పు చేశారు.. రూ. వేల కోట్లు దోపిడీ చేశారని కెసిఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. భూసేకరణ కు నిధులు మంజూరు చేసి ప్రాజెక్టులు పూర్తి చేసుకున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు వర్శిటీ లేదని.. ఈ ప్రాంతానికి వర్సిటీ మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. త్వరలో వర్సిటీ మంజూరు అవుతుందన్నారు. బాసర వర్సిటీ ఏర్పాటు చేసుకుంటున్నామని.. దానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఆదిలాబాద్ వర్సిటీ బాసరలో ఏర్పాటు చేస్తున్నామని.. ఉమ్మడి జిల్లా కు కావాల్సిన నిధులను బ్జడెట్ లో ప్రవేశ పెట్టుతామన్నారు.. తుమ్మడి హెట్టీ వద్ద ప్రాణహిత చేవెళ్ల పై నివేదిక తయారు చేస్తున్నామని.. తుమ్మడి హెట్టీ వద్ద ప్రాజెక్టు కట్టి తీరుతామని స్పష్టం చేశారు. ఆదిలాబాద్‌కు ఎయిర్ పోర్ట్ తీసుకొచ్చే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. మోడీ చేతుల మీదుగా ఆదిలాబాద్ ఎయిర్ పోర్టు శిలాఫలకం వేయిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికలు వచ్చాక రాజకీయం.. ఎన్నికల తర్వాత అభివృద్ధికి కలిసి నడుద్దామన్నారు. ప్రతి మూడు నెలలకు సారి కేంద్రాన్ని కలుస్తాం.. మీరు సైతం నా దగ్గరకు రండి.. సాధ్యం అయినంత పనులు చేస్తామని ప్రతిపక్ష నేతలకు సీఎం తెలిపారు. మోడీ నాకు చుట్టం కాదు దేశానికి ప్రధాని కాబట్టి మన ప్రాంతం అభివృద్ధి కావాలి కాబట్టి మోడీని కలుస్తున్నానని చెప్పారు. ప్రాంత అభివృద్ధి కోసం ఎవ్వైర్నినా కలుస్తా. పైరవీలు లేవు, పర్సనల్ పనులు నాకు లేవని సీఎం స్పష్టం చేశారు. కేంద్రం వరంగల్ ఎయిర్ పోర్టు వచ్చింది. ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ ఇస్తాం అని చెప్పినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'వెయ్యికోట్ల భూమి మహిళలకు కేటాయించాం..రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితి వల్ల క్రమక్రమంగా అభివృద్ధి చేసుకుందాం.. రాష్ట్ర ప్రజలు అండగా నిలవండి, దేశంలోనే నంబర్ వన్ రాష్టాన్ని తీర్చిదిద్దుతా.. త్వరలో మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయి? ప్రజా ప్రభుత్వంతో కలిసి పని చేసే వారిని గెలిపించండి.. కేవలం ఎన్నికల అప్పుడే రాజకీయాలు, అభివృద్ధికి అందరం ఒకటే..' అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# మూడు సర్వేలు.. వాటిలో గెలిస్తేనే సీటు!

## కరీంనగర్ ఎంఐఎం టికెట్ల కోసం భారీ పోటీ

- 40 డివిజన్లకు 140 మంది ఆశావాహుల దరఖాస్తు
- పైరవీలు పనిచేయవు.. దళారులను నమ్మొద్దు: నగర అధ్యక్షుడు గులాం అహ్మద్

**కరీంనగర్, జనవరి 16 (మనసులో మాట):**

కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేయడమే లక్ష్యంగా మజ్లిస్ (ఎంఐఎం) పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. టికెట్ల కేటాయింపులో సిఫార్సులకు, పైరవీలకు తావులేదని, ప్రజాబలం ఉండి సర్వేల్లో నెగ్గినవారికే టికెట్లు దక్కుతాయని ఆ పార్టీ స్పష్టం చేసింది. శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు కఠిన నిబంధనలను ప్రకటించారు. పార్టీ నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.. టికెట్ల కేటాయింపు ప్రక్రియలో



పార్టీ అధిష్ఠానం (హైకమాండ్) అత్యంత పకడ్బందీగా వ్యవహరిస్తోందన్నారు.

### అభ్యర్థుల వడపోత ఇలా..

దరఖాస్తు చేసుకున్న వారిపై మూడు వేర్వేరు సర్వేలు నిర్వహిస్తారు. ప్రజల్లో ఎవరికి మంచి పేరుంది? ఎవరు గెలుపు గుర్రాలు? అనే అంశాల ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. సర్వే నివేదికల ఆధారంగా పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ నిర్ణయించిన వారికే 'బీ-ఫారం' అందుతుంది.

### భారీ పోటీ.. కఠిన హెచ్చరికలు

నగరంలోని 40 డివిజన్లకు గాను ఏకంగా 140 మంది ఆశావాహులు పోటీ పడుతుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో, టికెట్లు ఇప్పిస్తామంటూ ఎవరైనా డబ్బులు అడిగితే మోసపోవద్దని, అలాంటి వారిని నమ్మవద్దని హెచ్చరించారు. ఒక డివిజన్ నుంచి ఎంతమంది పోటీపడినా, టికెట్ దక్కని వారు పార్టీ నిర్ణయానికి కట్టుబడి, అధికారిక అభ్యర్థి గెలుపు కోసం పని చేయాల్సిందేనని స్పష్టం చేశారు. పార్టీ గీత దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు.

### 20 గడువు

పోటీ చేయాలనుకునే వారు 'ఏఐఎంఐఎం దారుసలాం హైదరాబాద్' పేరున రూ. 3,000 డీడీ తీసి, దరఖాస్తులను ఈనెల 20వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు పార్టీ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, నాయకులు బర్కత్ అలీ, సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి, ఇబ్రహీం, అఖీల్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.



# ఇదే లాస్ట్‌చాన్స్!

## లేకుంటే మేమే నిర్ణయం తీసుకుంటాం

## అసెంబ్లీ స్పీకర్‌కు సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ, జనవరి 16:** బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై సుప్రీం కోర్టులో విచారణ వాయిదా పడింది. రెండు వారాల తరువాత ముగ్గురు ఎమ్మెల్యేల అనర్హతపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేపట్టిన పక్రియపై అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. అయితే 4వారాల సమయం కావాలని స్పీకర్ తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి న్యాయస్థానాన్ని కోరారు. ఈ కేసులో పురోగతిని పరిశీలించి అవసరమైతే మరో రెండు వారాల గడువు పెంచుతామని ధర్మాసనం స్పష్టం చేసింది. శుక్రవారం ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై సు ప్రీం కోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరో ల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌ల ధర్మాసనం ముందు ఈ కేసు విచారణకు వచ్చింది. బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన 10మంది ఎమ్మెల్యేలలో ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేల అనర్హతపై తెలంగాణ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని.. మిగతా ముగ్గురు ఎమ్మెల్యేలపై నిర్ణయానికి కొంత సమయం కావాలని స్పీకర్ తరఫు న్యాయవాది కోరారు. స్పీకర్‌కు కంటి శస్త్ర చికిత్స జరగడంతో ఆస్పత్రిలో ఉన్నారని, కొత్త అసెంబ్లీ సెక్రటరీ జనరల్ వచ్చినందున పక్రియ ఆలస్యమైందని న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వి కోర్టుకు నివేదించారు. ఇప్పటివరకు స్పీకర్ తీసుకున్న నిర్ణయాలను నివేదిక రూపంలో ఆయన కోర్టుకు సమర్పించారు. మిగతా ముగ్గురు సభ్యులపై నిర్ణయం తీసుకునేందుకు నాలుగు వారాల సమయం కావాలని ధర్మాసనానికి స్పీకర్ తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. త ఏడాదిగా ఇదే చెబుతున్నారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గతంలో మూడు నెలల్లోనే ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించినా పట్టించుకోలేదని పాడి కౌశిక్ రెడ్డి తరఫు న్యాయవాది శేషాద్రి నాయుడు న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ఏడుగురు ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని, మిగిలిన ముగ్గురిపై నిర్ణయం తీసుకునేందుకు సమయం కావాలని స్పీకర్ తరఫు న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వి కోర్టును కోరారు. అయితే రెండు వారాలు సమయం ఇస్తున్నామని.. రెండు వారాల్లో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నారో కోర్టుకు చెప్పాలని ధర్మాసనం ఆదేశించింది. ఆ తరువాత అవసరం అయితే మరో రెండు వారాలు సమయం ఇస్తామని సుప్రీం కోర్టు ధర్మాసనం చెబుతూ.. తదుపరి విచారణను వాయిదా వేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై విచారణ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ తరఫున అభిషేక్ సింఘ్వి వాదనలు వినిపించారు. ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై స్పీకర్ నిర్ణయం ప్రకటించారని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ మసీహ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. స్పీకర్ తీసుకున్న చర్యలపై ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వి నివేదిక అందించారు.

# సికింద్రాబాద్ అస్తిత్వాన్ని దెబ్బతీస్తే ఊరుకోం

- హామీలు మరిచి పేర్లు మారుస్తున్న తుగ్లక్ ప్రభుత్వం
- కేటీఆర్ ముఖ్య అతిథిగా భారీ శాంతి ర్యాలీ
- పిలుపునిచ్చిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్, జనవరి 16 (మనసులో మాట):**

ఎన్నికల హామీలను గాలికొదిలేసి, ఊర్లు, పేర్లు మారుస్తామంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం తుగ్లక్ పాలన సాగిస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. శుక్రవారం వెస్ట్ మారేడ్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 220 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన సికింద్రాబాద్ అస్తిత్వాన్ని దెబ్బతీసే కుట్రలను సాగనివ్వబోమని స్పష్టం చేశారు. సికింద్రాబాద్ ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి, ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్ సాధన కోసం ఈ నెల 17న (శనివారం) భారీ శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తలసాని తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి క్లాక్ టవర్, ప్యాట్నీ, ప్యారడైజ్ మీదుగా ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహం వరకు ఈ ర్యాలీ సాగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు.




ఇక్కడ పుట్టి పెరిగిన వారు, ప్రజలు, వ్యాపారులు ఇల్లొకరు చొప్పున తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సాదం బాలరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# రైతుల పంటలకు గిట్టుబాటు ధరల కల్పన

## వానాకాలం సీజన్‌లో కందుల కొనుగోళ్లు

## లాభదాయక ధర కల్పించడమే తమ లక్ష్యం

## వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మం, జనవరి16:** రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం కోసం తమ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. వానాకాలం 2025-2026 సీజన్‌లో కందుల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. శుక్రవారం.. ఖమ్మం జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటించిన ఆయన.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రైతులకు లాభదాయక ధర కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం, టీజీ మార్క్‌ఫెడ్ సమన్వయంతో ఓ-ఉూఖ కొనుగోళ్లు ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,99,393 ఎకరాల్లో కందులు సాగవుతున్నాయని పేర్కొన్నారు మంత్రి తుమ్మల. వాస్తవానికి సుమారు 2,99,635 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేశామని తుమ్మల తెలిపారు. ఈ లెక్కన క్వింటాల్‌కు రూ. 8,000 ఓ-ఉూఖ నిర్ణయించామన్నారు. అయితే.. ప్రస్తుతం మార్కెట్ ధర రూ. 7,200 వరకు మాత్రమే ఉందని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 1,71,310 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతి ఇచ్చిందని వివరించారు. 2025 డిసెంబర్ 27 నుంచి 2026 మార్చి 26 వరకు కొనుగోళ్లు జరుగుతాయని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 82 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించామని తెలిపారు. ఇప్పటికే 13 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు వివరించారు. జనవరి 16 నాటికి 32 మంది రైతుల నుంచి 30.25 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరుగుతాయనే అంచనా వేశామని వెల్లడించారాయన.వీటి మొత్తం విలువ రూ. 0.24 కోట్లు ఉంటుందని అంచనా వేశామని పేర్కొన్నారు మంత్రి. నారాయణపేట జిల్లాలో కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఆయా పంటల రాకల ఆధారంగా ఇతర జిల్లాల్లోనూ దశలవారీగా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అన్నదాతలు మధ్యవర్తులకు పంటను అమ్మొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. టీజీ మార్క్‌ఫెడ్ కేంద్రాలకు మాత్రమే పంటను తీసుకు రావాలని సూచించారు. కొనుగోలు మొత్తాన్ని డీబీటీ ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో జమచేయాలని అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తుమ్మల నాగేశ్వరరావు భరోసానిచ్చారు.

# వేములవాడ అభివృద్ధికి శ్రీకారం

## రాజన్న ఆలయ సందర్శనలో మంత్రి సీతక్క



**వేములవాడ, జనవరి 16:** వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. రాజన్న అనుబంధ భీమేశ్వర ఆలయంలో స్వామి వారిని మంత్రి శుక్రవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి మీడియాతో మంత్రి మాట్లాడారు. వేములవాడలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఆలయాల అభివృద్ధి.. భావోద్వేగాలు, ఆచారాలతో ముడిపడి ఉంది. ఈనెల 18న మేడారంలో క్యాబినెట్ భేటీ జరుగుతుంది. 19న మేడారం ఆలయాన్ని సీఎం పునఃప్రారంభిస్తారు. పుష్కరాల దృష్ట్యా గోదావరి పరివాహక ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సీతక్క తెలిపారు. కేసీఆర్ హయాంలో వేములవాడ రాజన్న ఆలయాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ జంక్షన్ అభివృద్ధికి శుక్రవారం శంకుస్థాపన చేశారు.

# తల్లి అంత్యక్రియల్లో పాల్గొననున్న ఇన్నయ్య

## తాత్కాలిక బెయిల్ మంజూరు చేసిన కోర్టు

**జనగామ, జనవరి 16:** యూపీఏ చట్టం కింద ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేసిన సామాజిక కార్యకర్త గాదె ఇన్నయ్యకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. శుక్రవారం ఆయనకు షరతులతో కూడిన 48 గంటల తాత్కాలిక బెయిల్‌ను కోర్టు మంజూరు చేసింది. గాదె ఇన్నయ్య తల్లి థెరీసా (93) గురువారం రాత్రి మరణించారు. ఈ నేపథ్యంలో ఆయనకు కోర్టు ఈ బెయిల్ మంజూరు చేసింది. శనివారం జనగామ జిల్లాలోని జాఫర్‌గఢ్ మండలం సాగరంలో ఆయన తల్లి అంత్యక్రియలు జరగనున్నాయి. అందులో గాదె ఇన్నయ్య పాల్గొనున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో వరుసగా ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత కాటా రామచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ మరణించారు. ఆయన అంత్యక్రియలకు మావోయిస్టు మాజీ నేత గాదె ఇన్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా మావోయిస్టులకు అనుకూలంగా ఆయన వ్యాఖ్యలు చేయడం ద్వారా ప్రజలను.. ప్రేరేపించారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ఉపా చట్టం కింద ఆయనపై ఎన్ఐఏ కేసు నమోదు చేసింది. ఆ క్రమంలో డిసెంబర్ 21న ఇన్నయ్యను ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ప్రస్తుతం ఆయన అక్కడే ఉన్నారు. మంగళవారం జనగామ జిల్లా జాఫర్‌గఢ్ మండల కేంద్రంలో గాదె ఇన్నయ్య నిర్వహిస్తున్న అనాథాశ్రమంలో ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించిన విషయం విదితమే.

# మెట్రో రెండోదశకు కేంద్రం సుముఖం



- ఎల్అండ్‌టీ నుంచి టేకోవర్ లావాదేవీలు పూర్తి చేయండి
- రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి ఇద్దరేసి సభ్యులతో కమిటీ
- సీఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ

**హైదరాబాద్, జనవరి 16:** హైదరాబాద్ మెట్రో రెండో దశ కోసం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ని కలిసి చర్చించానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు. ముందుగా మెట్రో మొదటి దశను ఎల్అండ్‌టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసుకోవాలని, అందుకు అన్ని ఒప్పందాలు, నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతి గురించి ప్రస్తావించారు. అలాగే హైదరాబాద్ నగరంలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంలో భాగంగా నగరంలో మెట్రో రెండో దశ పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరిందని గుర్తుచేశారు. ఇప్పటికే అమలు జరుగుతున్న మొదటి దశ మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, తామే నిర్వహిస్తామని ప్రకటించిందని ప్రస్తావించారు. లావాదేవీలు పూర్తయిన తర్వాత రెండో దశ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి అంగీకరించిందని కూడా కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ గుర్తు చేశారని అన్నారు. మెట్రో మొదటి దశను రాష్ట్ర ప్రభుత్వం ఎల్ అండ్ టీ నుంచి తీసుకోవడం, రెండో దశకు సన్నాహాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సంయుక్తంగా కమిటీ ఏర్పాటు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నిర్ణయించారని కూడా కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తనకు తెలిపారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు, కేంద్ర ప్రభుత్వం తరఫున మరో ఇద్దరు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకోసం రాష్ట ప్రభుత్వం తరఫున ఇద్దరు అధికారుల పేర్లను పంపాలని కోరినట్లు కూడా వివరించారు. కానీ, ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను ఎందుకు ప్రతిపాదించలేదని ప్రశ్నించారు. కావున సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఇద్దరు అధికారుల పేర్లను పంపి సమావేశ నిర్వహణకు ప్రయత్నం చేయాలని సూచించారు. అదేవిధంగా, వేగవంతంగా ఎల్ అండ్ టీ నుంచి మెట్రో నెట్‌వర్క్‌ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ఆ తర్వాత మెట్రో రెండో దశ నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కిషన్‌రెడ్డి కోరారు.

# మళ్లీ ఇందూరుగా మార్చి తీరుతాం

- నిజామాబాద్‌లో కాషాయ జెండా ఎగరేస్తాం
- రాముడికి బీజేపీ సభ్యత్వం ఉందంటూ ఎంపీ ధర్మపురి అరవింద్ వ్యాఖ్య




**నిజామాబాద్, జనవరి 16:** నిజామాబాద్‌ని ఇందూర్‌గా పేర్కొన్న ఎంపీ ధర్మపురి అరవింద్ ఆ పేరు ఎలా వచ్చిందో చారిత్రిక ఆధారాలు ఉన్నాయన్నారు. మీడియాలో మాట్లాడిన ఎంపీ ధర్మపురి అరవింద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిజాం ఒక హంతకుడు.. నిజామాబాద్‌కి ఆయన పేరు ఎందుకు పెట్టుకుంటారన్నారు. ఇందూర్‌గా పేరు మార్చి ఆ తీర్మానాన్ని ఏబీవీపీ నుంచి వచ్చిన రేవంత్‌రెడ్డికి పంపిస్తామన్నారు. శ్రీరాముడికి బీజేపీ మెంబర్ షిప్ ఉందని అనుమానం ఉంటే వెళ్లి చూసుకోవాలని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌కు తెలిపారు. ముస్లిం అంటే కాంగ్రెస్ అంటున్నారు.. మీ పార్టీకి సున్తీ అయిందా పోయి చూసుకోవాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పహల్గాంలో హిందువులా? ముస్లింలా? అని చూసి కాల్చి చంపారని గుర్తు చేశారు. శ్రీరాముడికి బీజేపీ మెంబర్ షిప్ ఉందని అన్నారు. కొంత మంది హిందువుల్లో చెడ పుట్టారన్నారు. తెలంగాణ మొత్తం కాషాయమయం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ఎక్కడుందో కవితను అడిగితే చెబుతుందన్నారు.. రేపు సిరిసిల్లలో కూడా చూపిస్తామన్నారు. ఇందూర్‌కి దమ్ముంటే రా అని కేటీఆర్‌కి సవాల్ విసిరారు. చెన్నారెడ్డి సీఎంగా రాజీనామా చేసే వరకు రాష్ట్రంలో మత ఘర్షణలు జరిగాయని ఎంపీ అరవింద్ తెలిపారు. గొడవలకు కారణం కాంగ్రెస్.. అప్పట్లో సత్తయ్య ఏసీపీని చంపితే ఆ నిందితులను బయటకు తెచ్చింది మజ్లిస్.. తిన్న తిండి అరగక హిందూ దేవాలయాల మీద పడుతున్నారు.. దీనికి కారణం రేవంత్ రెడ్డి.. ఇచ్చేది దొంగ వాగ్దానాలు.. హిందూ దేవుళ్ళ మీద ఓట్లు.. గులాంలుగా మారి పోయి హిందువులను తాకట్టు పెడుతున్నారు.. నూటికి నూరు శాతం ఇందూర్ కార్పొరేషన్‌పై బీజేపీ జెండా ఎగురవేస్తాం.. నిజామాబాద్ పేరును ఇందూర్‌గా మారుస్తాం? తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తాం.. నిజాంను ఒకే సారి నేను గాడిద అని ఒక్కసారి అంటే దానిపై రాద్ధాంతం చేస్తున్నారు.. నిజాం చరిత్రలో దుర్మార్గమైన రాజు గానే మిగిలి పోతారు.. ఆయన పేరు చెబితే హిందువులకు గుర్తుకు వచ్చేది అయన చేసిన మారణకాండనే.. ముస్లింలకు అవాస్ యోజన కింద ఇల్లు, ఫ్రీ రేషన్, ఫ్రీ వ్యాక్సినేషన్ మోడీ ఇస్తున్నారు.. ముస్లిం దేశాలకు కూడా వ్యాక్సిన్ పంపించారు.. మీ పిల్లలకు విద్యా, వైద్యం ఇస్తుంది.. నిజాం అంత వెనుకోసుకొస్తున్నా.. రేవంత్ రెడ్డి ఏం చేశారని ఓట్లు వేస్తున్నారు.. ఇన్ని చేసినా మోడీకి ఎందుకు వేయడం లేదు.. ఇదేనా మీ ఇమాందారీ.. అని ఎంపీ వ్యాఖ్యానించారు.

# లక్ష్యం మేరకు ఉద్యోగాల కల్పన

## ఇప్పటికే 70వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

## గ్రూప్- 3కి ఎంపికైన 1,370 మందికి

## నియామక పత్రాలు అందించిన సీఎం రేవంత్




**హైదరాబాద్, జనవరి 16:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రాణ త్యాగాలతో సాధించుకున్నామని.. కానీ బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగుల ఆశలు నెరవేరలేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నిరుద్యోగుల జీవితాలతో బీఆర్ఎస్ పాలకులు ఆడుకున్నారని మండిపడ్డారు. ఈ పాలనలో వారు.. వారి స్వప్రయోజనాలే చూసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో ఓపిక నశించిన యువత.. కేసీఆర్‌ను ఇంటికే పరిమితం చేశారని వ్యంగ్యంగా పేర్కొన్నారు. శుక్రవారం శిల్పకళా వేదికలో కొలువుల పండగ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి.. గ్రూప్- 3కి ఎంపికైన 1,370 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలకుల ఉద్యోగాలు పోతేనే మీకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతున్నారని చెప్పారు. ఉద్యోగాలు ఇవ్వకూడదని కోర్టుల్లో కేసులూ వేశారన్నారు. అన్ని అవరోధాలు అధిగమించి ఉద్యోగాలు ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్ 1 నియమకాలు చేపట్టలేదన్నారు. తాము వచ్చాక తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేశామన్నారు. యూపీఎస్సీ తరహాలోనే టీజీపీఎస్సీని సంస్కరించామని తెలిపారు. ఇప్పటి వరకు 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని వివరించారు. గతంలో అర్హత లేనివారికి టీజీపీఎస్సీలో కీలక ఉద్యోగాలు ఇచ్చారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై సీఎం రేవంత్ నిప్పులు చేశారు. రాబోయే రోజుల్లో అన్ని ఉద్యోగ నియామకాలు పూర్తి చేస్తా.. రాజకీయపార్టీల చేతుల్లో ఆయుధాలుగా మారొద్దు. ఎవరూ మనకు చెప్పాల్సిన అవసరం లేదు.. నాకు సంపూర్ణ అవగాహన ఉంది. ప్రభుత్వంలోనే కాదు.. ప్రవేటు రంగంలో కూడా రూ.లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చి ప్రపంచంతోనే పోటీ పడే విధంగా యువతను తీర్చి దిద్దే బాధ్యత నాదని సీఎం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి తదిరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో తొలిసారిగా హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్

## పరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభించిన మంత్రి జూపల్లి




**హైదరాబాద్, జనవరి 16:** తెలంగాణలో తొలిసారిగా హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్ వేదికగా శుక్రవారం నుంచి 3 రోజుల పాటు ఈ షో జరుగనుంది. మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ హాట్ ఎయిర్ బెలూన్ షోను ప్రారంభించారు. ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకున్న 300 మంది సందర్శకులకు హాట్ ఎయిర్ బెలూన్లలో రైడ్‌కు అనుమతి ఇవ్వనున్నారు. అలాగే సాధారణ ప్రేక్షకులకు నైట్ గ్లో షో ఓపెన్‌గా ఉండనుంది. హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ టికెట్‌ను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసుకునే అవకాశం ఉంది. వయస్సు, రైడ్ రకాన్ని బట్టి ధరలు రూ.500 నుంచి రూ.1500 వరకు ఉండనున్నాయి. ఉూగా.. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి సందర్భంగా జనవరి 13 నుంచి 15 వరకు ఇంటర్నేషనల్ కైట్ / స్వీట్స్ ఫెస్టివల్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. పెద్ద సంఖ్యలో సందర్శకులు కైట్ ఫెస్టివల్‌లో పాలుపంచుకున్నారు. అలాగే జనవరి 16, 17 తేదీల్లో గచ్చిబౌలి స్టేడియంలో డ్రోన్ ఫెస్టివల్, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జనవరి 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇది హైదరాబాద్‌లో తొలి హాట్ ఎయిర్ బెలూన్ ఈవెంట్‌గా రికార్డు సృష్టిస్తోంది. పరేడ్ గ్రౌండ్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రంగురంగుల బెలూన్లు ఆకాశంలో కనువిందు చేయనున్నాయి.

# అక్రమ క్రషర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

## ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన మాజీ ప్రజాప్రతినిధి

**లారీలను అడ్డుకుని రాంపూర్ గ్రామస్తుల ఆందోళన**

**రామాలయం నిర్మించకపోతే ఉద్యమిస్తామని సర్పంచ్ సంగమేశ్వర్ హెచ్చరిక**





**కొల్చారం, జనవరి 16 (మనసులో మాట):**

కొల్చారం మండలంలో నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా నడుస్తున్న క్రషర్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని రాంపూర్ గ్రామ సర్పంచ్ నెల్లి సంగమేశ్వర్, గ్రామస్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు క్రషర్ వద్దకు చేరుకుని, కంకర లోడుతో వెళ్తున్న లారీలను అడ్డుకొని ఆందోళన చేపట్టారు.

ఈ సందర్భంగా సర్పంచ్ సంగమేశ్వర్ మాట్లాడుతూ.. పదేళ్ల క్రితం గ్రామస్తుల వ్యతిరేకత నడుమ, ఒక ప్రజాప్రతినిధి సహకారంతో ఈ క్రషర్లను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. క్రషర్లలో జరుగుతున్న పేలుళ్ల (బ్లాస్టింగ్) కారణంగా ఇందిరా కాలనీతో పాటు రాంపూర్ గ్రామంలోని అనేక ఇళ్లు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

### ప్రభుత్వ భూమి కబ్జా

క్రషర్ యజమానితో కుమ్మక్కై ఒక మాజీ ప్రజాప్రతినిధి సుమారు పది ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు రెండు కుంటలను కబ్జా చేశారని సర్పంచ్ ఆరోపించారు. అనుమతికి మించి ప్రభుత్వ స్థలంలో క్రషర్ సామాగ్రిని నిల్వ చేశారని మండిపడ్డారు. గ్రామాభివృద్ధికి సహకరించమని కోరినా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు.

### రామాలయం హామీ ఏమైంది?

గ్రామంలో మూడేళ్లలో రామాలయం నిర్మిస్తామని ప్రజలకు ఇచ్చిన మాటను క్రషర్ యాజమాన్యం తుంగలో తొక్కిందని సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే గుడి నిర్మాణం పూర్తి చేయాలని, కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామస్తులందరితో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీశైలం, పోచయ్య, గోవర్ధన్ రెడ్డి, వార్డు సభ్యులు రాందాస్, సోమశేఖర్, మధు, రవి, గుండారం శ్రీనివాస్, వెంకటేశం, ఆకుల రాజు, గంగరాజు, జంగిటి రాజు, పవన్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీపూర్‌లో రంగురంగుల ముగ్గుల పోటీలు

**ముదిరాజ్ లయన్స్ యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు - ప్రథమ బహుమతి గెలుచుకున్న ఆకుల అఖిల**



**గొల్లపల్లి, జనవరి 16 (మనసులో మాట):**

మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ లయన్స్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొని ఇంటి ముందు రంగురంగుల ముగ్గులతో సందడి చేశారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆకుల అఖిల ప్రథమ బహుమతిని కైవసం చేసుకోగా, మ్యాట్నీ కార్తీక ద్వితీయ బహుమతి, ఆకుల అరణ్య తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. విజేతలకు వార్డు సభ్యులు మ్యాట్నీ తిరుపతి, తూడి మధు సహకారంతో బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మాజీ ఎంపీటీసీ సభ్యులు గోవిందుల లావణ్య, జలపతి, మ్యాడవరం నాగభూషణం, కాసెట్టి లక్ష్మణ్, ఆకుల గంగయ్య వ్యవహరించారు. విజేతలను ఎంపిక చేయడంలో వారు కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంగెం రజిత తిరుపతి, వార్డు సభ్యులు కాసెట్టి తిరుపతి, ముదిరాజ్ లయన్స్ యూత్ సభ్యులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి

**తుక్కాపూర్ ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన హౌసింగ్ పీడీ**

**అధికారిని సన్మానించిన సర్పంచ్ ఆంజనేయులు**



**కొల్చారం, జనవరి 16 (మనసులో మాట):**

కొల్చారం మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) మాణిక్యం శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న 9 ఇళ్ల నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పనుల పురోగతిపై అక్కడి లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, పీడీ మాణిక్యంను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో ఇంకా ఇళ్లు లేని అర్హులైన నిరుపేదలు ఉన్నారని, వారందరికీ రెండో విడతలో ఇళ్లు మంజూరు చేసేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సుష్మ, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మద్నూర్ ఎస్సైగా మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ



**జుక్కల్, జనవరి 16 (మనసులో మాట)**

కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం మద్నూర్ ఎస్సైగా మోహన్ రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు బిచ్కుంద ఎస్సైగా విధులు నిర్వహించిన ఈయనను మద్నూర్ కు బదిలీ చేశారు. కాగా మద్నూర్ ఎస్సైగా విధులు నిర్వహించిన రాజును మోహన్ రెడ్డి స్థానంలో బిచ్కుంద మండలంకు స్థానచలనం చేస్తూ.. ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన మోహన్ రెడ్డికి సిబ్బంది ఘన స్వాగతం పలికారు.



# ‘అరైవ్-అలైవ్‘తో ప్రయాణం సురక్షితం

**వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలి:ఎస్సై ఉదయ్ కుమార్**

**గొల్లపెల్లి, జనవరి 16 (మనసులో మాట):**

రోడ్డు ప్రమాదాల రహిత సమాజం కోసం పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘అరైవ్-అలైవ్‘ కార్యక్రమానికి వెల్గటూర్ మండలంలో శ్రీకారం చుట్టారు. జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలు డిఎస్పీ రఘు చందర్ సూచనలు,ధర్మపురి సీఐ రామ్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అంబారిపేట గ్రామంలో వెల్గటూర్ ఎస్సై ఉదయ్ కుమార్ అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్సై ఉదయ్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు భద్రత పట్ల అవగాహన కల్పిస్తూ,తగిన సూచనలు తెలియజేశారు. రోడ్డుపైన ప్రయాణించే ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచిస్తూ,మద్యం సేవించి వాహనం నడుపరాదని,సీట్ బెల్ట్ తప్పకుండ ధరించాలని మరియు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత పట్ల అవగాహన ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంబారిపేట గ్రామ ప్రజలు,పోలీస్ సిబ్బంది హాజరైనారు.

# ధూప దీప నైవేద్య పథకం పై దుష్ప్రచారం మానుకోవాలి

**ధూప దీప నైవేద్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం వీరభద్రయ్య**

**లోకాః సమస్తా సుఖినో భవంతు అన్న వేదసూక్తిని ఆధారంగా చేసుకొని సంఘం ముందుకు వెళ్తుంది**

**గజ్వేల్, జనవరి 16 (మనసులో మాట) :**

ధూప దీప నైవేద్య పథకం తో పాటు అర్చకుల పై పలువురు చేస్తున్న దుష్ప్రచారం మానుకోవాలని ధూప దీప నైవేద్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం వీరభద్రయ్య ఒక ప్రకటన లో తెలిపారు. కొందరు అర్చకులు పెద్దమనుషులుగా ప్రచారం చేసుకుంటూ వారి ఉద్యోగ ధర్మాన్ని విస్మరిస్తూ దేవాదాయ కార్యాలయం పై పెత్తనం చేయాలనుకుంటున్నారన్నారు నిరంతరం వారి పబ్బం గడుపుకోవడం కొరకు ధూప దీప నైవేద్య పథకం పై దుష్ప్రచారం చేయడం జరుగుతున్నదని అన్నారు. ప్రభుత్వం వారి ఆరోపణలు నిగ్గుతెల్చాలని సోషల్ అడిట్ కు ఆదేశించడాన్ని ధూప దీప నైవేద్య సంఘం స్వాగతిస్తున్నదని అన్నారు. ధూప దీప నైవేద్య అర్చక సంఘం పై అధ్యక్ష కార్యవర్గం పై అసత్య ఆరోపణలు చేసే వారిపై సంఘం అంతే దురుసుగా ప్రవర్తిస్తుందని హెచ్చరించారు. ధూప దీప నైవేద్య అర్చక సంఘం తెలంగాణ ప్రజలు పాలకులు బాగుండాలని ప్రభుత్వం ద్వారా అర్చక సంక్షేమం జరిగి అర్చక కుటుంబాలు బాగుండాలనే ఉద్దేశంతో కీ శే గంగు భానుమూర్తి ఆలోచనతో సంఘం



ఆవిర్భవించిందని తెలిపారు. తెలంగాణ ప్రజల క్షేమం కొరకు ధూప దీప నైవేద్య అర్చకుల సహకారంతో ప్రతి సంవత్సరం సంఘం ద్వారా యజ్ఞ యాగాది క్రతువులు నిర్వహిస్తామని లోకాః సమస్తా సుఖినో భవంతు అన్న వేదసూక్తిని ఆధారంగా చేసుకొని సంఘం ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. కరోనా సమయం లో కూడా తెలంగాణ ప్రజాక్షేమం కోరి ప్రభుత్వానికి అండగా సీఎం సహాయా నిధి కి హితోధికంగా సహాయం చేసిన పెద్ద మనస్సు ధూప దీప నైవేద్య అర్చకులదని, గ్రామీణ ప్రాంతాలలో దేవాలయ వ్యవస్త ను కాపాడటం కొరకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించిందని నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సర్కార్ డిడిఎన్ అర్చకులకు ఉద్యోగ భద్రత వేతన పెంపుదల చేస్తుందనే విశ్వాసం అర్చకులకు ఉన్నదని అన్నారు. డిడిఎన్ అర్చకులు ప్రభుత్వానికి అనుకూలంగా సమాజంలో మంచిని పెంపొందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం, సమాజం డిడియన్ అర్చకులకు సహకారంగా ఉండి గ్రామీణ ప్రాంతాల్లో అర్చక వ్యవస్థను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లోని ప్రాచీన ఆలయాల ద్వారా సనాతన హిందూ ధర్మాన్ని కాపాడుతున్న ధూప దీప నైవేద్య సంఘం అర్చకుల పై ఆరోపణలు ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు.

# ప్రజా హక్కుల పరిరక్షణలో పత్రిక పాత్ర కీలకం

- ‘ఇది మన హక్కు‘ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ
- పత్రిక సేవలను కొనియాడిన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్



**పెద్దపల్లి, జనవరి 16 (మనసులో మాట):**

‘ఇది మన హక్కు‘ సమాచార పత్రిక ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ గురువారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో, ప్రజలకు వారి హక్కులపై అవగాహన కల్పించడంలో ఈ పత్రిక పోషిస్తున్న పాత్ర ఎంతో కీలకమైనదని ప్రశంసించారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ, పత్రిక ముున్ముందు మరింత ప్రజాదరణ పొందాలని ఆకాంక్షించారు.

# సురక్షిత ప్రయాణమే అందరి లక్ష్యం

**రోడ్డు భద్రతపై మున్సిపల్ సిబ్బందికి డీసీపీ రామ్ రెడ్డి అవగాహన**

**నిబంధనలు పాటించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పిలుపు**



**పెద్దపల్లి, జనవరి 16 (మనసులో మాట):**

వాహనదారులు క్షేమంగా ఇంటికి చేరడమే ప్రధాన ఉద్దేశ్యంగా ప్రభుత్వం చేపట్టిన 'అరైవ్... అలైవ్' కార్యక్రమంలో భాగంగా గురువారం పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులకు రోడ్డు భద్రత నియమాలను వివరించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ... ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ఇవి చిన్న విషయాలుగా అనిపించినా, ప్రమాద సమయంలో ప్రాణకవచాలుగా మారుతాయని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ముందుగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని డీసీపీ కోరారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడటం వంటివి ప్రమాదాలకు దారి తీస్తాయని హెచ్చరించారు. సిగ్నల్స్ పాటిస్తూ, జాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రమాదరహిత సమాజానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ జి. కృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, సీఐలు కె. ప్రవీణ్ కుమార్, బి. అనిల్ కుమార్, ఎస్ఐ జె. లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన సూర్యుడి శిల్పం

**మెదక్ జిల్లాలో మొట్టమొదటి సూర్య భగవానుడు అని వెల్లడించిన కొత్త తెలంగాణ చరిత్ర బృంద సభ్యుడు బుర్ర సంతోష్**

**చిన్నశంకరం పేట మండలం సంగాయిపల్లి గ్రామంలో లభ్యం**



**చిన్నశంకరం పేట, జనవరి16 (మనసులో మాట):**

మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం సంగాయిపల్లి గ్రామంలో అరుదైన కల్యాణి చాళుక్యుల కాలం నాటి సూర్యుడి శిల్పం బయటపడింది. దీంతోకొత్త తెలంగాణ చరిత్ర బృంద సభ్యుడు బుర్ర సంతోష్ కు సమాచారం అందించారు. గ్రామస్థుల కథనం ప్రకారం నాగులమ్మ పేరుతో కొన్నేళ్లుగా పూజిస్తున్నామని ఇప్పుడు కొత్త తెలంగాణ చరిత్ర బృందం ద్వార సూర్య భగవానుడు అని తెలుసుకున్నామని గ్రామస్థులు తెలిపారు. నల్ల రాతి బసాల్ట్ శిల మీద చెక్కిన ఈ శిల్పం రెండు చేతుల్లో కలువ పూలు పట్టుకుని ఉందని అది సూర్యుడు అని, శిల్ప శైలి ప్రకారం కళ్యాణి చాళుక్యుల కాలం నాటిదని 9,10 వ శతాబ్దానికి చెందినదని కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ హరగోపాల్ వెల్లడించారు. అత్యంత అరుదుగా లభించే సూర్య భగవానుడి విగ్రహం టేక్మాల్ మండలం వేల్పుగొండ గ్రామ తుంబురేశ్వర ఆలయం గోడల మీద సూర్యుడు ఉన్నాడని, కానీ శిల్ప రూపంలో మెదక్ జిల్లాలో మొట్ట మొదటి సూర్యుడి శిల్పం సంగాయిపల్లిలో దొరకడం విశేషం. మెదక్ జిల్లా ఎంతో గొప్ప చరిత్ర కలిగిఉందని జిల్లావ్యాప్తంగా ఎన్నో శిల్పాలు ఆలయాలు ఉన్నాయని ఇలాంటి పురాతన వారసత్వ సంపదను గ్రామస్థాయిలో కాపాడుకుని తరవాత తరాలకు అందించాలని బుర్ర సంతోష్ తెలుపారు. ఇంత అద్భుతమైన శిల్పం సంగాయిపల్లి లో లభ్యం కావడం మాకు ఆనందదాయకం అని గ్రామ సర్పంచ్ గంగాధర్ ఉప సర్పంచ్ గొల్ల లక్ష్మి, పంచాయితీ కార్యదర్శి నిరంజన్ చారి గ్రామస్తులు తెలిపారు.

# కోర్కెలు తీర్చే... శక్తివంతమైన ఆలయం శ్రీ విద్యాధరి క్షేత్రం

**భారత ప్రభుత్వ అదనపు సంచాలకులు డాక్టర్ సంతోష్ కుమార్ పాండే**



**గజ్వేల్, జనవరి 16 (మనసులో మాట) :**

భక్తుల ఇలవేల్పుగా, కోరిన కోర్కెలు తీర్చే దైవంగా శక్తివంతమైన ఆలయాలు దేశంలో కొలువుదీరగా, వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రం అదే కోవకు చెందుతుందని భారత ప్రభుత్వ అదనపు సంచాలకులు డాక్టర్ సంతోష్ కుమార్ పాండే స్పష్టం చేశారు. సంక్రాంతి పర్వదినాన వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు ఆయనను శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు, అమ్మవారి జ్ఞాపక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పురాతన, పుణ్య క్షేత్రాలకు కొదవలేదని, అయితే ఆధ్యాత్మిక శక్తి, చారిత్రక నేపథ్యం, ప్రాముఖ్యత, సంస్కృతుల సమ్మేళనమే దేశానికి శ్రీరామరక్ష అని అన్నారు. పవిత్ర స్థలంగా పేరొందిన ఈ పుణ్యక్షేత్రం దినదినాభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి సంబంధించిన అంశాలు మేనేజర్ రఘు పవన్ ఆయనకు వివరించగా, సంతృప్తి వ్యక్తం చేస్తూ ఆలయ చైర్మన్ శ్రీ చంద్రశేఖర శర్మకు ధన్యవాదాలు తెలిపారు

# కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలను రద్దు చేసే వరకు పోరాటం

- గజ్వేల్‌లో 'జీపు జాతా'ను ప్రారంభించిన సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు
- కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై మండిపాటు
- ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెకు పిలుపు



**గజ్వేల్, జనవరి 16 (మనసులో మాట):**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల పొట్టకొట్టేలా చట్టాలు చేసిందని, వాటిని రద్దు చేసే వరకు రాజీలేని పోరాటం చేయాలని సీఐటీయూ (జ౫ఖ) రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు పిలుపునిచ్చారు. గురువారం గజ్వేల్ పట్టణ కేంద్రంలో 'కార్మిక కర్షక పోరుబాట'లో భాగంగా చేపట్టిన ప్రచార జీపు జాతాను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసిందని, వాటి స్థానంలో కార్పొరేట్ పెట్టుబడిదారులకు లాభం చేకూర్చేలా నాలుగు 'లేబర్ కోడ్'లను తెచ్చిందని ధ్వజమెత్తారు. ఈ కోడ్ల ద్వారా కార్మిక సంక్షేమాన్ని గాలికొదిలేశారని, పని గంటలను 12 గంటలకు పెంచడం, మహిళలతో రాత్రిపూట పని చేయించడం వంటి దుర్మార్గపు చట్టాలను రూపొందించారని ఆరోపించారు. వామపక్షాల పోరాట ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. పేదలకు ఉపాధిని దూరం చేసేలా అనేక ఆంక్షలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచాలని, రోజువారీ కూలీ రూ. 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే నూతన విత్తన చట్టం ద్వారా నకిలీ విత్తనాల తయారీకి ద్వారాలు తెరిచారని, దీనివల్ల రైతులకు విత్తనాలపై గ్యారెంటీ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశంఖం పూరించామని, ఇందులో భాగంగా జనవరి 19న జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఫిబ్రవరి 12న కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని కార్మికవర్గం, రైతాంగం ఈ పోరాటాల్లో కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లయ్య, గోపాలస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శశిధర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకట్ మావో, సీఐటీయూ జిల్లా నాయకులు బండ్ల స్వామి, భాస్కర్, రవి, బాల లక్ష్మి, వేణుగోపాల్, రంగారెడ్డి, కుమార్, యాదయ్య, సాదక్, రాజు, అభి తదితరులు పాల్గొన్నారు.

# సకల దేవతలకు నిలయం గోమాత

**ఆదినుంచీ పశువులను దైవలుగా భావించే సాంప్రదాయం మనది - భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు**

**గజ్వేల్, జనవరి 16 (మనసులో మాట) :**

సంక్రాంతి పండుగలో మూడవరోజు కనుమకు పండుగ అని పశువులను గౌరవించడమే కనుమ పండుగ ఉద్దేశం అని భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత, శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం నాడు గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో మాట్లాడుతూ గోమాత సకల దేవతలకు నిలయం అన్నారు. కనుమ పండుగకు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. పశువుల పండుగగా కనుమ పండుగను నిర్వహిస్తామన్నారు. పంటలు చేతికి అందడంతో తమకు సహాయ పడిన పశు పక్షాదులను పూజిస్తామని, సంవత్సరం పాటు పశువులు కష్టపడి పని చేసిన ఆవులను, ఎద్దులను, పూజించి ప్రేమగా చూసుకునే రోజు కనుమ పండుగగా నిర్వహిస్థామన్నారు. మనది వ్యవసాయిక దేశం గనుక పశువులు కూడా మన జీవితంలో ఒక భాగమే అన్నారు. ఆదినుంచీ పశువులను దైవలుగా భావించే సాంప్రదాయం మనది



# మినీ మేడారం జాతరలో భక్తులకు ఇబ్బందులు రావొద్దు

**23లోగా ఏర్పాట్లు పూర్తి చేయాలి: కలెక్టర్ రాహుల్ శర్మ**

**అధికారులకు దిశానిర్దేశం.. ప్రత్యేక అధికారుల నియామకం**



**భూపాలపల్లి, జనవరి 16 (మనసులో మాట):**

జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మినీ మేడారం జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, అన్ని ఏర్పాట్లను గడువులోగా పూర్తి చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పంచాయతీ రాజ్, విద్యుత్, ఇంజనీరింగ్, మిషన్ భగీరథ, గిరిజన సంక్షేమ శాఖ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులతో జాతర నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జాతర ప్రాంగణంలో, రోడ్లకు ఇరువైపులా ఉన్న పొదలు, పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలన్నారు. భక్తుల కోసం మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్లు (తాత్కాలిక మరుగుదొడ్లతో సహా), నిరంతర విద్యుత్ సౌకర్యం, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. రోడ్ల మలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ సమస్యలు రాకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన భూపాలపల్లి మండలంలోని కమలాపూర్, గుర్రంపేట ప్రాంతాల్లో రెండు జాతరలు జరుగుతున్నందున ఇద్దరు ప్రత్యేక అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు జాతర ప్రదేశాలను స్వయంగా పరిశీలించి లోటుపాట్లు సరిదిద్దాలన్నారు. ఈ నెల 23వ తేదీ లోపు అన్ని పనులు పూర్తి చేసి, శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సీపీఓ బాబురావు, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేక అధికారులు సునీల్, బాబురావు, విద్యుత్ శాఖ డీఈ రాజిరెడ్డి, ఆర్డీవో హరికృష్ణ, డీఎల్పీఓ మల్లికార్జున రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.



# 'టీఎస్-ఐపాస్' దేశానికే ఆదర్శం

**నీతి ఆయోగ్ ప్రశంసలు కేసీఆర్ దార్శనికతకు నిదర్శనం**

**పదేళ్లలో 2.6 లక్షల కోట్ల పెట్టుబడులు, 25 లక్షల ఉద్యోగాలు**

**కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయలేరు: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్, జనవరి 17 (మనసులో మాట):**

రాష్ట్రాన్ని పారిశ్రామిక విప్లవానికి కేంద్రంగా మార్చాలన్న సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రూపకల్పన చేసిన 'టీఎస్-ఐపాస్' (ఋా-ఔఋాఋా) విధానం దేశంలోనే అత్యుత్తమమైనదని సాక్షాత్తు 'నీతి ఆయోగ్' తన తాజా నివేదికలో ప్రశంసించడం యావత్ తెలంగాణకు గర్వకారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ విధానం జాతీయ స్థాయిలో అందరికీ అనుసరణీయమని కేంద్ర సంస్థ పేర్కొనడం కేసీఆర్ దార్శనికతకు నిలువెత్తు నిదర్శనమని అన్నారు. ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను పదేళ్లలో దేశానికే పారిశ్రామిక దిక్సూచిగా మార్చడంలో టీఎస్-ఐపాస్ కీలక పాత్ర పోషించిందన్నారు. భారీ పరిశ్రమలతో పాటు, 'ఎంఎస్ఎంఈ' (మీూవీజు) విభాగంలో రూ. 2.6 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, 25 లక్షల మందికి పైగా యువతకు గౌరవప్రదమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం దేశ చరిత్రలోనే సువర్ణ అధ్యాయమని అభివర్ణించారు. పరిశ్రమల ఏర్పాటుకు ఉండే అడ్డంకులను తొలగించి, 'సింగిల్ విండో' ద్వారా కేవలం 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అవినీతికి తావులేని, అత్యంత పారదర్శకమైన విధానాన్ని దశాబ్దకాలం పాటు చిత్తశుద్ధితో అమలు చేయడం వల్లే నేడు జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని తెలిపారు. గతంలో రైతుబంధు, మిషన్ భగీరథ, టీ-హబ్ వంటి పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని, ఇప్పుడు పారిశ్రామిక విధానం కూడా 'తెలంగాణ మోడల్' ఆచరణీయమని నీతి ఆయోగ్ తేల్చి చెప్పిందని గుర్తు చేశారు. అభివృద్ధిని కొనసాగించాల్సింది పోయి, కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామనే భ్రమల్లో బతికే అరాచక శక్తులు ఇకనైనా బుద్ధి తెచ్చుకోవాలని కేటీఆర్ హితవు పలికారు.





# రాఘవపట్నంలో సంక్రాంతి శోభ

- ముగ్గుల పోటీల్లో 89 మంది మహిళల ఉత్సాహం
- ఆకట్టుకున్న వాలీబాల్ పోటీలు
- విజేతలకు బహుమతులు అందజేత

**గొల్లపల్లి, జనవరి 16 (మనసులో మాట):**

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామంలో సంబరాలు అంబరాన్నంటాయి. కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఈ వేడుకల్లో గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంక్రాంతి సంబురాల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. సుమారు 89 మంది మహిళలు పోటీపడి రంగురంగుల ముగ్గులతో గ్రామానికి కొత్త కళ తెచ్చారు. ఇందులో ప్రథమ బహుమతిని కొలకాని పద్మ, ద్వితీయ బహుమతిని కాళ్ళ మౌనిక, తృతీయ బహుమతిని బోనాల మానస గెలుచుకున్నారు. విజేతలతో పాటు పోటీలో పాల్గొన్న వారందరికీ నిర్వాహకులు బహుమతులు అందజేశారు. గ్రామ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు సంఘం అధ్యక్షులు బూస లింగయ్య తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకూ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిరవేణి రవి, మాజీ సర్పంచ్ తిరుపతి గౌడ్, మాజీ ఎంపీటీసీ మధుకర్ రెడ్డి, నాయకులు ప్రవీణ్ గౌడ్, సంఘం అధ్యక్షులు లింగయ్య, సెక్రటరి మల్లేశం, డైరెక్టర్లు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# క్రీడలతోనే మానసిక ఉల్లాసం

- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి: బీజేపీ నేత నల్ల మనోహర్ రెడ్డి
- వడ్కాపూర్‌లో ఉత్సాహంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు
- విజయవంతంగా నిర్వహించిన యువజన సంఘం సభ్యులు



**జూలపల్లి, జనవరి 16 (మనసులో మాట):**

యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని బీజేపీ రాష్ట్ర నాయకులు నల్ల మనోహర్ రెడ్డి అన్నారు. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం వడ్కాపూర్ గ్రామంలో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీజేపీ మాజీ ఎంపీటీసీ ఎర్రోళ్ల రాములుతో కలిసి క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, మంచి అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. క్రీడలు కేవలం వినోదం కోసమే కాకుండా, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఐక్యతా భావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం గంట సమయం క్రీడలకు కేటాయించి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఒలింపిక్ స్థాయిలో పతకాలు సాధించి, జూలపల్లి మండలం పేరును దేశవ్యాప్తంగా నిలబెట్టాలని ఆకాంక్షించారు. గ్రామంలో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని అతిథులు కొనియాడారు. ఈ టోర్నమెంట్‌ను కటికె రెడ్డి చందు, కనకట్ల సిద్దు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంజపూర్ సోని, వార్డు సభ్యులు వేల్పుల లింగయ్య, కంది సాగర్, కనకట్ల నరసింహ, జెట్టి కుమార్, ఆకుల తిరుపతి, స్పాన్సర్లు, గ్రామ ప్రజలు మరియు క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# వార్డు సభ్యులుగా గెలిచిన బాలమిత్రులకు సన్మానం

**స్నేహ బంధాన్ని చాటుకున్న 2007 పదో తరగతి బ్యాచ్**

**అంకూస్, శంకర్ లకు పూర్వ విద్యార్థుల అభినందన**



**జూలపల్లి, జనవరి 16 (మనసులో మాట):**

రాజకీయ విజయాలు స్నేహ బంధాన్ని మరింత బలపరిచాయి. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా గెలుపొందిన తమ చిన్ననాటి స్నేహితులను, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించుకుని తమ అభిమానాన్ని చాటుకున్నారు. జూలపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్)లో 2006-2007 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన మిత్రబృందం అంతా ఒకచోట చేరి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమ సహాధ్యాయులైన ముహమ్మద్ అంకూస్ జూలపల్లి గ్రామ 10వ వార్డు సభ్యుడిగా, పబ్బాల శంకర్ అబ్బాపూర్ గ్రామ 5వ వార్డు సభ్యుడిగా విజయం సాధించడం పట్ల మిత్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజేతలను శాలువాలతో సత్కరించి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. చిన్ననాటి మిత్రులు ప్రజాసేవలో రాణించడం తమకెంతో గర్వకారణమని కొనియాడారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మెండే శ్రీనివాస్, దొడ్ల నరేష్, నగునూరి సంపత్, భవాని సింగ్, మారం కుమార్, నోముల కమలాకర్ రెడ్డి, రమేష్, లింగమూర్తి, అనీల్, సతీష్ తదితరులు పాల్గొని సందడి చేశారు.



# ఎమ్మెల్యే విజయరామరావుకు ఘన సన్మానం

**సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన జూలపల్లి కాంగ్రెస్ శ్రేణులు**

**సింగిల్ విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాలరావుకు సత్కారం**

**జూలపల్లి, జనవరి 16 (మనసులో మాట):** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పెద్దపల్లి శాసనసభ్యులు (ఎమ్మెల్యే) చింతకుంట విజయరామరావును జూలపల్లి మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం జూలపల్లి మండల కేంద్రంలో వాడ్కపూర్ సర్పంచ్, జూలపల్లి వార్డు సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు ధూళికట్ట సింగిల్ విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాలరావును కూడా శాలువాలతో సత్కరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో, నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే చేస్తున్న కృషిని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ యూత్ కాంగ్రెస్ జూలపల్లి మండల అధ్యక్షులు మానుమండ్ల శ్రీనివాస్, మాజీ ప్రధాన కార్యదర్శి కోరేపు సంపత్, యూత్ కాంగ్రెస్ జూలపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు అమరగాని సాయి గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు గుండా సాగర్ ముదిరాజ్, మోదుంపల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# గృహజ్యోతి లబ్ధిదారులకు పత్రాల పంపిణీ



**జుక్కల్, జనవరి 16 (మనసులో మాట)**

కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం గృహ జ్యోతి పథకం కింద లబ్ధి పొందుతున్న వినియోగదారులకు రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్ కో సిబ్బంది ద్వారా లబ్ధిదారు పత్రాలను పంపిణీ చేయి స్తుంది. ఇందులో భాగంగా శుక్రవారం మద్నూర్ మండలం పెద్ద ఎక్లరా గ్రామంలో సోమావార్ మహేష్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్క రాష్ట్ర ప్రభుత్వం గృహ జ్యోతి పథకం కింద అందిస్తున్న లబ్ధిని వివరిస్తూ రూపొందించిన పత్రాన్ని వినియోగదారులకు అందజేస్తున్నారు. రాష్ట్రంలో 52 లక్షల 82 వేల 498 మంది వినియోగదారులు గృహ జ్యోతి పథకంలో లబ్ధి పొందుతున్నారు. వీరి కోసం ప్రభుత్వం ప్రతి నెల రూ. 3,593 కోట్లు ఖర్చు చేస్తుంది. గృహజ్యోతిలో మినహాయించిన మొత్తాన్ని కుటుంబ అవసరాలకు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. లబ్ధిదారుడి పేరు గృహ జ్యోతి సర్వీస్ నెంబరు ఉన్న ఈ పత్రాన్ని లబ్ధిదారులకు అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంగ్రామ్ సీనియర్ నాయకులు హన్మంత్ రావ్ దేశాయ్ మాజీ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ పటేల్ వాలంకే ప్రహ్లాద్ మద్యప్ప స్వామి ముంగ్డే వార్ బస్వంత్ రావ్ విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# 18న వేంకటేశ్వర స్వామి కళ్యాణం

**స్వామివారి సేవలో 'యువతరం'**

**కళ్యాణోత్సవానికి రూ. 11,116 విరాళం అందజేత**

**పల్లెపహాడ్ (ఆర్ అండ్ ఆర్ కాలనీ)లో మాఘ అమావాస్య జాతర ఏర్పాట్లు**

**గజ్వేల్, జనవరి 16 (మనసులో మాట):**

సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు, ఆర్ అండ్ ఆర్ కాలనీ (పల్లెపహాడ్)లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ నెల 18న (ఆదివారం) మాఘ అమావాస్య జాతరను పురస్కరించుకుని శ్రీ పద్మావతి, అలివేలు మంగ సహిత వేంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ పవిత్ర కార్యం కోసం గ్రామానికి చెందిన 'యువతరం యూత్' నాయకులు తమ వంతు భక్తిని చాటుకున్నారు. స్వామివారి కళ్యాణ నిర్వహణ నిమిత్తం రూ. 11,116 విరాళాన్ని ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి చక్రపాణికి అందజేశారు. ఈ సందర్భంగా యువతరం యూత్ నాయకులు మాట్లాడుతూ... ప్రతి ఏటా మాఘ అమావాస్య జాతరను, స్వామివారి కళ్యాణాన్ని గ్రామ ప్రజల ఐకమత్యంతో ఘనంగా జరుపుకుంటున్నామని గుర్తుచేశారు. ఈసారి కూడా గ్రామంలోని పెద్దలు, యువకులు, కుల సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు భక్తిశ్రద్ధలతో పాల్గొని, ఈ వేడుకకు తమకు తోచిన సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. స్వామివారి సేవ కోసం ముందుకొచ్చి ఆర్థిక సాయం అందించిన యువతరం యూత్ సభ్యులను గ్రామస్తులు, ఆలయ వర్గాల వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో యువతరం యూత్ నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# 18న పాలేరుకు సీఎం రేవంత్ రెడ్డి

**రూ. 362 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం**

**చారిత్రక ఘట్టం.. మేడారంలో రాష్ట్ర క్యాబినెట్ భేటీ: మంత్రి పొంగులేటి**



**ఎదులపురం జనవరి16 ( మనసులో మాట)**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత ఉమ్మడి జిల్లాల పర్యటనలో భాగంగా ఈ నెల 18న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పర్యటనలో భాగంగా మొత్తం రూ. 362 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు.

## పాలేరు గడ్డపై అభివృద్ధి పండుగ

మద్దులపల్లిలో జేఎన్టీయూ కళాశాలకు శంకుస్థాపన, నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవం చేయడంతో పాటు.. మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ నిర్మాణ పనులను సీఎం ప్రారంభిస్తారు. అదేవిధంగా మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ ను ప్రారంభిస్తారు. అలాగే కూసుమంచిలో నిర్మించిన 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొంటారని వివరించారు. ఇదే వేదికగా రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల సన్నద్ధతపై ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తలతో సీఎం దిశానిర్దేశం చేయనున్నారని పొంగులేటి తెలిపారు.

## తొలిసారిగా హైదరాబాద్ వెలుపల క్యాబినెట్ భేటీ..

రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా ఈ నెల 18న మేడారంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం (క్యాబినెట్ మీటింగ్) నిర్వహించనున్నట్లు పొంగులేటి ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎన్నడూ లేని విధంగా హైదరాబాద్ వెలుపల క్యాబినెట్ భేటీ జరగడం ఇదే ప్రథమమని పేర్కొన్నారు. "గత ప్రభుత్వంలా ఎన్నికల వేళ బొమ్మలు చూపడం మా అలవాటు కాదు.. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పనిచేసే ప్రభుత్వమిది" అని స్పష్టం చేశారు.

## కుంభమేళాకు మించి మేడారం ఏర్పాట్లు

సమ్మక్క-సారలమ్మ జాతరను కుంభమేళా కంటే అద్భుతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని మంత్రి తెలిపారు. మేడారంలో కాకతీయుల నాటి వైభవం ఉట్టిపడేలా నిర్మించిన రాతి కట్టడాలను 19వ తేదీ ఉదయం ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వెల్లడించారు. అలాగే గడువు ముగిసిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# మున్సిపాలిటీలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం



## కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

**మనసులో మాట, మంచిర్యాల:** జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శుక్రవారం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు, మందమర్రి మండల తహశీల్దార్ సతీష్, డీసీసీ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డిలతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, చెన్నూర్ నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని అనుసంధానం చేస్తూ అంతర్గత రహదారులు నిర్మించడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా మురుగు కాలువల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన నిరుపేదలకు పథకం ఫలాలు అందించేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అమృత్ పథకంలో ఇంటింటికీ నల్లా కనెక్షన్ ద్వారా నిరంతరం శుద్ధమైన తాగునీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 1వ వార్డు అల్లూరినగర్‌లో రూ.73 లక్షల 46వేలు, 2వ వార్డు తిలక్‌నగర్‌లో రూ.72లక్షల 56వేలు, 7వ వార్డులో రూ.72 లక్షల 56వేలు, 8వ వార్డు చైతన్య కాలనీలో రూ.1 కోటి 89 లక్షలు, 9వ వార్డు ఆర్ఆర్ నగర్‌లో రూ.46 లక్షలు, న్యూ తిమ్మాపూర్‌లో రూ.52 లక్షల 50వేలు, ఓల్డ్ తిమ్మాపూర్‌లో రూ.44 లక్షల 50వేలు, 12వ వార్డు గాంధీనగర్ ప్రాంతంలో రూ.6లక్షలు 17 వేలు, 13వ వార్డు ఆమ్‌నగర్ ప్రాంతంలో రూ.6 లక్షల 17 వేలు, 14వ వార్డు మల్లికార్జున నగర్ ప్రాంతంలో రూ.27లక్షల 22 వేలు, 16వ వార్డు గంగా కాలనీలో రూ.34లక్షల 64వేలు అంచనా వ్యయంతో టీయూఎఫ్ఐడీసీ, డీఎంఎఫ్టి, సీఎస్ఆర్, నగర అభివృద్ధి నిధులతో పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులను ప్రణాళికబద్ధంగా వినియోగించి పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




# పారదర్శకంగా ప్రభుత్వ పథకాల అమలు



**మనసులో మాట, కాగజ్‌నగర్:** ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నామని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం 86 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, అలాగే 11 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుని అప్పుల పాలయ్యే పరిస్థితిని నివారించేందుకు సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. కాగజ్‌నగర్ మండలంలోని కోసిని డ్యాం సుందరీకరణ, పర్యాటక అభివృద్ధి కోసం రూ.1.80 కోట్లు మంజూరు చేయించామని పేర్కొన్నారు. పట్టణంలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.18.70 కోట్లు యూఐడీఎఫ్ నిధులు మంజూరై టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందని, తాగునీటి వసతుల మెరుగుదలకు రూ.34.50 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. అమృత్ 2.0 పథకం ద్వారా కాగజ్‌నగర్ పట్టణంలో రూ.200 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ అమలు కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మధుకర్, ఎంపీడీఓ ఉజ్వల్, బీజేపీ పట్టణ అధ్యక్షులు ఆర్మీ శివ కుమార్, సర్పంచులు కుందారపు సుమన్, కోట వేణుయాదవ్, సంగీత, గజ్జి లింగయ్య, రాజయ్య, కొండగుర్ల ప్రకాష్, పద్మ, విలాస్, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, లబ్ధిదారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం సారూ.. కుప్టి ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేయాలి



**మనసులో మాట, ఆదిలాబాద్:** నేరడిగొండ మండలంలోని కుప్టి గ్రామ సమీపంలో కడెం వాగుపై ప్రతిపాదిత హైడల్ ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేయాలని డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ కోరారు. ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలంలోని కొరఅబశ్రీశ్రీఅబశ్రీశ్రీట--చనాక బ్యారేజ్ పంప్ హౌస్ ప్రారంభోత్సవానికి శుక్రవారం జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. బోథ్ నియోజకవర్గానికి వరప్రదాయినిగా నిలిచే కుప్టి హైడల్ ప్రాజెక్టును నిర్మించాలని, జిల్లా డీసీసీ కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కోరారు. అలాగే జిల్లాలోని ముఖ్యమైన రహదారులను మంజూరు చేయాలని విన్నవించారు. కుప్టి ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే సాగునీటి సదుపాయాలు మెరుగుపడి రైతాంగానికి, జిల్లా అభివృద్ధికి ఎంతో మేలు జరుగుతుందని వివరించారు.




# వైద్య విద్యార్థులు ప్రజాసేవకు ముందుకు రావడం అభినందనీయం

## ఉచిత దంత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పాల్వాయి

**మనసులో మాట, బెజ్జూర్:** దంత వైద్య విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్న దశ నుంచే ప్రజాసేవకు ముందుకు రావడం అభినందనీయమని సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. కీర్తి డెంటల్ అసోసియేషన్ సౌజన్యంతో తెలంగాణ డెంటల్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బెజ్జూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ డెంటల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ మనుదీప్ బలసానితో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్యం విషయంలో, ముఖ్యంగా దంత ఆరోగ్యం పట్ల మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కీర్తి డెంటల్ క్లినిక్, కాగజ్‌నగర్ వైద్యురాలు డాక్టర్ కీర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు దంత సమస్యలను నిర్లక్ష్యం చేయడం శోచనీయమన్నారు. గ్రామాల్లో పెద్దలతో పాటు పిల్లలు కూడా తంబాకు, ఖర్ర, గుట్కా, జర్దా, పాన్ మసాలాలు వాడుతున్నా రని, వీటితో దంతాలు పాడవడమే కాకుండా నోటి క్యాన్సర్ ప్రమాదం పెరుగుతుందని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో నాటు వైద్యం ద్వారా దంత సమస్యలు నయం చేయాలనే ప్రయత్నం చేయడం అన్ని సందర్భాల్లో సాధ్యం కాదని, అవగాహన లేని వారి సలహాలతో ఆరోగ్యం పాడుచేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డెంటల్ స్టూడెంట్ అసోసియేషన్ సెక్రటరీ సామల రసజ్ఞ, సభ్యులు హర్షిని, సఫియా, బెజ్జూర్ సామాజిక ఆసుపత్రి వైద్యులు శ్రవణ్ కుమార్, శ్రీనివాస్, బెజ్జూర్ సర్పంచ్ సరోజ, దుర్గం తిరుపతి, పోతేపల్లి సర్పంచ్ కుమ్మరి రామకృష్ణ, మాజీ ఎంపీపీ మనోహర్ గౌడ్, నాయకులు సామల తదితరులు పాల్గొన్నారు.





# కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్

**మనసులో మాట, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్‌లోని ఫాతిమా కాన్వెంట్ స్కూల్‌లో శుక్రవారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చి వివిధ బెల్ట్‌లను సాధించారు. ఈ కార్యక్రమానికి కాగజ్‌నగర్ సీఐ ప్రేమ్ కుమార్, ఎంఈఓ ప్రభాకర్, ఫాతిమా కాన్వెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఫ్లవరీ, ఆర్మీ రిటైర్డ్ శివ కుమార్, వైస్ ప్రెసిడెంట్ కరాటే, గ్రాండ్ మాస్టర్ వి రవి, మాస్టర్ రాజు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మాస్టర్ ఎం దేవయ్య ఆధ్వర్యంలో అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు బెల్ట్‌లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరాటే విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు రాణించాలని సూచించారు.

# ముంబై సాహిత్య సమ్మేళనానికి జిల్లా కవులకు ఆహ్వానం



**మనసులో మాట, ఆదిలాబాద్:** నవి ముంబై పన్వేల్‌లో ఈనెల 18న నిర్వహించనున్న సాహిత్య సమ్మేళనానికి ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ సాహితీవేత్తలు మధు బావల్కర్, అఖిల భారతీయ మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులేలకు ఆహ్వానం అందింది. కొంకన్ మరాఠీ సాహిత్య పరిషత్ పన్వేల్ (ముంబై), పంచశీల తరుణ్ మండల్ సావర్గం ఆధ్వర్యంలో ఈ ఆహ్వానం అందజేశారు. ఈ సాహిత్య సమ్మేళనంలో పాల్గొనడానికి శనివారం ముంబైకి బయల్దేరి వెళ్లనున్నట్లు సుకుమార్ పెట్కులే తెలిపారు. తెలంగాణలో బహుజన సాహిత్యాన్ని హిందీ, మరాఠీ, తెలుగు భాషల్లో కవితలు, అనువాద రచనల ద్వారా విస్తరింపజేస్తున్న సుకుమార్ పెట్కులే, బహుభాషా కవి మధు బావల్కర్‌లను ఈ సందర్భంగా సన్మానించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు, ప్రముఖ సాహితీవేత్త నాగనాథ్ డోలారే తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగనాథ్ డోలారే రచించిన మరాఠీ భాషలోని రెండు కవితా సంపుటి పుస్తకాలను ఆవిష్కరించనున్నారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించనుండగా, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి పలువురు కవులు, సాహితీవేత్తలు పాల్గొననున్నట్లు నిర్వాహకులు వివరించారు.

# ఆర్మీలో ఉద్యోగం సాధించిన గిరి బిడ్డ



**మనసులో మాట, నేరడిగొండ:** ఇచ్చోడ మండలంలోని సాత్ నంబర్ గ్రామానికి చెందిన రైతు కుటుంబంలో జన్మించిన గిరిజన యువకుడు రాథోడ్ అన్వేష్ కష్టాలను అధిగమించి ఆర్మీ (సీఆర్‌పీఎఫ్)లో ఉద్యోగం సాధించాడని సర్పంచ్ రాథోడ్ రమేష్ తెలిపారు. పరిమిత వనరుల మధ్య చదువుతూ, పట్టుదల, కష్టసాధన, నిబద్ధతతో లక్ష్యాన్ని సాధించి అన్వేష్ గ్రామానికి గర్వకారణంగా నిలిచాడన్నారు. దేశ సేవకు అడుగుపెడుతున్న అన్వేష్‌కు గ్రామ పెద్దలు, యువత, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

# సీఎం సభకు స్వయం సహాయక సంఘాలు



**మనసులో మాట, నేరడిగొండ(బోథ్):** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నిర్మల్ కేంద్రంగా రాష్ట్ర ముఖ్యమంత్రి తలపెట్టిన బహిరంగ సభకు మహిళా స్వయం సహాయక సంఘాలు బోథ్ మండల వ్యాప్తంగా బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా ధన్నూర్(బి) గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి ఆధ్వర్యంలో శుక్రవారం బహిరంగ సభకు శ్రేణులను తరలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత మహిళా సాధికారత దిశగా అడుగులు పడుతున్నాయని అన్నారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేస్తూ మహిళలను కోటీశ్వరులు చేయాలని సీఎం దృఢ సంకల్పంతో ఉన్నారని తెలిపారు. ఆ దిశగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, వడ్డీ లేని రుణాలు, మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, పంట కొనుగోలు వంటి ఎన్నో పథకాలు ప్రారంభించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ధన్నూర్(బి) గ్రామ ఉప సర్పంచ్ కారం సుజాత, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# సీఎంకు స్వాగతం పలికిన బోరంచు



**మనసులో మాట, ఆదిలాబాద్:** జైనథ్ మండలంలోని కొరట–చనాక బ్యారేజ్ హత్తిఘాట్ పంపు హౌస్ ప్రారంభించేందుకు శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హెలిప్యాడ్ వద్ద పలువురు జిల్లా నాయకులతో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అదేవిధంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు స్వాగతం పలికారు.



## రోహిత్‌ను తప్పించడానికి అతనే కారణం..

### భారత మాజీ క్రికెటర్ సంచలన వ్యాఖ్యలు

**ఢిల్లీ:** గతేడాది ఆస్ట్రేలియా టూరుకు ముందు రోహిత్‌ను వన్డే కెప్టెన్‌గా తప్పించి గిల్‌కు పగ్గాలు అప్పగించిన విషయం తెలిసిందే. రోహిత్అబశ్రీశ్రీపై వేటు వేయడం వెనుక హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పాత్ర ఉందని భారత మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ ఆరోపించాడు. తాజాగా ఓ జాతీయ మీడియాతో తివారీ మాట్లాడుతూ.. రోహిత్‌ను తప్పించాలని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్అబశ్రీశ్రీను గంభీర్ ప్రేరేపించి ఉండొచ్చన్నాడు. 'రోహిత్‌ను తప్పించడానికి బలమైన కారణం ఏంటో నాకు తెలియదు. అగార్కర్ కఠినమైన నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడడు. అయితే, 'అతని భుజాలపై నుంచి తుపాకీ పేల్చడానికి అతన్ని మరొకరు ప్రభావితం చేశారా?'అన్నది కూడా ఆలోచించాలి. తెర వెనుక చాలా జరుగుతాయి. కోచ్ అభిప్రాయం తీసుకోకుండా చీఫ్ సెలెక్టర్ ఇలాంటి నిర్ణయం తీసుకోరు. కాబట్టి, రోహిత్ విషయంలో ఇద్దరూ బాధ్యులే.'అని తివారీ తెలిపాడు. బీసీసీఐ మాజీ సెక్రెటరీ, ఐసీసీ చైర్మన్ జై షా.. రోహిత్‌ను తప్పించడాన్ని ఆపి ఉండాల్సిందని తివారీ అభిప్రాయపడ్డాడు.



## చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లు..

### ఆర్సీబీ సంచలన లేఖ

**బెంగళూరు:** ఐపీఎల్ 2026 టోర్నమెంట్ నేపథ్యంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. చిన్నస్వామి స్టేడియంలో 300 నుంచి 350 వరకు ఏఐ ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేయాలని బెంగళూరు కోరుతోంది. ఈ మేరకు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ కు బహిరంగ లేఖ రాసింది బెంగళూరు జట్టు యాజమాన్యం. 2025 ఐపీఎల్ సమయంలో తొక్కిసలాట జరిగి 11మంది అభిమానులు మరణించారు. ఇలాంటి నేపథ్యంలో అలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరిందట బెంగళూరు. అలా కెమెరాలు ఏర్పాటు చేస్తేనే వచ్చే సీజన్ లో చిన్నస్వామిలో మ్యాచ్ లు ఆడతామని పేర్కొందట. కెమెరాలు ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని స్పష్టం చేసిందట. అయితే దీనిపై కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.

## 9 సిక్సర్లతో విధ్వంసం

### స్టీవ్ స్మిత్ తన బ్యాటింగ్

**ఢిల్లీ:** బిగ్ బాష్ లీగ్ 37వ మ్యాచ్‌లో సిడ్నీ సిక్సర్స్, సిడ్నీ థండర్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన సిడ్నీ థండర్ నిర్ణీత 20 ఓవర్లలో భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ డేవిడ్ వార్నర్ ఆకాశమే హద్దుగా చెలరేగి కేవలం 58 బంతుల్లోనే 110 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో థండర్ జట్టు 189 పరుగుల భారీ లక్ష్యాన్ని సిక్సర్స్ ముందు ఉంచింది. 42 బంతుల్లోనే సెంచరీ.. 190 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సిడ్నీ సిక్సర్స్‌కు స్టీవ్ స్మిత్ కనీవినీ ఎరుగని ఆరంభాన్ని ఇచ్చాడు. మొదటి బంతి నుంచే బౌలర్లపై విరుచుకుపడిన స్మిత్, కేవలం 42 బంతుల్లోనే శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ఈ ఇన్నింగ్స్‌లో స్మిత్ మొత్తం 5 ఫోర్లు, 9 భారీ సిక్సర్లు బాదాడు. అతని స్ట్రైక్ రేట్ 238.09 గా నమోదు కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో హైలైట్ ఏంటంటే.. స్మిత్ ఇన్నింగ్స్ 12వ ఓవర్‌లో ఏకంగా 32 పరుగులు పిండుకున్నాడు. ఆ ఓవర్‌లో వం-సగా 4 సిక్సర్లు బాదిన స్మిత్, ఆ తర్వాత ఫోర్ కొట్టాడు. నో బాల్, వైడ్ రూపంలో వచ్చిన పరుగులతో కలిపి ఆ ఓవర్ దీదీూ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఓవర్లలో ఒకటిగా నిలిచింది.మరోవైపు సిడ్నీ సిక్సర్స్ తరపున ఆడుతున్న పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజం నిలకడగా ఆడినప్పటికీ, వేగంగా పరుగులు రాబట్టలేకపోయాడు. 39 బంతుల్లో 47 పరుగులు చేసిన బాబర్, నాథన్ మెక్ఆండ్రూ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. స్మిత్ సునామీ ముందు బాబర్ ఇన్నింగ్స్ వెలవెలబోయింది. స్మిత్ విధ్వంసంతో సిడ్నీ సిక్సర్స్ జట్టు మరో 16 బంతులు మిగిలి ఉండగానే 190 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో సిక్సర్స్ పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని మరింత మెరుగుపరుచుకుంది. వార్నర్ సెంచరీ వృథా అయినప్పటికీ, స్మిత్ వీరబాదుడు ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది.

# బంగ్లాదేశ్‌కు ఐసీసీ బృందం

### వరల్డ్‌కప్ మ్యాచ్‌ల అనిశ్చితికి తెరపడేనా?



**ఢిల్లీ, జనవరి 16** టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లను భారత్ నుంచి తలరించాలనే విషయమై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) బెట్టు వీడడం లేదు. ఇదివరకే షెడ్యూల్ ప్రకటించినందున నిర్ణయాన్ని సమీక్షించుకోవాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కోరినా బంగ్లా బోర్డు ససేమిరా అంటోంది. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా నెలకొన్న అనిశ్చితికి తెరదించేందుకు ఐసీసీ స్వయంగా రంగంలోకి దిగనున్నది. చివరి ప్రయత్నంగా ఇద్దరు సీనియర్ ప్రతినిధులను బంగ్లా దేశ్ బోర్డు సభ్యులతో చర్చించేందుకు పంపించనుంది. భారత్, శ్రీలంక వేదికగా ఫిబ్రవరి 7 నుంచి టీ20 ప్రపంచకప్ షురూ కానున్నది. ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించిన ఐసీసీ.. వేదికలను కూడా ఖరారు చేసింది. కానీ, బంగ్లాదేశ్ బోర్డు మాత్రం తమ జట్టును భారత్‌కు పంపించబోమని భీష్మించుకుంది. దాంతో, ఆ దేశ బోర్డుతో చర్చలు మొదలెట్టింది ఐసీసీ. భద్రతా కారణాలరీత్యా ఇండియాలో ఆడబోమనే నిర్ణయంపై పునరాలోచన చేయాలని వీడియో కాల్‌లో కోరినప్పటికీ బంగ్లా బోర్డు 'అదేం కుదరదు' అంటోంది. అందుకని ఇద్దరు సీనియర్ ప్రతినిధులను ఆ దేశానికి పంపి.. వారికి భరోసా కల్పించాలని ఐసీసీ భావిస్తోంది. ప్రపంచ క్రికెట్‌లో బంగ్లాదేశ్‌ను తాము వేరుగా చూడబోమనే నమ్మకాన్ని వారికి కలిగించి.. భారత్‌లో వరల్డ్‌కప్ ఆడేందుకు ఒప్పించనుంది.

### ఇండియాలో కాకుండా..

బంగ్లాదేశ్‌లో ఈమధ్య హిందువుల హత్య ప్రభావం చివరకు టీ20 ప్రపంచకప్‌పై పడింది. ఐపీఎల్ వేలంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ ను కొనడంపై విమర్శలు వెల్లువెత్తడంతో.. చివరకు ముస్తాఫిజుర్‌పై వేటు పడింది. దాంతో, ఒక్క ఆటగాడికే భద్రత కల్పించలేని బీసీసీఐ ప్రపంచకప్‌లో మా జట్టుకు, కోచింగ్ సిబ్బందికి, అభిమానులకు రక్షణ ఇస్తుందనే నమ్మకం మాకు లేదని బంగ్లా బోర్డు అంటోంది. ఇదే కారణంతో వరల్డ్‌కప్ మ్యాచ్‌లను భారత్ నుంచి తరలించాలని ఐసీసీకి లేఖ రాసింది. అప్పటినుంచి బంగ్లా జట్టు మ్యాచ్‌లపై అనిశ్చితి నెలకొంది. ఇండియాలో కాకుండా ఎక్కడమైనా తాము ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడుతామని ఐసీసీతో వీడియో కాల్‌లో ఆ దేశ బోర్డు పునరుద్ఘాటించింది. ప్రపంచకప్ షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 7న ఈడెన్ గార్డెన్స్‌లో వెస్టిండీస్‌తో బంగ్లా తలపడాలి.

## రాధా యాదవ్ అర్ధశతకం



**నవీ ముంబై:** మహిళల ప్రిమియర్ లీగ్‌లో భాగంగా గుజరాత్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో బెంగళూరు బ్యాటింగ్ ముగిసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసింది. టాప్ ఆర్డర్ విఫలమైనా రాధా యాదవ్(66) అర్ధశతకంతో ఆకట్టుకుంది. రాత్రి 11 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు.. రిచా ఘోష్ (44) రాణించగా.. చివర్లో క్లర్క్(26) మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. హారిస్(17), కెప్టెన్ స్మృతి మంధాన(5), హేమలత(4), గౌతమి నాయక్(9), అరుంధతి(2ఌ), శ్రేయంక(0ఌ) పరుగులు చేశారు. గుజరాత్ బౌలర్లలో సోఫీ 3, కశ్వీ గౌతమ్ 2 వికెట్లు తీయగా.. రేణుక, జార్జియా చెరో వికెట్ పడగొట్టారు.

## అంధుల క్రికెట్‌జట్టు కెప్టెన్ దీపికకు అరుదైన గౌరవం

### రాష్ట్రపతి కార్యాలయం నుంచి పిలుపు



**ఢిల్లీ:** భారత మహిళా అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్, తెలుగు తేజం దీపికకు అరుదైన గౌరవం దక్కింది. దేశ రాజధాని ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రత్యేక అతిథిగా హాజరు కావాలని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమెను ఆహ్వానించారు. శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండల పరిధిలోని తంబాలహట్టి గ్రామానికి చెందిన దీపిక, అంధత్వాన్ని జయించి క్రికెట్ రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఇటీవల జరిగిన మహిళా అంధుల టీ-20 ప్రపంచకప్ లో భారత జట్టును అద్భుతంగా నడిపించి, భారత్‌ను విజేతగా నిలబెట్టడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. ఈ మేరకు ప్రెసిడెంట్ ఆఫీసు నుంచి పంపిన అధికారిక ఆహ్వాన పత్రికను తపాల శాఖ అధికారులు స్వయంగా దీపిక స్వగ్రామానికి వెళ్లి ఆమెకు అందజేశారు. క్రీడల్లో ఆమె కనబరిచిన అంకితభావం, పట్టుదలకు గుర్తింపుగా ఈ గౌరవం దక్కిందని పలువురు ప్రశంసల జల్లు కురిపించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ.. దేశ ప్రథమ పౌరురాలి నుంచి పిలుపు రావడం నా జీవితంలో మర్చిపోలేని అనుభూతి అని అన్నారు. ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలను స్వయంగా వీక్షించే అవకాశం లభించడం లక్కీగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈ అరుదైన గౌరవం నాపై మరింత బాధ్యతను పెంచిందని దీపిక కామెంట్ చేశారు.




## తిలక్ స్థానంలో డేంజరస్ బ్యాటర్

### కివీస్‌తో టీ20 సిరీస్అబశ్రీశ్రీకు ఎంపిక చేసిన సెలెక్టర్లు

**న్యూ ఢిల్లీ:** భారత స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ రెండేళ్ల తర్వాత తిరిగి టీ20 జట్టులోకి పునరాగమనం చేయబోతున్నాడు. ఇదే నెలలో న్యూజిలాండ్‌తో జరిగే టీ20 సిరీస్అబశ్రీశ్రీతో రీఎంట్రీ ఇవ్వనున్నాడు. డిసెంబర్ 20నే కివీస్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టును బీసీసీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఆ జట్టులో భాగమైన తెలుగు కుర్రాడు తిలక్ వర్మ సర్జరీ కారణంగా తొలి మూడు టీ20లకు దూరమైన విషయం తెలిసిందే. తిలక్ స్థానంలో సెలెక్టర్లు తాజాగా శ్రేయస్ అయ్యర్‌ను ఎంపిక చేశారు. అయ్యర్ తొలి మూడు టీ20లకు సెలెక్ట్ చేసినట్టు బోర్డు శుక్రవారం తెలిపింది. మిగతా రెండు మ్యాచ్‌లకు కూడా తిలక్ అందుబాటులో లేకపోతే అయ్యరే కొనసాగే అవకాశాలు ఉంటాయి. అయ్యర్ చివరిసారిగా 2023 డిసెంబర్‌లో భారత్ తరపున టీ20 మ్యాచ్ ఆడాడు. మరోవైపు, ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ గాయం కారణంగా టీ20 సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. కివీస్‌తో తొలి వన్డేలో బౌలింగ్ చేసేటప్పుడు పక్కటెముక కింది భాగంలో అసౌకర్యానికి గురయ్యాడు. స్కానింగ్‌లో సైడ్ స్ట్రెయిన్ ఉన్నట్టు నిర్ధారణ అయ్యిందని, కొన్ని రోజులపాటు అతనికి వైద్యులు విశ్రాంతి సూచించారని బోర్డు తెలిపింది. ఇప్పటికే సుందర్ వన్డే సిరీస్అబశ్రీశ్రీకు దూరమైన విషయం తెలిసిందే. ఇప్పుడు టీ20 సిరీస్‌కు కూడా అందుబాటులో ఉండటం లేదని బోర్డు పేర్కొంది. అతని స్థానంలో టీ20 జట్టులోకి స్పిన్నర్ రవి బిష్ణోయ్‌ను తీసుకున్నట్టు వెల్లడించింది. భారత జట్టు ప్రస్తుతం న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ ఆడుతోంది. తొలి రెండు వన్డేల్లో ఇరు జట్లు చెరోటి గెలవగా.. నిర్ణయాత్మక మూడో మ్యాచ్ ఆదివారం జరగనుంది. వన్డే సిరీస్ ముగిసిన వెంటనే ఐదు టీ20 సిరీస్ ప్రారంభంకానుంది. నాగ్‌పూర్‌లో తొలి టీ20 జరగనుంది.

## అఫ్గానిస్తాన్‌కు భారీ షాక్




**ఢిల్లీ, జనవరి 16 :** టీ20 ప్రపంచకప్-2026కు ముందు అఫ్గానిస్తాన్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్ నవీన్ ఉల్ హక్ గాయం కారణగా ఈ మెగా టోర్నీ నుంచి తప్పుకొన్నాడు. నవీన్ గత కొంతకాలంగా భుజం నొప్పితో బాధపడుతున్నాడు. అయితే వరల్డ్‌కప్ సమయానికి అతడు కోలుకుంటాడని జట్టులో సెలెక్టర్లు ఛాన్స్ ఇచ్చారు. కానీ అతడి గాయం తీవ్రత మరింత ఎక్కువైనట్లు తెలుస్తోంది. దీంతో అతడు నెలాఖరులో తన గాయానికి శస్త్రచికిత్స చేయించుకోనున్నట్లు సమాచారం. ఈ కారణంతోనే వరల్డ్‌కప్‌తో పాటు వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌కు అతడు దూరమయ్యాడు. అతడు పూర్తిగా కోలుకోవడానికి మరి కొన్ని నెలల పట్టనున్నట్లు అఫ్గాన్ క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. ఈ రైట్ ఆర్మ్ పేసర్ దాదాపు ఏడాది నుంచి జాతీయ జట్టు తరపున ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఆసియాకప్-2025కు కూడా దూరంగా ఉన్నాడు. కాగా నవీన్ స్దానంలో ఇంకా అధికారికంగా ఎవరినీ ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు ప్రకటించలేదు. రిజర్వ్ ఆటగాళ్లుగా ఉన్న జియా ఉర్ రెహ్మాన్ షరీఫీ, అల్లా గజన్ఫర్ లేదా ఇజాజ్ అహ్మద్‌జాయ్‌లలో ఒకరు ప్రధాన జట్టులోకి వచ్చే అవకాశముంది.

### టీ20 ప్రపంచ కప్ 2026కు అఫ్గాన్ జట్టు:

రషీద్ ఖాన్ (కెప్టెన్), నూర్ అహ్మద్, అబ్దుల్లా అహ్మద్‌జాయ్, సెడిఖుల్లా అటల్, ఫజల్‌హాక్ ఫరూఖీ, రహ్మానుల్లా గుర్బాజ్, మహ్మద్ ఇషాక్, షాహిదుల్లా కమల్, మహ్మద్ నబీ, గుల్బాదిన్ నాయబ్, అజ్మతుల్లా, రమ్‌మానులీ, రమ్‌మతుల్లా, ఉమర్‌జాయి, జద్రాన్. రిజర్వ్‌లు: అల్లా ఘుజన్‌ఫర్, ఇజాజ్ అహ్మద్‌జాయ్ మరియు జియా ఉర్ రెహ్మాన్ షరీఫీ

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక




# పూరి-సేతుపతి మూవీ టైటిల్ స్లమ్ డాగ్

విజయ్ సేతుపతి -పూరి జగన్నాథ్ కాంబోలో రానున్న సినిమా టైటిల్ ఖరారయ్యింది. ఇప్పటివరకూ 'పూరి సేతుపతి'గా ప్రచారంలో ఉన్న ఈ సినిమా టైటిల్‌ను తాజాగా ప్రకటించారు. ఈ చిత్రానికి 'స్లమ్ డాగ్' అనే పేరు ఖరారు చేశారు. '33 టెంపుల్ రోడ్' అనేది ఉపశీర్షిక. టైటిల్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి ఆసక్తికర లుక్‌లో కనిపించారు. చేతిలో కత్తి పట్టుకొని కళ్లజోడుతో పవర్‌ఫుల్‌గా ఉన్నారు. ఈ పోస్టర్‌ను పంచుకున్న టీమ్ ఆసక్తికర క్యాప్షన్‌ను షేర్ చేసింది. 'మురికివాడల నుంచి ఎవరూ తట్టుకోలేని తుపాను వస్తుంది.. అది చాలా భయంకరంగా ఉంటుంది' అనే క్యాప్షన్ ఇందులో విజయ్ పాత్ర తీరును తెలిపేలా ఉంది. ఎన్నో రోజులుగా ఈ సినిమాకు రకరకాల టైటిల్స్ వినిపించాయి. ఇప్పుడు వాటికి చెక్ పెడుతూ 'స్లమ్ డాగ్'ను అధికారికంగా ప్రకటించారు. గతేడాది జులై మొదటివారంలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభించి ఐదు నెలల్లోనే కంప్లీట్ చేసేశారు. పాన్ ఇండియా స్థాయిలో ఇది విడుదల కానుంది. సంయుక్త కథానాయికగా నటించారు. టబు (ఃజీశబీ), విజయ్‌కుమార్ కీలక పాత్రలు పోషించారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా ఓ వినూత్న కథాంశంతో ఈ చిత్రం ముస్తాబైంది. విజయ్ సేతుపతి ఇందులో మునుపెన్నడూ చేయని విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు.

# 70 ఏళ్ల వయసులో ఇంత ఎనర్జీ ఎక్కడిది ప్రసాదం

## ఓ అభిమాని చిలిపి.. కొంటె ప్రశ్నలతో లేఖ



**మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో తెరకెక్కిన తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు' సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని అందుకుంది. ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు మెగా అభిమానులను కూడా ఈ సినిమా విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా చాలా కాలం తర్వాత చిరంజీవి క్లాసిక్ స్టైల్, వింటేజ్ ఛార్మ్‌తో కనిపించడం అభిమానులకు పెద్ద పండుగగా మారింది. ఈ సినిమా విజయోత్సాహం మధ్య ఒక అభిమాని చేసిన ఎమోషనల్ ఎక్స్‌ప్రెషన్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. మెగాస్టార్ సినిమాలతో తన బాల్యం, యవనాన్ని గుర్తు చేసుకుంటూ ఓ వీరాభిమాని చిరంజీవికి ఓ లేఖ రాశాడు. ఆ లేఖలో చిరంజీవి సినిమాలు తన జీవితానికి ఇచ్చిన ప్రేరణ, కుటుంబంతో కలిసి థియేటర్లలో చూసిన అనుభవాలు, అభిమానిగా ఎదిగిన ప్రయాణాన్ని భావోద్వేగంగా వివరించాడు.**

### ఓయ్ ప్రసాదు? ఇదుగో నిన్నే..

'నిన్నేనయ్యా ప్రసాదూ. అసలు నువ్వేం చేస్తున్నావో నీకైనా అర్థమవుతుందా? ఏడు పదుల వయసులో జనాలు ఎంఆర్ఐ స్కాన్లు, ఎక్స్ రేలు, రక్త పరీక్షలు, డయాలసిస్ అంటూ డాక్టర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న కాలంలో హుక్కు స్టెప్పు హుక్కు స్టెప్పు అంటూ డ్యాన్సులు వేసి ఎవరిని రెచ్చగొడదామని నీ ప్లాన్. అసలు నాకొకటి అర్థం కాక అడుగుతాను. చిన్నప్పుడు యముడికి మొగుడు పాటను బ్లాక్ అండ్ వైట్ టీవీలో గుడ్లప్పగించి చూస్తుంటే మా నాన్న భుజం మీద చరిచి చెప్పేవాడు ఒంట్లో స్ప్రింగులు ఉన్నోడే చిరంజీవి అని'. అప్పుడర్థమయ్యేది కాదు. చెడ్డీలకు బటన్లు ఊడిపోతే పిన్లు పెట్టుకుని స్కూలుకు పరిగెత్తే మధ్య తరగతి జీవితాల్లో బ్లాక్ టికెట్లు కొనే వైరస్ తెచ్చింది నీ గ్యాంగ్ లీడర్, ఘరానా మొగుడు సినిమాలే. క్లాసులో బెంచీల మీద నీ డైలాగులు అప్పజెబుతూ టీచర్ కు దొరికిపోతే వీపు మీద కర్ర దెబ్బలు ఎందుకు నొప్పనిపించలేదో తెలుసా? బోలో బోలో బోలో రాణి క్యా చాహీయే అంటూ నువ్వు ఖాకీ కోటుని ఎగరేసి, తిరగేసి డాన్సు చేయడం గుర్తుకు వస్తే మాస్టారి బెత్తం దెబ్బ ఒక లెక్కా' 'సరే చిన్నప్పటి ముచ్చట్లు ఇప్పుడెందుకులే ప్రసాదు విషయానికి వద్దాం. ముందు ఒక మాట చెప్తా గుర్తు పెట్టుకో. నీ మనవళ్లు మనవరాళ్లతో ఆడుకుంటున్న వీడియోలు ఆడియోలు మాకు చూపెట్టకు. వాళ్ళు నిన్ను తాత అంటే ఒప్పుకునే పరిస్థితిలో మేం లేం. ఎందుకంటే నువ్వు మాకెప్పటికీ కాళీవి, ఆటో జానీవి, రాజువి, ఇప్పుడీ ప్రసాదువి. అంతే నో డిబేట్. శశిరేఖతో ప్రేమలో పడే సీన్లలో నీలో ఆ పెళ్లి కాని కళని మొహంలోకి ఎలా తీసుకొచ్చావో ఎంత రాకెట్ సైన్స్ చదివినవాడైనా చెప్పలేడు. నా పందెం పది వేలు. అమాయకత్వం, తింగరితనం కలగలసి నీ టైమింగ్ లో ప్రేక్షకులు మునకలు వేస్తుంటే ఒక ఇంటెలిజెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ ఇంత సిల్లీగా ఉంటాడానే లాజిక్ మాకెందుకు గుర్తుకు వస్తుంది చెప్పు. గ్రేసుకే బాసులా ఒళ్ళు వయ్యారంగా తిప్పుతూ పక్కన నయనతార ఉన్న సంగతే మర్చిపోయేలా చేస్తే ఇద్దరి మధ్యా వయసు వ్యత్యాసాన్ని ఎలా గుర్తిస్తాం. అంత చిన్న పిల్లలు ఈ పెద్దాయన ప్రసాద్ కొడుకు కూతురాని నా కొడుక్కు అనిపించలేదంటే దాన్ని స్క్రీన్ ప్రెజెన్స్ అనాలా లేక మాస్ భాషలో దొంగ సచ్చినోడు అనాలా నాకైతే అర్థం కాలేదు' అంటూ లేఖను కొనసాగించాడు.

# శివాజీ చేసిన వ్యాఖ్యలు తప్పే

## నటుడు హర్షవర్ధన్ కామెంట్స్



స్వేచ్ఛలో దుస్తులు భాగం.. కానీ, దుస్తులు మాత్రమే స్వేచ్ఛ కాదన్నారు నటుడు హర్షవర్ధన్. కొన్ని రోజులుగా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారిన శివాజీ కామెంట్స్‌పై ఆయన ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడారు. ప్రస్తుతం హర్ష కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సున్నితమైన విషయాన్ని బాగా వివరించారంటూ ఆయన్ను నెటిజన్లు సపోర్ట్ చేస్తున్నారు.'దొంగల మనసు మార్చే కన్నా.. ఇంటికి తాళం వేసుకోవడం ఉత్తమం. అది నా చేతిలో ఉన్న పని. నా ఇంట్లో వాళ్లకు జాగ్రత్తగా ఉండండి అని చెప్పడం నాకు సులభం. అంతేకానీ, దొంగల్లారా ఆలోచించండి.. నేను లేని సమయంలో ఒంటరిగా ఉన్న నా వాళ్లపై దాడి చేయకండి అని దొంగలకు చెప్పడం కష్టం. గత కొన్ని రోజులుగా సాగుతోన్న అంశంపై ఆలోచిస్తే ఒక విషయం అర్థమవుతుంది. రెండు టాపిక్‌లను ఎప్పుడూ కలపకూడదు. స్వేచ్ఛ గురించి మాట్లాడితే దానిమీదే ఫోకస్ చేయాలి.. దుస్తుల గురించి అయితే వాటి గురించే మాట్లాడాలి. మంచి ఉద్దేశంతో ఏదైనా చెప్పాలనుకున్నప్పుడు మాట్లాడేతీరు సరిగ్గా లేకపోతే వాళ్ల శివాజీ, అనసూయలు అవుతారు. శివాజీ మాట్లాడిన తీరు మాత్రమే తప్పు.. స్వేచ్ఛ అనే దానిలో చాలా రకాలు ఉంటాయి. కేవలం మోడ్రన్ దుస్తులు ధరించడం మాత్రమే స్వేచ్ఛ కాదు. వాటి గురించి మాట్లాడే సమయంలో స్వేచ్ఛ అనే పదాన్ని వాడకూడదు. మనం ఉంటున్న ప్రదేశాన్ని బట్టి కూడా మన డ్రెస్సింగ్ ఆధారపడి ఉంటుంది అని హర్షవర్ధన్ చెప్పారు.

# ఆగని ధురంధర్ దూకుడు

## 15న ఒక్కరోజే మూడుకోట్ల వసూళ్లు



రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన స్పై యాక్షన్ థ్రిల్లర్ ధురంధర్ బాక్సాఫీస్ వద్ద తన జోరు ఇంకా తగ్గించలేదు. విడుదలై ఆరు వారాలు పూర్తయినా, ఈ సినిమా కలెక్షన్ల పరంగా రోజుకో కొత్త రికార్డును నమోదు చేస్తూ ఇండియన్ సినీ పరిశ్రమలో అరుదైన ఘనతలు సాధిస్తోంది. ముఖ్యంగా విడుదలైన 42వ రోజున భారీ వసూళ్లు రాబట్టి సినీ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఇండియన్ సినిమాల చరిత్రలో 42వ రోజున అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ధురంధర్ నిలవడం విశేషం. జనవరి 15న మాత్రమే ఈ చిత్రం సుమారు రూ.3 కోట్ల నికర వసూళ్లు సాధించింది. ఇంతకు ముందు ఈ రికార్డు ఛావా (రూ.1.35 కోట్లు) పేరిట ఉండగా, దాన్ని భారీ తేడాతో ధురంధర్ బ్రేక్ చేసింది. ఈ సినిమా థియేటర్లలోకి వచ్చిన మొదటి రోజు నుంచే బలమైన పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. రూ.28 కోట్ల ఓపెనింగ్‌తో మొదలైన ఈ చిత్రం, తొలి మూడు రోజుల్లోనే వంద కోట్ల మార్క్‌ను దాటేసింది. మొదటి వారాంతం ముగిసే సరికి దాదాపు రూ.103 కోట్ల వసూళ్లు నమోదు చేసి ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తొలి వారం మొత్తం కలెక్షన్లు రూ.207 కోట్లకు పైగా ఉండటం ఈ సినిమాకు ఉన్న క్రేజ్‌ను స్పష్టంగా చూపించింది. రెండో వారం వచ్చాక కూడా గ్రాఫ్ పడిపోకుండా మరింత బలంగా నిలిచింది. ముఖ్యంగా వీకెండ్లలో ప్రేక్షకుల తాకిడి పెరగడంతో 9వ, 10వ రోజుల్లో రికార్డు స్థాయి వసూళ్లు నమోదయ్యాయి. రెండో వారం ముగిసే సరికి మరో రూ.250 కోట్లకు పైగా కలెక్షన్లు వచ్చాయి. ఆ తర్వాత మూడో, నాలుగో వారాల్లోనూ సినిమా స్థిరమైన రన్ కొనసాగిస్తూ వరుసగా రూ.172 కోట్లు, రూ.106 కోట్లకు పైగా వసూలు చేసింది. ఐదో వారం, ఆరవ వారాల్లో కొత్త సినిమాల పోటీ ఉన్నప్పటికీ ధురంధర్ తన స్క్రీన్లను నిలబెట్టుకుని మంచి వసూళ్లు రాబట్టింది. 39వ రోజు నుంచి 42వ రోజు వరకూ రోజుకు రూ.2 నుంచి 3కోట్ల మధ్య కలెక్షన్లు రావడం ఈ సినిమాకు లభించిన అరుదైన ఘనతగా చెప్పుకోవచ్చు. ఇప్పటి వరకు దేశీయంగా ఈ చిత్రం దాదాపు రూ.817 కోట్ల నికర వసూళ్లు నమోదు చేయగా, భారతదేశ గ్రాస్ కలెక్షన్లు రూ.976 కోట్లకు చేరుకున్నాయి. అదే సమయంలో ఓవర్సీస్ మార్కెట్లలో కూడా రూ.293 కోట్ల వరకు వసూలు చేసి, మొత్తం ప్రపంచవ్యాప్తంగా రూ.1,270 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు సాధించింది. మొత్తంగా చూస్తే, ధురంధర్ కేవలం ఒక హిట్‌గా మాత్రమే కాకుండా, దీర్ఘకాలం బాక్సాఫీస్‌పై ఆధిపత్యం చూపిన అరుదైన ఇండియన్ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఇంకా థియేటర్లలో కొనసాగుతున్న ఈ సినిమా రన్ చివరికి ఎక్కడ ఆగుతుందో చూడాల్సిందే.

# ఎన్టీఆర్-ప్రశాంత్ నీట్ మూవీలో అనిల్ కపూర్



యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా, పాన్ ఇండియా దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'డ్రాగన్' ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు పెంచుకుంటోంది. 'కేజీఎఫ్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ల తర్వాత ప్రశాంత్ నీల్ నుంచి వస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాలో బాలీవుడ్ సీనియర్ స్టార్ అనిల్ కపూర్ భాగమవుతున్నారనే వార్తలు మరింత హీట్ పెంచుతున్నాయి. ఇప్పటికే 'యానిమల్' సినిమాలో రణబీర్ కపూర్ తండ్రిగా అనిల్ కపూర్ చేసిన పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు దక్కాయి. వయసు పెరిగిన తర్వాత కూడా పవర్‌ఫుల్ క్యారెక్టర్లతో తన మార్క్ చూపిస్తున్న అనిల్, ఇప్పుడు 'డ్రాగన్'లో కూడా అంతే బలమైన పాత్రలో కనిపించబోతున్నారనే చర్చ నడుస్తోంది. ఐఎండీబీ మోస్ట్ యాంటిసిపేటెడ్ ఇండియన్ మూవీస్ జాబితాలో 'డ్రాగన్' చోటు దక్కిన విషయాన్ని పరోక్షంగా హైలైట్ చేస్తూ, ఈ ప్రాజెక్ట్‌పై తన ఆసక్తిని అనిల్ కపూర్ వ్యక్తం చేశారు. ప్రశాంత్ నీల్ సినిమాల్లో సీనియర్ నటుల పాత్రలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందన్న విషయం తెలిసిందే. 'కేజీఎఫ్'లో సంజయ్ దత్‌ను భీకరమైన విలన్‌గా చూపించి కొత్త కోణంలో ఆవిష్కరించారు. అలాగే 'సలార్'లో జగపతి బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ పాత్రలు కథకు బలమైన స్థంభాలుగా నిలిచాయి. అదే తరహాలో 'డ్రాగన్'లో అనిల్ కపూర్ పాత్ర కూడా కథను మలుపు తిప్పే స్థాయిలో ఉంటుందనే అంచనాలు పెరుగుతున్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్నారు. ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది.

CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861